www.manatelangana.news
Mana Telangana

మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 6 | సంచిక: 63 | మంగళవారం | 22 ఆగస్టు, 2017

...అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00

3 నెలల్లో రుణ విమోచన కమిషన్

ఇచ్చిన హామీ మేరకు రైతు, రైతుకూలీ రుణ విమోచన కమిషన్‌ను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం



మన తెలంగాణ/ హైదరాబాద్: రైతులు, రైతు కూలీల కోసం రుణ విమోచన కమిషన్‌ను తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేయాలని హైకోర్టు ఆదేశించింది. ఈ ప్రక్రియ మూడు నెలల్లో పూర్తి చేస్తామన్న ప్రభుత్వ హామీని అమలు చేయాలని హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి ఉమాదేవిలతో కూడిన డివిజన్ బెంచ్ ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ రాష్ట్ర రుణ విమోచన చట్టం – 2016 లోని సెక్షన్ 3(1) ప్రకారం కమిషన్‌ను ఏర్పాటు చేయకపోవడాన్ని మాజీ ఎంఎల్‌ఎ, బిజెపి సీనియర్ నేత ఎన్.ఇంద్రసేనారెడ్డి దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యాన్ని సోమవారం బెంచ్ తరువాయి 6లో



చేతిలో చెయ్యేసి

ఏకమైన ఎఐఎడిఎంకె వైరి వర్గాలు

- పళనిస్వామే సిఎం, పన్నీర్‌కు ఉపముఖ్యమంత్రి
- ఆ వర్గం నుంచి మంత్రిగా పాండ్యరాజన్
- మమ్మల్ని ఎవరూ విడదీయలేరని ఉభయుల ప్రకటన
- జయకు నివాళులు
- ప్రధాని అభినందనలు, సహకరిస్తామని హామీ
- శశి వెలి యోచనపట్ల సమాధి వద్ద 18 మంది ఎంఎల్‌ఎల నిరసన

చెన్నై: తమిళనాడు పాలకపక్షం ఎఐఎడిఎంకె ప్రత్యర్థి వర్గాలు రెండు ఎట్టకేలకు ఏకమయ్యాయి. ముఖ్యమంత్రిగా పళనిస్వామి కొనసాగడానికి, మాజీ సిఎం పన్నీర్ సెల్వం ఉపముఖ్యమంత్రి పదవిని స్వీకరించడానికి అంగీకారం కుదిరింది. ఆ మేరకు సోమవారం సాయంత్రం పన్నీర్ సెల్వం ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. ఆయనతో పాటు ఆ వర్గం నుంచి పాండ్యరాజన్ మంత్రిగా పదవిని స్వీకరించారు. ఇద్దరిచేత గవర్నర్ విద్యాసాగర్‌రావు ప్రమాణం చేయించారు. పన్నీర్ సెల్వం వర్గం చేసిన ప్రధాన డిమాండ్లకు పళని వర్గం తలొగ్గడంతో విలీనానికి ఉన్న అడ్డంకులు తొలగిపోయాయి. ఇక్కడ పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన విలీన కార్యక్రమంలో వారిద్దరూ తరువాయి 6లో



శ్రీరాంసాగర్‌కు వరద

- ఎగువ నుంచి వచ్చి చేరుతున్న నీరు
- 18.44 టిఎంసిలకు పెరిగిన నిల్వ

మన తెలంగాణ/ హైదరాబాద్: శ్రీరాంసాగర్‌కు జలకళ వస్తోంది. ఎగువ నుంచి స్థిరంగా 1,16,000 క్యూసెక్కుల నీరు వస్తోంది. ఫలితంగా 90.31 టిఎంసిల సామర్థ్యం ఉన్న పోచంపాడు ప్రాజెక్టులో 18.44 టిఎంసిల నీరు నిల్వ అయింది. ఇంకా 71 టిఎంసిల నీరొస్తే శ్రీరాంసాగర్ గేట్లెత్తుతారు. అదే విధంగా కడెం ప్రాజెక్టులోకి 2400 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, మరో అర టిఎంసి నీరు వచ్చి చేరితే ప్రాజెక్టు తరువాయి 6లో

ఈ పోరు ఆగదు

- ధర్నాచౌక్ పునరుద్ధరణ పోరాటాన్ని ముందుకు తీసుకుపోతాం : సురవరం సుధాకర్‌రెడ్డి
- ఢిల్లీ జంతర్‌మంతర్‌లో ప్రతిపక్షాల ప్రదర్శన

మన తెలంగాణ/ న్యూఢిల్లీ: హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్‌లో ధర్నాచౌక్ పునరుద్ధరణకు డిమాండ్ చేస్తూ పరిరక్షణ కమిటీ సభ్యులు సోమవారం ఢిల్లీ జంతర్ మంతర్‌లో ఆందోళన జరిపారు. ఇందులో వామపక్షాలు, కాంగ్రెస్, టిటిడిపి, తెలంగాణ జెఎసి చైర్మన్ కోదండరామ్, ఇతర ప్రజాసంఘాలు పాల్గొన్నాయి. సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ చర్చలు, ధర్నాలు, నిరసనలు ప్రజాస్వామ్య రాజ్యాంగ హక్కులని అన్నారు. గతంలో నిరంకుశ రాజులు తరువాయి 6లో





మంత్రి పదవికి జూపల్లి అనర్హుడు : వంశీచంద్‌రెడ్డి

మన తెలంగాణ/హైదరాబాద్ : పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు విషయంలో ప్రజలకు తప్పుడు సమాచారాన్ని అందిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు మంత్రి పదవిలో కొనసాగే అర్హతను కోల్పోయారని కాంగ్రెస్‌కు చెందిన కల్వకుర్తి ఎంఎల్‌ఎ వంశీచంద్‌రెడ్డి అన్నారు. ఈ ప్రాజెక్టుపై బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ చేస్తే తోక ముడిచిన మంత్రి తన అనుచరులతో మాట్లాడించారన్నారు. అసెంబ్లీలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో టిఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చాక 62 వేల ఎకరాల నుంచి 37 వేల ఎకరాలకు కుదించారని, ఈ ప్రాజెక్టు విస్తీర్ణం తగ్గించారని తాను అంటుంటే తగ్గించలేదని మంత్రి జూపల్లి కృష్ణారావు అబద్దాలు చెబుతున్నారన్నారు. జీవోలో మార్పులు చేసి కూడా చేయలేదని చెబుతున్నారని, ఇంతటి అజ్ఞాని మంత్రిగా ఉండటం తెలంగాణ ప్రజలు చేసుకున్న దురదృష్టమన్నారు. డిడికి నీళ్లు తీసుకు పోవడానికి తాము వ్యతిరేకం కాదని ఆయన స్పష్టం చేశారు. కల్వకుర్తి కాలువలు, టన్నెల్ సైజులు తగ్గించడంలో జూపల్లి పాత్ర ఉందని, ఈ వ్యవహారంలో కోట్లు దండుకున్నది జూపల్లి అని ఆయన పేర్కొన్నారు. తాను అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం చెప్పకపోతే పదవికి రాజీనామా చేసి ప్రజలకు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.



'డబుల్'కు పాలన అనుమతులు

మన తెలంగాణ/హైదరాబాద్ : ప్రధానమంత్రి అవాస్ యోజన రూరల్, అర్బన్, డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణానికి సంబంధించి రూ. 558.50 కోట్లకు ప్రభుత్వం పరిపాలన అనుమతులు మంజూరు చేసింది.

ప్రైవేట్ వడ్డే దిక్కు!

- **ఎరువుల కోసం తప్పని దుస్థితి**
- **సగం శాతమే అందిన పంట రుణాలు**
- **ఆవేదన చెందుతున్న అన్నదాతలు**



మన తెలంగాణ/హైదరాబాద్ : పంటలను పడుతున్న చీడ, పీడలను తొలగించుకుని అధిక దిగుబడి పొందేందుకు అవసరమైన ఎరువులకూ అన్నదాత వడ్డీ వ్యాపారినే ఆశ్రయించాల్సి వస్తోంది. వానాకాలం సాగు ప్రారంభమై దాదాపు మూడు నెలలు కావొస్తున్నా బ్యాంకులు రుణాలు మంజూరు చేయడంలో ఆలసత్వాన్ని ప్రదర్శిస్తున్నాయి. ఫలితంగా తొలకరి పలకరించిందనిఆశతో అప్పుతోనే వానకాలం సాగును ప్రారంభించిన రైతులకు ఇప్పుడు ఎరువులకు కూడా వడ్డీ వ్యాపారులే దిక్కవుతున్నారు. ఈ వానకాలం పంట రుణాల లక్ష్యం రూ. 23,851 కోట్లు కాగా ఇప్పటి వరకు రూ. 12,318 కోట్లు మాత్రమే బ్యాంకులు రుణాలు ఇచ్చాయి. ఇందులో సింహభాగం రెన్యువల్స్ మాత్రమే. వీటికి కూడా చాలా చోట్ల బ్యాంకులు రైతుల ముక్కుపిండి మరీ వడ్డీలు వసూలు చేస్తున్నాయి. కొత్తగా రుణం తీసుకున్న వారి సంఖ్య తక్కువే. ఇప్పటికీ బ్యాంకులు రేపు, మాపు అంటూ రుణం కోసం రైతులను ముప్పు తిప్పలు పెడుతున్నాయి. మొదటి నుంచీ బ్యాంకులు రుణం ఇవ్వకపోవడంతో ప్రైవేటు వడ్డీ వ్యాపారుల ఉచ్చులో అన్నదాత విలవిలలాడుతున్నాడు. సాగుకు ముందు తీసుకున్న ప్రైవేట్ అప్పును బ్యాంకు రుణం వచ్చాక తీరుద్దామనుకుంటే బ్యాంకుల తీరు నిర్లక్ష్యంగా ఉంది. దీంతో రోజులు గడిచేకొద్ది వడ్డీ భారం అధికమవడం, ఇప్పుడు ఎరువులు, పురుగు మందుల కోసం మళ్లీ అధిక వడ్డీలకు ప్రైవేట్‌లోనే అప్పు లు తీసుకుంటున్నారు. ఇలా పంట చేతికి వచ్చేసరికి వడ్డీ లు అధికమై వచ్చిదంతా అప్పు చెల్లించేందుకే సరిపోతుందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత కాలంలో రైతులు విత్తనం నాటిన నాటి నుంచి పంట అమ్మి ఆదా యం చేతికొచ్చేదాకా ఎంతో మంది మీద ఆధారపడాల్సి వస్తున్నది. వారు గ్రామంలో ఉన్న వడ్డీ వ్యాపారే కావచ్చు, విత్తన సంస్థలు, ఎరువుల సంస్థలలో అరువులిచ్చే వ్యాపారులే కావచ్చు, పంట చేతికొచ్చిన తరువాత మార్కెట్‌లో దళారులే కావచ్చు అందరూ మూకుమ్మడిగా రైతుకొచ్చే ఆదాయంలో సింహ శాతం వారికి మిత్తిగానో, కమిషన్ గానో పొందాలని చూసే వారు ఎక్కువయి పోయారన్నది వాస్తవం. ఇలాంటివి జరగకుండా ఉండలాంటే బ్యాంకులు రైతులను ఇబ్బందులు పెట్టకుండా సకాలంలో రుణాలు మంజూరు చేయాలి.

బ్యాంకు రుణంకు వారం, పది రోజులు తిరగాలి : శ్రావణ్ కుమార్, భువనగిరి యాదాద్రి జిల్లా,శారాజీపేట గ్రామ రైతు : పంట వేసేటప్పుడు లోను కోసం పోతే ఇప్పుడు కాదు మళ్లీ రాపో అన్నారు.

దిక్కులేక మా ఊరు సేటు దగ్గర వడ్డీకి రూ. 1 లక్ష తీసుకున్నా. కింద మీద పడి పంట అయితే ఏసిన. పంటకు ఎరువు, పురుగు మందులు అవసరమైనయి. మళ్లీ బ్యాంకుకు పోతే రేపు, మాపు అంటూ తిప్పుకుంటున్నారు. లోను తీసుకోవాలంటే ఏం లేదన్నా వారం, పది రోజలు పడుతుంది. చేసేదేమి లేక మళ్లీ సెటు దగ్గరనే మళ్లీ ఒక లక్ష రూపాయాలు అప్పు తీసుకున్నా. తరువాత వచ్చిన పంట మొత్తం తీసుకుపోయి సేటుకు అమ్మినా ఆయనకే బాకీ పడతనేమో.

వరంగల్ నగరాభివృద్ధిపై
ప్రత్యేక దృష్టి!

మన తెలంగాణ/హైదరాబాద్: వరంగల్ నగరాభివృద్ధిపై త్వరలోనే ప్రత్యేక సమీక్ష నిర్వహించనున్నట్లు పురపాలక శాఖ మంత్రి కె.తారకరామారావు తెలిపారు. వరంగల్ పట్టణ అభివృద్ధి కార్యక్రమాల అమలు తీరుపై బేగంపేటలోని క్యాంప్ కార్యాలయంలో సోమవారం ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, ఎంఎల్‌ఎలు దాస్యం వినయ్‌భాస్కర్, ఆరూరి రమేష్, చల్ల ధర్మారెడ్డి, నగర మేయర్ నన్నపనేని నరేందర్, కూడా ఛైర్మన్ మర్రి యాదవరెడ్డి, వికలాంగుల కార్పొరేషన్ ఛైర్మన్ డా.కె. వాసుదేవరెడ్డిలతో మంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వరంగల్‌లో చేపట్టాల్సిన పలు అభివృద్ధి కార్యక్రమాలపై వారు చర్చించారు. త్వరలోనే ముఖ్యమంత్రి కెసిఆర్ వరంగల్ జిల్లాలో పర్యటిస్తారని, ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయనున్నట్లు మంత్రి కెటిఆర్ వివరించారు.

ఏం చేశారని పురస్కారం?

మన తెలంగాణ/హైదరాబాద్ : భారత వ్యవసాయ మండలి సిఎం కె. చంద్రశేఖర్‌రావుకు వ్యవసాయ పురస్కారాన్ని ప్రకటిస్తున్నామని చెప్పడం విడ్డూరంగా ఉందని టిడిపి అధికార ప్రతినిధి నన్నూరి నర్సిరెడ్డి అన్నారు. దేశంలోనే తెలంగాణ రాష్ట్రం రైతుల ఆత్మహత్యలలో 2వ స్థానంలో ఉందని కేంద్ర సంస్థ అయినా నేషనల్ క్రైం రికార్డుల బ్యూరో నివేదిక కుండబద్దలు కొట్టిందని, ఇది వ్యవసాయ మండలికి కనిపించ లేదా అని మండిపడ్డారు. కరువు సాయంగా రూ. 710 కోట్లు కేంద్రం రాష్ట్రానికి పంపితే నిధులు రైతులకు అందకుండా దారి మళ్లించారన్నారు. ఏం ఆధారం చేసుకుని అవార్డు ప్రకటించారో చెప్పాలని నన్నూరి డిమాండ్ చేశారు.

కాంగ్రెస్‌వి దొంగ కేసులు



- **సచ్చినోళ్ల వేలిముద్రలతో కేసులు**
- **18–20 నెలల్లో ఫ్లైఓవర్ పూర్తి**
- **బాలానగర్ బహిరంగసభలో కెటిఆర్**

మన తెలంగాణ/హైదరాబాద్ సిటీబ్యూరో : ' సచ్చిన వారితో వేలి ముద్రలు వేసి కేసులు వేశాం... తెలిసో తెలియకనో చేశాం అని కాంగ్రెస్ శాసన సభాపక్ష ఉపనాయకుడు జీవన్‌రెడ్డి శాసన సభలో చెప్పారని, నేను చెప్పింది అవాస్తవమైతే చెప్పాలి. నేను చెప్పింది అబద్ధమని చెప్పమనండి ' అని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కె.తారకరామారావు చెప్పారు. కాంగ్రెసోళ్ళు దొంగ కేసులు వేస్తున్నారు. 55 ఏళ్ళు రాష్ట్రాన్ని పాలించింది కాంగ్రెసోళ్ళేనని, ఈ కాలంలో గుడ్డిగుర్రాల దంతాలు తోమిర్రా అని ఆయన ప్రశ్నించారు. సోమవారం బాలానగర్ చౌరస్తాలో రూ. 387 కోట్ల వ్యయంతో నిర్మించతలపెట్టిన ఫ్లైఓవర్ బ్రిడ్జికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి తారకరామారావు మాట్లాడుతూ నగరానికి తాగునీటిని అందించేందుకు నగర శివారులో రెండు జలాశయాలను ఏర్పాటు చేస్తుంటే కాంగ్రెస్ అడ్డుపడుతుందని, కాళేశ్వరం పథకంపైనా కేసులు వేస్తున్నట్టు ఆయన ఆరోపించారు. కెసిఆర్ ముఖ్యమంత్రి అయ్యాక వేసవిలోనూ నగరంలో 24 గంటలు కరెంట్ సరఫరా జరిగిందన్నారు. మన రాష్ట్రానికి ఇప్పటి వరకు రూ.70 వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. అనంతరం హోంమంత్రి నాయిని మాట్లాడుతూ కోదండరాంరెడ్డి.. దొంగరామిరెడ్డి అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రులు నాయిని నర్సింహారెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, మహేందర్‌రెడ్డిలు, ఎంపి మల్లారెడ్డి, ఎమ్మెల్యేలు కృష్ణారావు, వివేక్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, డిప్యూటీ మేయర్ ఫసియుద్దీన్, కార్పొరేటర్లు ముద్దం నర్సింహాయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వస్థాయి నగరంగా...

2017 నవంబర్ మాసం చివరలో మెట్రోరైలు నాగోల్– మియాపూర్ మార్గాన్ని ప్రారంభిస్తామని మంత్రి కెటిఆర్ ప్రకటించారు. ప్యారడైజ్ కొంపల్లి, జెబిఎస్ తూంకుంట వరకు రెండు స్కైవేలను నిర్మించేందుకు రక్షణ శాఖ భూములను అడిగామని, త్వరలోనే అందుకు సంబంధించిన అనుమతులు వస్తాయని చెప్పారు. ప్రస్తుతం రూ. 3 వేల కోట్లతో నగరంలో అభివృద్ధి పనులు జరుగు తున్నాయని, రూ. 250 కోట్లతో అంబర్‌పేట ఫ్లైఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడిం చారు. రూ. 1000 కోట్ల వ్యయంతో ట్రాఫిక్ సమ స్యను పరిష్కరిస్తున్నామని, బాలానగర్ ఫ్లైఓవర్‌ను 18–20 నెలల్లో పూర్తి చేయనున్నట్టు చెప్పారు.

2019లోనూ కెసిఆర్‌కే పట్టం...

2019 జరిగబోయే ఎన్నికల్లోనూ మళ్ళీ కెసిఆర్‌కే తెలంగాణ ప్రజలు పట్టం కడతారని పురపాలక శాఖ, ఐటిశాఖ మంత్రి మంత్రి కె. తారక రామారావు జోస్యం చెప్పారు. తెలంగాణ ఆవిర్భవించి మూడు సంవత్సరాల రెండు నెలల 16 రోజులైందని, ముఖ్యమంత్రి పారదర్శకత విధానాలు, అవినీతి రహిత పాలనలో అగ్రగామిగా నిలుస్తున్నదని, శాంతిభద్రతల పరిరక్షణలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం మొదటి స్థానంలో ఉన్నదని ఆయన వెల్లడించారు. రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని, కేంద్రం, ప్రపంచ బ్యాంక్‌లు కలిసి పోటీ నిర్వహిస్తే రాష్ట్ర ముఖ్యమంత్రికి వ్యవసాయ రంగ బహుమతి లభించిందని ఆయన తెలిపారు.

బిసిలకు స్థలంతోపాటు బడ్జెట్!

- **కేటాయించాలంటూ సిఎంకు కృష్ణయ్య లేఖ**

మన తెలంగాణ/హైదరాబాద్/ముషీరాబాద్ : రెడ్డి హాస్టల్‌కు ఇచ్చిన మాదిరిగానే 112 బిసి కులాలకు కూడా స్థలంతో పాటు బడ్జెట్ కేటాయించాలని కోరుతూ బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆర్.కృష్ణయ్య ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావుకు సోమవారం లేఖ రాశారు. రెడ్డి హాస్టల్‌కు 10 ఎకరాల స్థలం, 10 కోట్ల రూపాయల బడ్జెట్ కేటాయిస్తూ తీసుకున్న నిర్ణయం మంచిదేనన్నారు. అలాగే బ్రాహ్మణ సదన్‌కు కూడా ఎకరాల స్థలం, కోట్ల రూపాయలను కేటాయించడాన్ని కూడా స్వాగతిస్తున్నామన్నారు. అదే రీతిలో బిసి జాబితాలో ఉన్న 112 కులాలకు కూడా వారి వారి జనాభా నిష్పత్తిలో స్థలాలు, బడ్జెట్ కేటాయిస్తే హాస్టళ్లు, కమ్యూనిటీ హాళ్లు నిర్మించుకునే అవకాశముందన్నారు. అప్పుడు ఈ కులాలు విద్య, ఉద్యోగ రంగాలలో అభివృద్ధి చెందుతాయని అభిప్రాయపడ్డారు. బిసి జాబితాలో 112 కులాలు ఉన్నప్పటికి ప్రధానంగా 64 కులాలు వివిధ వృత్తులు, సేవలు చేస్తూ సమాజంలో కీలకపాత్ర పోషిస్తున్నాయన్నారు. బిసి జనాభా నిష్పత్తిలో ఒక ఎకరం నుంచి 20 ఎకరాల వరకు స్థలం, 5 కోట్ల నుంచి 20 కోట్ల వరకు బడ్జెట్ కేటాయిస్తే అన్ని సౌకర్యాలతో హాస్టల్, కమ్యూనిటీహాళ్లు నిర్మాణం చేసుకుంటారని లేఖలో తెలిపారు. రెడ్డి హాస్టల్‌కు, బ్రాహ్మణ సదన్‌కు ఇచ్చిన మాదిరిగా అత్యంత వెనకబడిక కులాలకు సంచార జాతులకు ఇస్తే తమ పేరు చారిత్రాత్మకంగా నిలుస్తుందని కేసీఆర్‌కు విజ్ఞప్తి చేశారు.

అవార్డు ఎందుకివ్వాలి?

మన తెలంగాణ/హైదరాబాద్ : ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావుకు కేంద్ర ప్రభుత్వం అవార్డు ఇచ్చింది కేంద్ర ప్రభుత్వం కాదని, వ్యాపార లావాదేవీల కోసం ఏర్పాటు చేసుకున్న సంస్థలు తమ వ్యాపార వ్యూహంలో భాగంగా లాబీయింగ్ కోసం అవార్డును ఇచ్చిందని బిజెపి జాతీయ నేత ఎన్. ఇంద్రసేన్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రంలో వ్యాపార లావాదేవీలను నిర్విఘ్నంగా నిర్వహించుకునేందుకు ఒక సంస్థ ఈ అవార్డును ఇచ్చిందని, దీన్ని టిఆర్‌ఎస్ నేతలు, మంత్రివర్గసభ్యులు కెసిఆర్ ఏదో ఘనకార్యం చేస్తే కేంద్రం అవార్డు ఇచ్చిందని ప్రక టించడం విడ్డూరంగా ఉందని పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన తెలిపారు. కెసిఆర్ ఏం చేశారని కేంద్రం అవార్డు ఇస్తుందని ఆయన ప్రశ్నించారు. రైతు కమిషన్‌ను వెంటనే ఏర్పాటు చేయాలంటూ హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.

ఆర్‌ఎంపి, పిఎంపిలకు శిక్షణ!

మన తెలంగాణ/హైదరాబాద్ : గ్రామీణ ప్రాంతాల్లో పని చేస్తున్న ఆర్‌ఎంపి, పిఎంపి వైద్యులకు రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి శిక్షణ ఇవ్వనున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ సి.లక్ష్మారెడ్డి తెలిపారు. ఆర్‌ఎంపి, పిఎంపి వైద్యుల జెఎసి ఛైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, ప్రతినిధులతో సచివాలయంలో సోమవారం మంత్రి సమావేశమై సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ,శిక్షణ తేదీలు, కేంద్రాలు, ఏయే కేంద్రా ల్లో ఎంత మందికి శిక్షణ, ఎన్ని రోజుల పాటు శిక్షణ ఇవ్వాలనే అంశాలను సిద్ధం చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఆర్‌ఎంపి, పిఎంపి వైద్యుల్లో వృత్తి నైపుణ్యాలను పెంచేందుకు కృషి చేయనున్నట్టు తెలిపారు. వారికి ప్రభుత్వ శిక్షణ సర్టిఫికేట్లు, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, సంబంధిత అధికారుల వేధింపులను అరికట్టాలని ప్రతినిధులు డిమాండ్ చేశారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందిస్తూ అనుభవజ్ఞులైన వైద్యులచేత శిక్షణ ఇప్పించిన సర్టిఫికేట్లను పంపిణీ చేస్తామన్నారు.



కాళేశ్వరం పర్యావరణ ప్రభావంపై నేటి నుంచి ప్రజాభిప్రాయ సేకరణ

మన తెలంగాణ/హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతో ఏర్పడే పర్యావరణ ప్రభావంపై ప్రభుత్వం నేటి నుంచి ప్రజాభిప్రాయ సేకరణ జరపనుంది. 22 నుంచి 26వ తేదీ వరకు 15 ప్రాంతాల్లో స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులతో కలిసి ప్రజాభిప్రాయాన్ని సేకరించనుంది. అభిప్రాయ సేకరణను అడ్డుకోవడానికి ప్రతిపక్ష పార్టీలకు చెందిన కొంత మంది యత్నాలు చేస్తుంటే, ముందు జాగ్రత్తగా టిఆర్ఎస్ పార్టీ శ్రేణులను కూడా పెద్ద ఎత్తున వచ్చేలా అధికార పార్టీ నేతలు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. 22వ తేదీ నాలుగు ప్రాంతాల్లో, 23వ తేదీ 4 ప్రాంతాల్లో, 24వ తేదీన మూడు ప్రాంతాల్లో బహిరంగ విచారణ నిర్వహించనున్నారు. ఇదేవిధంగా 26వ తేదీ కూడా 4 చోట్ల బహిరంగ విచారణ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ జరుపుతారు. ప్రాజెక్టు నిర్మాణంతో స్థానికంగా కలిగే లాభనష్టాలపై ఉదయం 11 గంటలకు రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో బహిరంగ విచారణ నిర్వహిస్తారు. అందులో భాగంగా ఆగస్టు 22న కరీంనగర్ జిల్లా, మండలంలోని రేకుర్తి గ్రామంలోని రాజశ్రీ గార్డెన్స్, నిజామాబాద్ టౌన్‌లోని ఖలీల్‌వాడి, రాజీవ్‌గాంధీ ఆడిటోరియం,మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా, శామీర్ పేట మండలం తుర్కపల్లి గ్రామం, శ్రీ బాలాజీ ఫంక్షన్‌హాల్‌లో చేపట్టనున్నారు.

నేరెళ్ల బాధితులకు న్యాయం చేయండి

సిఎస్‌కు జాతీయ ఎస్‌సి కమిషన్ లేఖ

మన తెలంగాణ/హైదరాబాద్: సిరిసిల్ల జిల్లా నేరెళ్ళ బాధితులకు వీలైనంత తొందరగా న్యాయం చేయాలని, బాధ్యులైన జిల్లా ఎస్‌పితో పాటు మిగతా పోలీసులపై చర్యలు తీసుకోవాలని జాతీయ ఎస్‌సి కమిషన్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసింది. బాధితులకు నష్టపరిహారంగా రూ. 5 లక్షలు చెల్లించాలని, భూమిని కానీ, డబుల్ బెడ్ రూం ఇళ్ళను కానీ కేటాయించాలని ఆదేశించినట్లు కమిషన్ సభ్యుడు కె. రాములు తెలిపారు. బాధితులను పోలీసులు చిత్ర హింసలకు గురి చేసినట్లు స్పష్టమైందని, అందుకు కారకులైన వారందరిపై ఎస్‌సి, ఎస్‌టి చట్టం కింద కేసులను కూడా నమోదు చేయాలని డిజిపిని ఆదేశించినట్లు తెలిపారు. రెండు మాసాల క్రితం నేరెళ్ళలో వరుసగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలపై ఆగ్రహించిన కొంత మంది ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా పోలీసులు కొందరిని చిత్రహింసలకు గురి చేశారు. ఈ అంశం ప్రస్తుతం హైకోర్టులో విచారణ కొనసాగుతోంది. ఘటన విషయం తెలుసుకున్న ఎస్‌సి కమిషన్ సభ్యుడు కె. రాములు కరీంనగర్ జైలులో ఉన్న వారితో, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించి, ఘటనా వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నివేదికను తయారుచేసి ఛైర్మన్ గౌతం కు అందించారు. రాములు నివేదికను పరిశీలించిన ఛైర్మన్ ఈ మేరకు సిఎస్‌కు, డిజిపికి కూడా లేఖ రాస్తూ వీలైనంత తొందరగా నివేదిక పంపించాలని ఆదేశించారు.

నేరెళ్ల ఘటనలో జిల్లా ఎస్‌పిపై వేటు



మన తెలంగాణ/ సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్‌పి కాంపాటి విశ్వజిత్‌పై ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. ఇప్పటికే ఈ సంఘ టనకు బాధ్యుణ్ణి చేస్తూ ప్రభుత్వం సిసిఎస్ ఎస్‌ఐ రవీందర్‌ను సస్పెండ్ చేసింది.జిల్లా ఎస్‌పిని 45 రోజుల పాటు సెలవులో వెళ్లాలని చండీఘడ్ రాష్ట్రంలోని లడఖ్‌లో రిపోర్టు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.ఆయన స్థానంలో సిరిసిల్ల ఇన్‌చార్జి పోలీసు ఉన్నతాధికారిగా కరీంనగర్ పోలీస్ కమిషనర్ కమలాసన్‌రెడ్డికి ప్రభుత్వం బాధ్యతలను అప్పగించింది.

నాపై ఎవరూ ఎలాంటి చర్యలు తీసుకోలేదు

ప్రభుత్వం వేటు వేసి దీర్ఘకాలిక సెలవుపై పంపిస్తున్నట్లు తనపై వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ విశ్వజిత్ కాంపాటి అన్నారు. నేరెళ్ల థర్డ్ డిగ్రీ ఘటనలో ప్రభుత్వం వేటు వేసిందని, సెలవుపై పంపిస్తుందని, క్రమశిక్షణా చర్యలు చేపట్టిందని వస్తున్న ఆరోపణలు నిజం కాదని, తనపై ఎవరూ ఎలాంటి చర్యలు చేపట్టలేదని అధికారికంగానే లడక్ బార్డర్‌కు వెళ్తున్నానని ఆయన అన్నారు. తనపై ఎవరూ ఎలాంటి చర్యలు తీసుకోలేదని, అధికారికంగానే లడఖ్ బార్డర్‌కు వెళ్తున్నానని అన్నారు. 15 రోజుల పాటు తెలంగాణ రాష్ట్రం తరపున తాను పాల్గొంటున్నట్లు వెల్లడించారు. లడఖ్‌లో జరిగే నివాళి కార్యక్రమంలో పాల్గొనడానికి రాష్ట్రం నుండి తాను ఎంపికైనట్లు వివరిస్తూ తనపై వచ్చిన ఆరోపణల్లో నిజం లేదన్నారు.

మృతదేహం గుర్తించాకే పంచనామా

మన తెలంగాణ/హైదరాబాద్ : గాంధీ ఆసుపత్రిలో మృత దేహాన్ని గుర్తించిన వెంటనే పంచనామా చేసి భద్రపరిచినట్లు గాంధీ హాస్పిటల్ డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నర్సింహారావు నేత తెలిపారు. మృతదేహంతో పాటు శ్రీనివాస్ అనే రోగి విషయంలో సోషల్ మీడియా అనవసర రాద్ధాంతం చేస్తూ గాంధీ హాస్పిటల్‌ను అప్రతిష్టపాలు చేయడం తగదని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అసలు వాస్తవాలు గుర్తించకుండా దుష్ప్రచారం తగదన్నారు. సోమవారం ఉదయం 11.30 గంటల ప్రాంతంలో ప్రసూతి వార్డు సమీపంలో ఒక మృత దేహాన్ని సెక్యూరిటీ వారు గుర్తించి వెంటనే గాంధీ సూపరింటెండెంట్ కార్యాలయానికి సమాచారం అందించారు. ఆ వెంటనే డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించగా అప్పటికే ఆ రోగి చనిపోయి ఉన్నారన్నారు. అక్కడున్న వారిని విచారించగా అక్కడ ఆ బాడీని ఎవరో వదిలి వెళ్లినట్టు చెప్పారు. అయితే ఆ వ్యక్తి ఎవరన్నది గుర్తించలేకపోయాం. దీనితో పోలీసులకు సమాచారం ఇచ్చి పంచనామా చేసి మృతదేహాన్ని మార్చురీ గదిలో 34వ నెంబర్ డబ్బాలో భద్రపరిచామని డాక్టర్ నర్సింహారావు నేత తెలిపారు.

ఓపెన్ టెన్త్, ఇంటర్ ఫీజు గడువు పెంపు

మన తెలంగాణ/హైదరాబాద్: ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్ష ఫీజు చెల్లింపుకు గడువును ఈ నెల 26 వరకు పొడిగిస్తున్నట్లు రాష్ట్ర ఓపెన్ స్కూల్ సొసైటీ డైరెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. తత్కాల్ స్కీమ్ కింద ఎస్‌ఎస్‌సికి రూ.500, ఇంటర్మీడియేట్‌కు రూ.1,000 అదనపు ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు.

24, 25 తేదీల్లో వర్షాలు

మన తెలంగాణ/హైదరాబాద్: ఈ నెల 24, 25 తేదీలలో భారీ వర్షం కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. అల్పపీడనం ప్రస్తుతం మధ్యప్రదేశ్ కేంద్రంగా కొనసాగుతోంది. ఇది క్రమంగా బలహీనపడుతుంది. దీనికి అనుబంధంగా సముద్రమట్టానికి 7.6 కిలోమీటర్ల ఎగువన ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. ఫలితంగా రాష్ట్రంలో వచ్చే మూడు రోజుల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం కురుస్తుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం డైరెక్టర్ వైకె రెడ్డి తెలిపారు. ఇదేవిధంగా గత 24 గంటల్లో సారంగాపూర్, బాన్స్‌వాడ, లింగంపేట, నాగరెడ్డిపేట, ఎల్లారెడ్డి, తాడ్వాయిలో 2 సెంటీమీటర్లు, గాంధారి, బోధ్, రామాయంపేట, ఆదిలాబాద్, మెదక్, పినపాక, వెంకటాపూరం, గంభీర్రావుపేట, బిర్కూరు, బిక్నూరు, కొత్తగూడెం తదితర ప్రాంతాల్లో 1 సెంటీమీటర్ వర్షపాతం నమోదైంది. సోమవారం నాడు గరిష్టంగా నల్లగొండలో 33.4, రామగుండం, భద్రాచలంలో 33 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

డిపార్ట్‌మెంటల్ పరీక్షలు వాయిదా

మన తెలంగాణ/హైదరాబాద్ : సెప్టెంబర్ 10న జరుగాల్సిన మే2017 సెషన్ డిపార్ట్‌మెంటల్ పరీక్షలను సెప్టెంబర్ 15వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు టిఎస్‌పిఎస్‌సి కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు గురుకుల విద్యా సంస్థల సొసైటీలో పోస్టుల భర్తీకి పరీక్షలు ఉన్నందున డిపార్ట్‌మెంటల్ పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇతర వివరాలకు అభ్యర్థులు కమిషన్ వెబ్‌సైట్‌ను చూడాలని అన్నారు.

ప్రచారం ఎక్కువ.. కార్యాచరణ తక్కువ

మన తెలంగాణ/హైదరాబాద్: మట్టి గణపతి అంశంలో ప్రభుత్వం చేస్తున్న ప్రచారం ఎక్కువగా, కార్యాచరణ తక్కువగా ఉన్నదని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వి.ఎస్.బోస్ అన్నారు. గణపతి నవరాత్రుల కార్యక్రమాల్లో ప్రజా ప్రతినిధులు కేవలం మట్టి గణపతి మండపాలలో మాత్రమే పాల్గొనేలా చూడాలని, దీనికి వీలుగా అవసరమైతే రాష్ట్ర ప్రభుత్వం జివో జారీ చేయాలని ఆయన సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రభుత్వం ఇలాంటి నిర్ణయం తీసుకోవడంతో తమ చిత్తశుద్దిని పర్యావరణ ప్రేమికులు అర్థం చేసుకుంటారని పేర్కొన్నారు.



- తెలంగాణ అంటే నాకు చాలా ఇష్టం
- రాజ్‌భవన్ పౌర సన్మాన సభలో ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు

తెలుగు రాష్ట్రాలు కలిసి నడవాలి

మన తెలంగాణ/హైదరాబాద్

రాష్ట్రాలుగా విడిపోయినా తెలుగు వారంతా కలిసి మెలిసి ఉండాలని, రెండు రాష్ట్రాలు కలిసి పని చేస్తే దేశంలోనే శక్తివంతమైన, అభివృద్ధి చెందిన రాష్ట్రాలుగా తయారవుతాయని ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు అన్నారు. ఉప రాష్ట్రపతిగా ఉన్నా తెలుగు రాష్ట్రాల అభివృద్ధిలో తన వంతు పాత్రను నిర్వహిస్తానని హామీ ఇచ్చారు. ఉప రాష్ట్రపతిగా ఎన్నికైన తరువాత మొదటి సారి హైదరాబాద్ వచ్చిన సందర్భాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం రాజ్‌భవన్‌లో పౌర సన్మానం నిర్వహించింది. ఈ సందర్భంగా మాట్లాడిన వెంకయ్య, హైదరాబాద్ నగరం మినీ భారతదేశమని, భిన్న సంస్కృతులు, సాంప్రదాయలు, భాషలు, వేష ధారణ హైదరాబాద్ సొంతమన్నారు. ఈ నగరం అంటే తనకెంతో ఇష్టమని, పుట్టింది నెల్లూరు జిల్లాలో అయినా పెరిగింది, ఒరిగింది, ఎదిగింది హైదరాబాద్‌లో అని గుర్తు చేసుకున్నారు. తన రాజకీయ జీవితానికి హైదరాబాద్ ఎంతో తోడ్పడిందని, తెలంగాణ అంటే తనకెంతో ఇష్టమన్నారు. తెలంగాణలోని ప్రతి మండలం, తాలూకాలలో తాను ఎన్నో సార్లు పర్యటించానని చెప్పుకొచ్చారు. హైదరాబాద్ బిర్యానీ, హలీం ప్రపంచంలోనే ప్రఖ్యాతి చెందినవని, పోరాటాలు, త్యాగాల పునాదులపై తెలంగాణ ఏర్పడిందన్నారు. నాడు నిజాం పాలనపై పోరాటం చేసిన కొమురం భీం, చాకలి ఐలమ్మ, సమ్మక్క సారలక్కలను మనం ఎప్పుడూ విస్మరించొద్దన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లు కలిసి పని చేస్తే దేశంలోనే అభివృద్ధి చెందిన రాష్ట్రాలుగా నిలుస్తాయన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ కవి సి నారాయణరెడ్డిని వెంకయ్య నాయుడు స్మరించుకున్నారు. తెలుగు సాంప్రదాయం, కట్టుబొట్టు, భాష, యాస, గోస గురించి సినారె రాసిన పద్యాన్ని వెంకయ్య చదివారు. రెండు రాష్ట్రాలు తెలుగు భాషకు ప్రాధాన్యమివ్వాలని, పాలనలో తెలుగుకు పెద్ద పీట వేయాలన్నారు. ప్రజా ప్రతినిధులు, సభలలో చర్చలకు ప్రాధాన్యమివ్వాలని, చట్ట సభలలో అర్థవంతమైన చర్చ జరిగినపుడే ప్రజాకాంక్ష ప్రతిబింబిస్తుందన్న విషయాన్ని గుర్తెరగాలన్నారు.

ఏ పదవిని అధిష్టించినా ప్రత్యేకతే : దత్తాత్రేయ

రైతు బిడ్డ అయిన వెంకయ్యనాయుడు ఉప రాష్ట్రపతిగా నియమితులు కావడం హర్షణీయమని కేంద్ర మంత్రి దత్తాత్రేయ అన్నారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రిగా ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన పథకాన్ని, పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా స్మార్ట్ నగరాలకు శ్రీకారం చుట్టి, ప్రణాళికలను సిద్ధం చేశారన్నారు. టిఆర్ఎస్ ఎంపిలు ఎపి జితేందర్‌రెడ్డి, కె. కేశవరావు, శాసనమండలి ఛైర్మన్ కె.స్వామిగౌడ్, శాసనసభ స్పీకర్ ఎస్. మదుసూధనాచారి, ఉప ముఖ్యమంత్రులు కె. శ్రీహ రి, మహమూద్ అలీ, ప్రధాన కార్యదర్శి ఎస్‌పి సింగ్, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు, సినీ ప్రముఖులు, పలువురు రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

దూరంగా ఉన్న కాంగ్రెస్, టిడిపి

ఉప రాష్ట్రపతి పౌర సన్మాన కార్యక్రమానికి హాజరవాలంటూ ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని పార్టీల నేతలకు ఆహ్వానం పంపించింది. అయితే టిడిపి, కాంగ్రెస్ పార్టీకి చెందిన నేతలెవరూ ఈ కార్యక్రమానికి హాజరు కాలేదు.

ఉప రాష్ట్రపతికి ఘన స్వాగతం

ఉపరాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టి తొలి సారిగా రాష్ట్రానికి వచ్చిన సందర్భంగా వెంకయ్య నాయుడుకు బేగంపేట విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. గవర్నర్ నర్సింహన్, ముఖ్యమంత్రి కెసిఆర్ ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఉదయం 11 గంటలకు బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్న ఆయన రాష్ట్ర పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. స్వాగతం పలికిన వారిలో కేంద్ర మంత్రి దత్తాత్రేయ, శాసన మండలి ఛైర్మన్ స్వామి గౌడ్, అసెంబ్లీ స్పీకర్ మధుసూధనా చారి, ఉప ముఖ్యమంత్రి మహమూద్ అలీతో పాటు పలువురు రాష్ట్ర మంత్రులు ఉన్నారు.

నేనూ తెలుగు వాడినే



ఏడున్నర సంవత్సరాల పాటు హైదరాబాద్‌లో ఉంటున్నా కాబట్టి నేనూ తెలుగు వాడినే అని గవర్నర్ ఇఎస్‌ఎల్. నరసింహన్ అన్నారు. వెంకయ్యనాయుడు ఏ పదవిని అలంకరించినా వాటికి వన్నె తెచ్చారని, ఉప రాష్ట్రపతి పదవికి కూడా ఆయన వ న్నె తెస్తారన్న విశ్వాసం తనకుందన్నారు. జై ఆంధ్రా ఉద్యమం జోరుగా సాగుతున్న 1972 సంవత్సరం లో వెంకయ్యను మొదటి సారి చూశానని, విజయవాడలో ఆయన ప్రసంగాన్ని చూసి ముగ్ధుడినయ్యానని చెప్పారు. తెలుగు రాష్ట్రాలకు ఏ ఆపద వచ్చినా వెంకయ్య చొరవతో పరిష్కారం చూపించారన్నారు.

ఎన్‌టిఆర్ వల్లే గుర్తింపు



తెలుగు జాతికి ఎన్‌టిఆర్ వల్లే గుర్తింపు వచ్చిందని ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు అన్నారు. అంతకు ముందు తెలుగు వారంటే మద్రాసీలనే పిలిచేవారన్నారు. ఎన్‌టిఆర్ తర్వాత మరోసారి తెలుగు జాతి ఖ్యాతి వెంకయ్యనాయుడు ద్వారా ప్రపంచానికి తెలుస్తుందన్నారు. ఎదిగే కొద్ది ఒదిగి ఉన్న వెంకయ్య నాయుడు పార్టీలో ఎన్నో పదవులను అలంకరించి వాటన్నింటికీ వన్నె తెచ్చారని, ఉప రాష్ట్రపతి పదవికి కూడా వన్నె తెస్తారన్న విశ్వాసం తనకుందన్నారు. వెంకయ్యనాయుడు తన ప్రసంగంలో హాస్యం, వ్యంగ్యం, రౌద్రం కలబోసి మాట్లాడటంలో ఆయన దిట్ట అన్నారు.

సీట్ల కేటాయింపులపై సందిగ్ధత

డిగ్రీ తుది విడత సీట్లపై నేడు నిర్ణయం

మన తెలంగాణ/హైదరాబాద్: డిగ్రీ తుది విడత సీట్ల కేటాయింపుల వ్యవహారం ఇంకా కొలిక్కి రాలేదు. ఈ విషయంలో ఇప్పటికే నిర్ణయం వెలువడకపోవడంతో దోస్త్ ద్వారా సీట్లు లభించిన విద్యార్థులు తీవ్ర అయోమయానికి గురవుతున్నారు. ఏ కళాశాలకు వెళ్లాలో తెలియక గందరగోళానికి గురవుతున్నారు. ఈ వ్యవహారంపై ఉన్నత విద్యామండలి ఛైర్మన్ టి.పాపిరెడ్డి అధ్యక్షతన సోమవారం జరిగే సమావేశంలో తుది నిర్ణయం వెలువడుతుందని ఆశించిన విద్యార్థులకు మళ్లీ నిరాశే మిగిలింది. ఈ సమావేశంలో డిగ్రీ తుది విడత సీట్ల కేటాయింపు చర్చించారు. కానీ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్(సిజిజి) తలెత్తిన సాంకేతిక సమస్యలతో ఈ నెల 11న కేటాయించిన సీట్లు రద్దయ్యాయి. మళ్లీ 17న సీట్లు కేటాంచారు. 11న 70,808 మంది విద్యార్థులకు సీట్లు కేటాయించగా, అందులో 2,790 మంది విద్యార్థులకు కళాశాలలు, కోర్సులు మారగా, 91 మందికి అసలు సీట్లే లభించలేదు. అయితే 17న జరిగిన కేటాయింపులే తుది కేటాయింపులని దోస్త్ అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎవరైన విద్యార్థులు 11న కేటాయించిన కళాశాలల్లో ప్రవేశం పొంది, ఫీజు చెల్లిస్తే,వారికి ఫీజు తిరిగి ఇప్పిస్తామని హామీ ఇస్తున్నారు. అయితే 17న కేటాయించిన కళాశాలల్లో చేరేందుకు ఆసక్తి లేకపోతే 24వ తేదీ తర్వాత తిగిరి ఆప్షన్లు ఇచ్చుకునే విధంగా అవకాశం కల్పించాలని భావిస్తున్నట్లు తెలిసింది. దాంతో తుది విడత కేటాయింపుల్లో సీటు పొందినా, కొంతమంది విద్యార్థులు మరో సారి ఆప్షన్లు ఎంపిక చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.



నేడు నిర్ణయం

సాంకేతిక కారణాలతో సీట్ల కేటాయింపులో జరిగిన పొరపాట్లపై సిజిజి అధికారులతో దోస్త్ కమిటీ చర్చించింది. ఈ వ్యవహారంపై మంగళవారం ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరితో చర్చించి, తుది నిర్ణయం తీసుకోనున్నారు. దాంతోపాటు డిగ్రీ సీట్ల కోసం ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని, ఆప్షన్లు ఇచ్చినా సీటు లభించని విద్యార్థులకు మరో అవకాశం ఇవ్వాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. తుది విడతలో సీటు పొందిన విద్యార్థులకు కళాశాలల్లో రిపోర్టింగ్ గడువు ఈ నెల 23 ముగియనున్న నేపథ్యంలో, 24 నుంచి ఆప్షన్ల నమోదుకు అవకాశం కల్పించాలని నిర్ణయించారు.

అక్టోబరు 5న సింగరేణి గుర్తింపు

కార్మిక సంఘం ఎన్నికలు



మన తెలంగాణ/హైదరాబాద్: సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల షెడ్యూలును కార్మిక శాఖ ప్రకటించింది. సింగరేణి భవన్‌లో అన్ని కార్మిక సంఘాలతో నిర్వహించిన సమావేశంలో డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ (సెంట్రల్), రిటర్నింగ్ అధికారి డాక్టర్ కె. శ్యాంసుందర్ షెడ్యూలు ప్రకటించారు. అక్టోబరు 5న ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎన్నికలు నిర్వహిస్తారు. ఈ నెల 30వ తేదీలోగా సింగరేణి యాజమాన్యం కార్మిక సంఘాలకు ఓటర్ల జాబితాను అందజేస్తుంది. ఓటర్ల జాబితాపై అభ్యంతరాలను సెప్టెంబరు 6వ తేదీ వరకు తెలపాల్సిఉంటుంది. సెప్టెంబరు 9వ తేదీన రిటర్నింగ్ అధికారి అభ్యంతరాలపై తన నిర్ణయాన్ని ప్రకటిస్తారు. సెప్టెంబరు 13వ తేదీన తుది ఓటర్ల జాబితా ప్రదర్శిస్తారు. సెప్టెంబరు 14 నుంచి 16వ తేదీ వరకు నామినేషన్లు దాఖలు చేయాలి. 19వ తేదీ మధ్యాహ్నం 2 గంటల్లోపు నామినేషన్ల ఉపసంహరణ జరపాలి. 20వ తేదీ మధ్యాహ్నం 2 గంటల వరకు ఎన్నికల గుర్తులు కేటాయిస్తారు. అక్టోబరు 5వ తేదీన ఎన్నికలు జరిపి, అదే రోజు రాత్రి 7 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభిస్తారు. ఆగస్టు 1వ తేదీ వరకు ఆన్‌రోల్‌లో ఉన్న ఉద్యోగులన తాత్కాలిక ఓటర్ల జాబితాగా పరిగణిస్తారు. కానీ అక్టోబరు 5వ తేదీన ఆన్‌రోల్‌లో ఉన్న ఉద్యోగస్తులు మాత్రమే ఓటు వేయడానికి అర్హులవుతారు. కార్మిక సంఘాలతో జరిపిన సమావేశంలో రీజినల్ లేబర్ కమిషనర్ ఎస్.రామన్, సింగరేణి డైరెక్టర్ జె.పవిత్రన్ కుమార్, జనరల్ మేనేజర్ ఎ. ఆనందరావు, మురళీసాగర్ కుమార్, డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎన్. అనిల్ కుమార్, కవితా నాయుడు, 16 కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు కృష్ణా బోర్డు సమావేశం

రిజర్వాయర్లలో నీళ్లు లేని సందర్భంలో జరుగుతున్న తొలి సమావేశం

మన తెలంగాణ/హైదరాబాద్: కృష్ణా నదీ యాజమాన్య బోర్డు సమావేశం మంగళవారం విజయవాడలో జరగనుంది. కృష్ణా నదికి సంబంధించిన ప్రధాన రిజర్వాయర్లలో నీళ్లు లేని సందర్భంలో జరుగుతున్న తొలి సమావేశం ఇది. శ్రీశైలం, నాగార్జునసాగర్‌లలో నీరు డెడ్‌స్టోరేజికి చేరింది. ఎగువ నుంచి నీరు రావడం లేదు. రెండు రిజర్వాయర్లు నిండాలంటే కర్ణాటకతో పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా నది క్యాచ్‌మెంట్ ఏరియాలో అతి భారీ వర్షాలు కురువాల్సి ఉంది. వర్షాకాలం మరో నలభై రోజుల్లో అయిపోతున్న తరుణంలో మరో 400 టిఎంసిల నీరు వస్తాయోరావో వేచిచూడాలి. ప్రస్తుతం శ్రీశైలంలో 21 టిఎంసిలు, నాగార్జున సాగర్‌లో 115 టిఎంసిల నీరు ఉంది. ఇందులో తాగడానికి పనికొచ్చేది చాలా తక్కువ. దీనికి తోడు నాగార్జునసాగర్‌లో హైదరాబాద్ తాగు నీటి కోసం కనీసం 510 అడుగుల నీటిమట్టం నిర్వహించాలి. కానీ ఇప్పుడు 500 అడుగుల లోతుకు వెళ్లి నీటిని పంపింగ్ చేస్తున్నారు. రెండు రాష్ట్రాల నీటి వాడకాన్ని తేల్చడానికి బోర్డు రెండు దశల్లో టెలీమెట్రీ పాయింట్లను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించడం, కొన్ని పాయింట్లు ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. అయితే రెండో దశ పాయింట్లు ఏర్పాటు కాకముందే తెలంగాణ టెలీమెట్రీ పాయింట్ల ద్వారా నీటి ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లోలను రికార్డు చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పోతిరెడ్డిపాడు మినహా, మిగతా ప్రాంతాల్లో పాయింట్లు ఏర్పాటు చేయలేదు. తెలంగాణ మనోభావాలకు విరుద్ధంగా టెలీమెట్రీ పాయింట్ల ద్వారా నీటి గణన ఇప్పటికే మొదలు పెట్టారు. దీనికి తోడు మైనర్ ఇరిగేషన్ లెక్కలపై బోర్డు పట్టుబడుతోంది. ప్రాజెక్టులపై పెత్తనాన్ని కోరుతోంది. బచావత్ ట్రిబ్యునల్ ప్రకారం 89.17 టిఎంసిల మేర మైనర్ ఇరిగేషన్ కేటాయింపులు తెలంగాణకు ఉన్నాయి. కృష్ణా బేసిన్‌లో నీరు లేక, వర్షాలు రాక చెరువులు వెలవెలబోతుంటే, మైనర్ ఇరిగేషన్ కేటాయింపులన్నీ వినియోగించుకున్నట్లుగా భావించాలని ఆంధ్రప్రదేశ్ డిమాండ్ చేస్తోంది. దీనికి కృష్ణా బోర్డు తలూపుతోంది. ఫలితంగా తెలంగాణ వాదనల్లో బలాన్ని బట్టి ఏం నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాలి. అధికారులు ఇప్పటికే విజయవాడకు వెళ్లగా, తెలంగాణ అధికారులు మంగళవారం ఉదయమే వెళ్లనున్నారు. ఈ సమావేశంలో కృష్ణా బోర్డు ఛైర్మన్ శ్రీవాస్తవ, సభ్య కార్యదర్శి సమీర్ చటర్జీ, తెలంగాణ ఇరిగేషన్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శైలేంద్ర కుమార్ జోషి, ఇఎన్‌సి సి.మురళీధర్, ఎపి జలవనరుల శాఖ కార్యదర్శి శశిభూషణ్, ఇఎన్‌సి వెంకటేశ్వరరావు, ఇతర ఇంజనీర్లు సమావేశంలో పాల్గొంటారు.

నీటి పంపిణీ వివరాలివ్వండి



మిషన్ భగీరథ ద్వారా వచ్చే నెల నుండి ఏ నియోజక వర్గంలో ఎన్ని గ్రామాలకు నీరిస్తారో తెలియజేయాలని అధికారులను మిషన్ భగీరథ ఛైర్మన్ వేముల ప్రశాంత్‌రెడ్డి ఆదేశించారు. సచివాలయంలోని తన ఛాంబర్‌లో మిషన్ భగీరథ పనుల పురోగతిపై సోమవారం ఆయన సమీక్షించారు. డిసెంబర్ నాటికి అన్ని గ్రామాలను నీటిని సరఫరా చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నామని ఆయన వెల్లడించారు. ముఖ్యమంత్రి కెసిఆర్ మాట ప్రకారం నీటి సరఫరాకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

ఆడుకుంటూ వెళ్లి.. రైలు పట్టాల పైకి

నర్సన్నపల్లి గ్రామంలో కవలలు మృతి

మన తెలంగాణ/ కామారెడ్డి: కవల పిల్లలు ఆడుకుంటూ వెళ్లి రైలు కింద పడి మృతి చెందిన ఘటనతో కామారెడ్డి మండలంలోని నర్సన్నపల్లి గ్రామంలో విషాద ఛాయలు నెలకొన్నాయి. పట్టాలపై ఇద్దరి పిల్లలను చూసిన దేవగిరి ఎక్స్‌ప్రెస్ డ్రైవర్ ఆపేందుకు చేసిన ప్రయత్నం ఫలించకపోవడంతో కవల పిల్లల ప్రాణాలు గాలిలో కలిశాయి. ఈ దుర్ఘటన సోమవారం మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో చోటుచేసుకుంది. చంద్రం, భానుశ్రీ దంపతులకు చెందిన రెండున్నర సంవత్సరాల విఘ్నేష్, విద్వేషలు అడుకుంటూ సమీపంలో ఉన్న పట్టలాపైకి వెళ్లారు. అదే సమయానికి సికింద్రాబాద్ నుండి ముంబై వెళ్తున్న దేవగిరి ఎక్స్‌ప్రెస్ కామారెడ్డి చేరుతున్న సమయంలో పట్టాలపై అడుతున్న పిల్లలను గమనించిన రైల్వే డ్రైవర్ వేగంగా ఉన్న రైలును ఆపేందుకు ప్రయత్నించాడు. కాని డ్రైవర్ ప్రయత్నం విఫలం కావడంతో రైలు పిల్లల తలలపై నుండి దూసుకుపోయింది. దీంతో ఒక తల, శరీర భాగం నుండి వేరు కాగా, మరో బాబు తల పగిలి అక్కడికక్కడే దుర్మణం చెందారు. ఈ విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు పిల్లల మృతదేహాలను చూసి అక్కడే సొమ్మసిల్లి పడిపోయారు. అక్కడున్న వారు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఘటన స్థలానికి చేరుకున్న రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.



"నీ మొదటి ప్రయత్నంలో విజయం సాధించిన తర్వాత అలక్ష్యం ప్రదర్శించవద్దు. ఎందుకంటే నీ రెండవ ప్రయత్నంలో పరాజయం పొందితే మొదటి గెలుపు లక్కీగా వచ్చిందని చెప్పడానికి చాలామంది వేచి ఉంటారు. - అబ్దుల్ కలాం"

సంపాదకీయం

మానవ తప్పిదం తెచ్చిన విషాదం

ఉత్తరప్రదేశ్‌లోని ఖటౌలీ రైల్వే స్టేషన్ సమీపంలో పూరీ–హరిద్వార్ ఉత్కళ్ ఎక్స్‌ప్రెస్‌కు శనివారం సాయంత్రం సంభవించిన ప్రమాదంలో 24మంది ప్రయాణీకులు మరణించిన, 156 మంది గాయపడిన ఘోరకలికి మానవ తప్పిదం కారణంగా ప్రాథమిక విచారణ తెలియజేస్తున్నది. రైల్వే విభాగాలు పరస్పరం నిందించుకుంటున్నాయి. విమర్శలను తట్టుకునే ప్రయత్నంలో భాగంగా రైల్వేమంత్రిత్వశాఖ ఆదివారంనాడు ముగ్గురు ఉన్నతాధికారులను సెలవుపై పంపింది, నలుగురు స్థానిక అధికారులను సస్పెండ్ చేసింది, మరో అధికారిని బదిలీ చేసింది. కార్యదర్శి స్థాయి అధికారి, రైల్వే బోర్డు సభ్యుడు(ఇంజినీరింగ్)ఎ.కె.మిట్టల్, ఉత్తర రైల్వేల జనరల్ మేనేజర్ ఆర్.ఎన్.కులశ్రేష్ట, డివిజనల్ రైల్వే మేనేజర్(ఢిల్లీ) ఆర్.ఎన్.సింగ్ సెలవుపై పంపబడిన వారిలో ఉన్నారు. ఇది అత్యంత అసాధారణ చర్య.

వేగంగా ప్రయాణిస్తున్న ఉత్కళ్ ఎక్స్‌ప్రెస్ 14కోచ్‌లు పట్టాలు తప్పి గుద్దుకుని నుజ్జునుజ్జు అయిన ప్రమాద స్థలంలో పట్టా రిపేరు పనులు చేపట్టటంలో ముందు జాగ్రత్తలు తీసుకోలేదని రైల్వే అధికారులు అంటుండగా, రిపేర్ల గురించి తాము శనివారంనాడు ఖటౌలీ స్టేషన్ అధికారులకు తెలియచేశామని రైల్వే ఇంజనీరింగ్ శాఖ ఉద్యోగులు చెబుతున్నారు. అయితే అటువంటిది జరిగినట్లు రికార్డు లేదని స్టేషన్ మాస్టర్ నిరాకరిస్తున్నారు. అయితే ఇక్కడ అంతు చిక్కని అంశం ఏమంటే, ఈ ప్రమాదానికి ముందు రెండు రైళ్లు నెమ్మదిగా అదే ట్రాకుపై వెళ్లగా, ఈ ఎక్స్‌ప్రెస్ సాధారణ వేగంతో ఎందుకు వచ్చింది? ట్రాకు మరమ్మత్తులు జరిగేటప్పుడు, ఇంజినీరింగ్ విభాగం ఉద్యోగులు ముందుగా సమీప స్టేషన్ మాస్టర్‌కు సమాచార మిచ్చి, ట్రాఫిక్‌ను బ్లాక్(నిలుపుదల)చేయాల్సిందిగా కోరతారు. అటువంటి విజ్ఞప్తి చేసి ఉండకపోతే రెండు రైళ్లు నెమ్మదిగా వెళ్లటం సాధ్యమయ్యేది కాదు. కాబట్టి ఇంజనీరింగ్ విభాగం, స్టేషన్ అధికారుల మధ్య సమాచార మార్పిడి వైఫల్యమే ఈ ప్రమాదానికి కారణంగా కనిపిస్తున్నది. ఏమైనా పూర్తిస్థాయి దర్యాప్తులో గాని కారణాలు, బాధ్యుల నిర్ధారణ జరగదు.

సురక్షిత ప్రయాణం, మెరుగైన సౌకర్యాల గూర్చి రైల్వేమంత్రిత్వశాఖ గొప్పలు చెప్పుకుంటున్నా, రైలు ప్రమాదాలు, ప్రయాణీకుల ప్రాణనష్టం యథావిధిగానే జరుగుతుండటం విచారకరం. గత ఐదేళ్లలో 586 రైలు ప్రమాదాలు సంభవించగా, వాటిలో 53 పట్టాలు తప్పిన ప్రమాదాలు. 2016నవంబర్ 20న కాన్పూర్ సమీపంలో ఇండోర్–పట్నా ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పిన ప్రమాదంలో ప్రాణనష్టం ఎక్కువగా జరిగింది. 150 మంది మృతి చెందారు. 2015 మార్చి 20న డెహ్రాడూన్–వారణాసి ఎక్స్‌ప్రెస్ రాయ్‌బరేలీ జిల్లాలో పట్టాలు తప్పిన ప్రమాదంలో 58మంది చనిపోయారు. 2015 ఆగస్టు 4న ఆకస్మిక వరద వల్ల ట్రాక్ కొట్టుకపోవటంతో మధ్యప్రదేశ్‌లో కమయానీ ఎక్స్‌ప్రెస్, జనతా ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పటంతో కనీసం 30మంది చనిపోయారు.

రైలు ప్రమాదాలను పూర్తిగా అరికట్టటం లేదా నివారించటం సాధ్యం కాదు. కాని మానవ ప్రయత్నం పరంగా, సాంకేతికంగా తీసుకోవలసిన జాగ్రత్తలన్నీ రైల్వేబోర్డు తీసుకుంటున్నదా అనేది సందేహానికి తావిస్తున్న ప్రశ్న.

రైలు ప్రయాణం పట్ల ప్రయాణీకుల సంతృప్తి గణనీయంగా పెరిగినట్లు ప్రచారం జరుగుతోంది. అది నిజమైతే సంతోషదాయకమే. రైళ్లలో ఆహార నాణ్యత, స్టేషన్‌లలో సౌకర్యాల పెంపుదల, సుందరీకరణ వంటివి మెరుగైనాయి. గత కొద్ది సంవత్సరాల్లో 32వేలకుపైగా బయోటాయిలెట్లు అమర్చారు. సేవల్లో లోపాలగూర్చి నేరుగా రైల్వే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసేందుకు సోషల్ మీడియా సెల్ పనిచేస్తున్నది. అయితే మెరుగుదలలన్నీ దూరప్రయాణ ఎక్స్‌ప్రెస్‌ల్లో మాత్రమే జరుగుతున్నాయి. సామాన్యులు ప్రయాణించే ప్యాసింజ్ రైళ్లలో చెప్పుకోదగ్గ మార్పు కనిపించదు. రెండోవైపున, రైళ్లవేగం, సంఖ్య, బరువు(బోగీల పెంపుదల) పెరుగుదల కారణంగా ట్రాక్‌పై భారం పెరిగింది. అందువల్ల సరుకురవాణా కారిడార్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాల్సి అవసరముంది. లేనట్లయితే ప్రమాదాలు పొంచి ఉంటాయి. సంతాపం, పరిహారం ప్రకటించటం మినహా పోయిన ప్రాణాలు తేలేముకదా! బాధిత కుటుంబాల కన్నీళ్లు తుడవలేముకదా! ప్రమాదాల నివారణకు సాధ్యమైన జాగ్రత్తలన్నీ తీసుకోవటమే చేయదగిన పని. అందులో నిర్లక్ష్యం క్షమార్హం కాదు.


గాంధీ నోట బిజెపి మాట?

చూపు

మహాత్మాగాంధీ అనని మాటలను అన్నట్లుగా చూపుతూ జార్ఖండ్ ప్రభుత్వం ఓ వార్తా పత్రికలో జారీ చేసిన వ్యాపార ప్రకటన(యాడ్) వివాదమయ్యింది. మూడేళ్ల క్రితం కేంద్రప్రభుత్వం తన స్వచ్ఛ అభియాన్ పథకానికి మహాత్మాగాంధీని 'బ్రాండ్ అంబాసిడర్' చేసినట్లే ప్రస్తుతం జార్ఖండ్ ఆయనను మత మార్పిడుల వ్యతిరేక ప్రచారానికి పావును చేసింది.

క్రైస్తవ మిషనరీలను, వారి మత మార్పిడి కార్యకలాపాలను గాంధీ ఖండించినట్లు ఆ రాష్ట్ర ప్రభుత్వం,అధికారంలోని భారతీయ జనతా పార్టీ (బిజెపి)ఒక పత్రికకు ఇచ్చిన ఫుల్ పేజి యాడ్ చెబుతోంది. ఆదివాసీలు, దళితులలో మత మార్పిడికి ప్రచారాలు సాగిస్తున్నందుకు కూడా ఆయన వాటిని ఖండించినట్లు ఆ యాడ్ చాటుతోంది. కర్ర పట్టుకొని నడుస్తున్న భంగిమలో ఉన్న గాంధీ చిత్రంతో ఆయన అటువంటి ప్రకటన చేసినట్లు అర్థం వచ్చే సూక్తిని ప్రచురించారు. అది దురుద్దేశంతో కూడిన మోసకారి యాడ్. ఆ యాడ్‌లో ముఖ్యమంత్రి చిత్రంతో హిందీ భాషలో ఒక ప్రకటనను గాంధీ ప్రకటనగా ప్రచురించారు.

'గిరిజనులు ఆరాధించే భగవాన్ బీర్సా ముండా, కార్తిక్ ఉరావ్ కలను నిజం చేసే ఓ చర్య' అని ఆ ప్రకటనలో పరిచయ వాక్యం ఉంది. ఇక గాంధీ చెప్పినట్లుగా ఉన్న ప్రకటన ఈ విధంగా సాగింది 'ముక్తికి మతమార్పిడే మార్గమని క్రైస్తవ మిషనరీలు భావించే పక్షంలో ఆ పనిని నాతోను లేదా మహదేవ్ దేశాయ్‌తోను ఎందుకు ప్రారంభించరు? అతి సామాన్యులయిన, నిరక్షరాస్యులయిన అటవీవాసులను మతం మార్పించడానికి ఎందుకు పట్టుబడుతున్నారు? ఆ ప్రజలకు జీసస్‌కు, మహమ్మద్‌కు తేడా తెలియదు. మీ ప్రచారాలను వారు అర్థం చేసుకోలేరు. వారు ఆవులవలే మూగజీవులు. సొంత ఆలోచన లేనివారు. మీరు క్రైస్తవులుగా మార్చే ఆ పేద ప్రజలు కడుపుకు ఇంత తిండి కోసం బియ్యం సంపాదించుకోడానికి మతం మారుతారు తప్ప ఏసు క్రీస్తు కోసం కాదు'.



క్రైస్తవులను గురిపెట్టిన యాడ్

ఆ వ్యాపార ప్రకటన నేరుగా క్రైస్తవ సంస్థలను గురిపెడుతున్నందున ఆ ప్రకటనను ముఖ్యమంత్రి వెంటనే ఉపసంహరించుకోవాలి. అంతేకాకుండా జార్ఖండ్‌తోపాటు మొత్తం భారతదేశ క్రైస్తవులకు క్షమాపణ చెప్పాలి. మిషనరీలలోని వారితో సహా క్రైస్తవులు అందరూ దేశ పౌరులే. వారు కూడా పన్నులు చెల్లిస్తున్నారు. ఈ యాడ్ ప్రభుత్వ నిధులతో వచ్చినది. అంటే ప్రజల డబ్బుతో వారిపైనే విద్వేషాలు వ్యాప్తిచేస్తున్నట్లు. ప్రజలు తమ సొంత గొయ్యి తామే తవ్వుకొంటున్నట్లు. అందుచేత దానిని వెంటనే ఉపసంహరించాలి. ఆ యాడ్‌ను ముస్లింలు, క్రైస్తవుల పట్ల శత్రుత్వ ధోరణితో ఉండే ఆర్‌ఎస్‌ఎస్ ఇచ్చివుంటే అర్థం చేసుకోవచ్చు. కానీ అది ఆర్‌ఎస్‌ఎస్ రాజకీయ సంస్థ అయిన బిజెపి ఇచ్చినది. అది జార్ఖండ్‌లో అధికారంలో ఉన్నా ఆ రాష్ట్ర ప్రభుత్వం అటువంటి ప్రకటన ఇవ్వడం పూర్తిగా అపసవ్యం.

దళితులపై అవమానకర వ్యాఖ్యలు

అంతకంటే ముఖ్యమైన అంశం ఏమిటంటే జార్ఖండ్ ప్రభుత్వం ఈ ప్రకటన ద్వారా దేశ ఆదివాసీలను, దళితులను మూగవారు, అజ్ఞానులుగా పేర్కొనడం ద్వారా అవమానిస్తోంది. వారిని సొంతంగా ఆలోచించే జ్ఞానంలేని వెర్రివారుగా పేర్కొంది. గాంధీవంటి మహాత్ముని పేరుతో వివక్షలు ప్రచారం చేసేందుకు కూడా రాష్ట్ర ప్రభుత్వం వెనుకాడలేదు.

ఆదివాసీలు, దళితులపట్ల సొంత భావాలు కలిగి ఉంటే హక్కు గాంధీకి ఉంది. కానీ ఒక రాష్ట్ర ప్రభుత్వం ఆయన భావాలుగా తన వివక్షలను ప్రచారం చేయడం చాలా తప్పు.

మత మార్పిడులను నేరంగా ప్రకటిస్తూ బిల్లును తేవడానికి ఆ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రయత్నాలు ప్రారంభించిన నేపథ్యంలో ఈ యాడ్ విడుదలయింది. ఇక్కడ ఇది గమనించాల్సిన ముఖ్య విషయం. చోటా నాగపూర్, సంతాల్ పరగణాల పేరిటగల రెండు కౌలుదారీ చట్టాల మౌలిక లక్ష్యాలను మార్చివేస్తూ సవరణలు ప్రవేశ పెట్టే ప్రయత్నం ఇటీవల రాష్ట్రప్రభుత్వం చేపట్టడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దానినుంచి ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నమే మత మార్పిడులపై రాష్ట్ర ప్రభుత్వ వ్యతిరేక ప్రచారం. అందులో భాగంగా వెలువడినదే 'గాంధీ యాడ్' అని చెప్పక తప్పదు.

గిరిజనులకు మద్దతుగా నిలిచిన చర్చి

ఈ చట్టాల వివాదంలో క్రైస్తవ మతం గిరిజన ప్రజల పక్షం వహించింది. గిరిజనులకు వారి భూములపై హక్కులకు కాలరాసే చట్టాల సవరణలను బాహాటంగా వ్యతిరేకించి, ప్రభుత్వంపై ప్రజల ఆగ్రహాన్ని బలపరిచింది. అప్పటి నుంచి జార్ఖండ్ ప్రభుత్వం, బిజెపి కలిసి ఆదివాసీలపై కత్తికట్టాయి. తమకు వేరే మత సంకేతం కోసం డిమాండ్ చేస్తున్న 'సరణాలు', క్రైస్తవుల మధ్య ఎడం సృష్టించడానికి ఆర్‌ఎస్‌ఎస్ ఇటీవల కార్యకలాపాలు సాగిస్తోంది. మరోప్రక్క ఆ ఇరు వర్గాలను హిందూ పట్టులోకి తేవాలని కూడా ఆర్‌ఎస్‌ఎస్ గట్టిగా కృషి చేస్తోంది. ఆదివాసీలలో హిందూ దేవుళ్లకు, దేవతలకు స్థానం లేదు. హిందువులు దేవుడిని పూజిస్తే ఆదివాసీలు ప్రకృతిని పూజిస్తూ నాగ సంస్కృతిని ఆరాధిస్తారు.

ఆదివాసీలు హిందువులు కారని జబల్పూర్ హైకోర్టు గతంలో తీర్పు చెప్పిందికూడా. పైగా ఆదివాసీలు క్రైస్తవ మతం పుచ్చుకోవడాన్ని జార్ఖండ్ గిరిజనులు ఆరాధించే బిర్సా ముందా, కార్తీక్ ఉరావ్ వ్యతిరేకించినట్లు తప్పుడు ప్రచారాన్ని కూడా జార్ఖండ్ ప్రభుత్వం సాగిస్తోంది.

'ఆదివాసీలు హిందువులు కారు' అనే శీర్షికతో కార్తీక్ పుస్తకం కూడా రాశారు. ఇంతకీ గాంధీ ఈ అంశంలో ఏమన్నారు? అమెరికాకు చెందిన క్రైస్తవ ప్రచారకుడు జాన్ ఆర్ మాట్‌తో 1936 నవంబర్ 13న జరిగిన ఓ సంభాషణలో గాంధీ అన్నదానిని జార్ఖండ్ ప్రభుత్వం వక్రీకరించింది.

ఆ సంభాషణను అంతర్జాతీయ మిషనరీ కౌన్సిల్ నేత మాధవ్ దేశాయ్ రికార్డు చేశారు. గాంధీ ఆ వాఖ్యలో ఎక్కడా క్రైస్తవ మిషనరీల కార్యకలాపాలను ఖండించలేదు. అలా చేసినట్లుగా యాడ్ ఇవ్వడం తప్పు అని న్యాయ, సామాజిక నిపుణులు బాహాటంగా ఖండిస్తున్నారు.

✻ అపూర్వానంద్

భూసర్వేతో సేకరణ సులువు



బి.నర్సన్
9440128169

ఏ భూమి ఎవరిదో నిగ్గు తేలకుండా ప్రభుత్వాలు భూ సంబంధ వ్యవహారాలపై ముందడుగు వేయలేవు. పట్టా భూములు, ప్రభుత్వ భూములు, అటవీ విస్తీర్ణము, వ్యవసాయ యోగ్యము తదితర వివరాలు సేకరిస్తేగాని దేనినెలా ఉపయోగించు కోవాలో అర్థం కాదు.

రాష్ట్రంలోని 114.84 లక్షల హెక్టార్ల భౌగోళిక విస్తీర్ణంలో 28లక్షల హెక్టార్లలో అడవి విస్తరించి ఉంది. వ్యవసాయ యోగ్యమైన నేల 62.88 లక్షల హెక్టార్లుండగా అందులో 45.61లక్షల హెక్టార్లలో నికర సాగు జరుగుతోంది. 31.64 లక్షల హెక్టార్ల సాగునేలకు నీటి పారుదల సౌకర్య ముంది.

పాలనకు భూ వివరాలకు చాలా సంబంధ ముంది. అందుకే తెలంగాణ రాష్ట్ర పగ్గాలు చేతికి రాగానే ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు హైదరాబాద్ జిల్లా మినహా ఆనాటి 9 జిల్లాల్లో జులై 2014 లోనే భూ సర్వే చేయించాలని తలచారు. అయితే ముందు జనాభా సర్వే అనుకోవడంతో ఇది వెనుకబడింది.

నిజాం హయాంలో 1932లో చివరి సర్వే జరగడం వల్ల భూమి వివరాలు సేకరించటం ఇప్పటికిప్పుడు అయ్యే పనికాదని, రెవెన్యూ పరిజ్ఞానం గల సిబ్బంది అధిక సంఖ్యలో అవసరమని భావించి సర్వేను వాయిదా వేస్తూ వచ్చింది ప్రభుత్వం.

సెప్టెంబర్ 2014లో ప్రకటించిన రైతు పంట రుణాల మాఫీ సమయంలోనే యాజమాన్యపు హక్కు ల్లో ఉన్న లొసుగులవల్ల తెలంగాణ ప్రభుత్వం పలు సమస్యలెదుర్కొంది. ఒకే భూమిపై ఇద్దరు బ్యాంకు రుణం తీసుకోవడం, ఒకే రైతు అదే భూమిపై రెండు బ్యాంకుల్లో అప్పు తీసుకోవడం, లేనినేలపై దొంగ పాసు పుస్తకాలు చూపి అప్పులు తీసుకోవడం ఇలా రెవెన్యూ శాఖ నిర్వాకం బయటపడింది. వీటన్నింటినీ ఛేదించుకొని నికర రైతు పంట రుణం తేల్చుకోవడం వల్ల రాష్ట్రానికి దాదాపు వేయికోట్లు ఆదా అయ్యింది.

కోనేరు రంగారావు ల్యాండ్ కమిటీ రిపోర్టు ఆధారంగా 2006 నుండి పంపిణీ చేసిన పట్టా పాస్‌బుక్, యాజమాన్యపు హక్కు పత్ర పుస్తకాల నిర్వహణలో రెవెన్యూ శాఖ నిర్లక్ష్యం వల్ల నకిలీలు స్వైరవిహారం చేశాయి.

మొదట్లో పట్టాపాస్‌బుక్, టైటిల్‌డీడ్ రెండు పుస్తకాలు చేతికందడంతో రైతు సంతోష పద్దాడు. వాటిని బ్యాంకులు రుణాలకు రుజుపత్రాలుగా భావించాయి. ప్రభుత్వ రాయితీలను వ్యవసాయ తదితర శాఖలు వాటి ఆధారంగానే పంపిణీ చేశాయి. బెయిల్‌కు జామీనుగా కూడా కోర్టులు యాజమాన్యపు హక్కుపత్రం పుస్తకాన్ని అంగీకరించాయి. భూ తనఖా కూడా సులభమైంది. ఇసి, పదమూడేండ్ల పహాణీ, పాస్‌బుక్, టైటిల్ డీడ్ డిపాజిట్ చేయించుకుని బ్యాంకులు లక్షల రూపాయల తనఖా రుణాలు మంజూరు చేశాయి. ఎనిమిది ఎకరాల భూమి ఉన్న రైతు బ్యాంకు అప్పు ద్వారా ట్రాక్టరు, హార్వెస్టరు పొందే సౌలభ్యం వచ్చింది.

రైతులందరికీ పాస్‌పుస్తకాల పంపిణీలో సమయం పడుతున్నందువల్ల ఆనాటి ప్రభుత్వాలు భూమి క్రయ విక్రయాల సందర్భంలో రిజిష్ట్రార్లు పాస్‌పుస్తకాల తనిఖీ చేయనవసరం లేదని ఆదేశించాయి. దీనివల్ల అమ్మేవారి పుస్తకాల్లో భూమి యథాతథంగా ఉంటూ కొన్నవారికి రెవెన్యూ శాఖ కొత్త పాస్‌బుక్కులు చేతిలో పెట్టింది. కొన్నవారికి పాస్ పుస్తకాలు సిద్ధం చేస్తున్న సమయంలో అమ్మినవారి పుస్తకాలు తెప్పించి అందులో భూ వివరాలు సవరించే బాధ్యత కూడా రెవెన్యూ శాఖ సరిగా నిర్వర్తించ లేదు. దీని వల్ల కాగితాల్లో భూ విస్తీర్ణం పెరిగిపోయింది. నకిలీ పాస్ పుస్తకాలతో అది మరింత లెక్క తప్పింది.

2008లో కేంద్రప్రభుత్వం వ్యవసాయ రుణాల మాఫీ ఇవ్వడంతో మాఫీ ఆశ పెరిగి పట్టాదారులందరూ బ్యాంకు రుణాలకు ఎగబడ్డారు. టైటిల్ డీడ్ భరోసాతో బ్యాంకులు అడిగినవారికి లేదనకుండా రుణాలు మంజూరు చేశాయి.

> ప్రభుత్వం అంటున్నంతగా గ్రామాల్లో, కోర్టుల్లో భూ తగాదాలు లేవు. వాటికి ప్రభుత్వం బాధ్యత వహించవలసిన అవసరం కూడా లేదు. 1000 కోట్ల రూపాయల ఖర్చుతో ప్రభుత్వం చేపడుతున్న ఈ సర్వే వల్ల రైతుల సమస్యలు తీరేకన్నా ప్రభుత్వానికి భూ స్వరూపం తెలిసిపోతుంది. కేవలం భూసేకరణ కోసమే ఈ బృహత్కార్యం తోడ్పడితే రైతుల చేతిలోంచి భూమి జారిపోయినట్లే.

2014లో తెలంగాణ ప్రభుత్వం పంట రుణ మాఫీ సందర్భంగా క్రాస్ చెకింగ్‌వల్ల ఈ బండారమంతా బయటపడింది. ఈ దెబ్బతో రెవెన్యూ మరియు బ్యాంకు సిబ్బంది ఇక్కట్ల పాలయ్యారు కూడా. చేయని తప్పుకు నకిలీ పాస్‌పుస్తకాలపై లోన్లు ఇచ్చినట్లు రుజువు కావడంతో బ్యాంకు అధికారులు సస్పెండ్ అయ్యారు.

ఒక అనివార్య ప్రక్షాళన అనంతరం మిగిలిన పాస్ పుస్తకాలు రుణాలకు భరోసాగా బ్యాంకు లాకర్లలో ఉన్నాయి. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం నీటిపారుదల ప్రాజెక్టుల తదితర అవసరాల నిమిత్తం భూసేకరణ ఆరంభించడంతో పట్టాపాస్ పుస్తకాలు వెలుగు చూసే అవసరమొచ్చింది. వాస్తవానికిపంట రుణాల కోసం బ్యాంకులు రైతు పాస్ పుస్తకాలను తమ ఆధీనంలో ఉంచుకోకూడదు. వేసే పంట హామీపై ఇస్తున్న పంట రుణాలకు ఆ నేలను సాగు చేస్తున్నందుకు రుజువుగా ఆ సంవత్సరపు పహాణీ సరిపోతుంది. అయితే రైతును తమ గుప్పిట్లో పెట్టుకోవడానికి బ్యాంకులు పట్టాపాస్ పుస్తకాలను తమ దగ్గర పెట్టుకుంటున్నాయి. ప్రభుత్వం కొత్తగా పాస్ పుస్తకాలు ఇచ్చిన తర్వాత తమ వద్ద ఉన్న పుస్తకాల విలువ ఏమిటో బ్యాంకులకు అంతు చిక్కడం లేదు. కనీసం పంపిణీ సమయంలో పాత పుస్తకాలను వెనక్కి తీసుకొని కొత్తవి ఇస్తారో లేదో ఎవరికీ తెలియదు.

ఈ మధ్య కరీంనగర్ జిల్లాలో భూసేకరణ సమయంలో కలెక్టర్ బ్యాంకరు అభ్యర్థనను తోసిపుచ్చినట్లు వార్త వచ్చింది. తమ వద్ద రుణం ఉన్న భూమిని కొనుగోలు చేస్తున్నారు కాబట్టి సంబంధిత చెల్లింపు చెక్కును తమ కీయాలని కోరినా ప్రభుత్వాధికారులు సమ్మతించ లేదు. అమ్ముడుబోయిన భూమి పత్రాలు విలువ లేకుండా పోయి అప్పులు వసూలు కాని పరిస్థితి ఏర్పడుతుంది.

తెలంగాణ ప్రభుత్వం చేపట్టే భూ ప్రక్షాళన రెండు అవసరాలు తీరుస్తుందనవచ్చు. ఇందులో మొదటిది భూ సేకరణకు మార్గం సుగమమవుతుంది. కొత్త పుస్తకాలు రావడంతో బ్యాంకు రుణాలకు తోడు పాత పుస్తకాలు బ్యాంకుల్లో ఉన్న సేకరణ, కొనుగోలు సజావుగా సాగుతుంది. ఒక రోడ్ మ్యాప్ లాగా భూమి వివరాలన్నీ చేతిలోకి వస్తాయి. యజమానిని తక్షణం గుర్తించి పనులు చకచకా సాగించవచ్చు. పరాధీనంలో ఉన్న ప్రభుత్వ భూమి బయటపడి అది ప్రభుత్వ ఖాతాలో పడుతుంది.

ప్రభుత్వం వచ్చే ఖరీఫ్ నుండి రైతుకు పంటకు ఎకరానికి రూ.4000/–చొప్పున ఆర్థిక సహాయం చేస్తామని రుణ మాఫీ తుది విడత మొత్తం విడుదల చేస్తూ ఏప్రిల్‌లో ప్రకటించింది. దీనిలో ఎదురయ్యే పలురకాల సమస్యలకు పరిష్కారంగా భూ సర్వే ఉపయోగపడుతుంది.

రాష్ట్రంలో 50లక్షల హెక్టార్ల భూమి సాగవుతుండగా 56లక్షల మంది రైతులు ఆ పనిలో ఉన్నారు. ఇందులో 14 లక్షలమంది కౌలు రైతులు. రెవెన్యూ, వ్యవసాయ సిబ్బంది కాకుండా ప్రభుత్వం నియమించిన రైతు సంఘాల ప్రతినిధులు పండిస్తున్న రైతును గుర్తించి జాబితాను ఆర్థిక సహాయం కోసం ప్రభుత్వానికి అప్పగిస్తారు. ఇందులో కౌలు రైతులకు న్యాయం జరుగుతుందనే ఆశ లేదు. రైతు ఆర్థికస్థోమత అంటే భూస్వామి, చిన్న రైతు అన్న భేదం లేకుండా పండించే ఎకరానికి అందరికీ ఆర్థిక సహాయం లభిస్తుందని ప్రభుత్వం అంటోంది. పెద్ద రైతులు సాధారణంగా అధికశాతం భూముల్ని కౌలుకే యిస్తుంటారు. కాని పరిహారాన్ని ఎప్పుడూ వదలుకోలేదు. 14 లక్షల కౌలు రైతులకు న్యాయం జరిగేలా విధి విధానాలుండాలి.

నిజానికి సమగ్ర భూ సర్వే అంచనాలకు మించిన పని 10,875 గ్రామాలను కొలుస్తూ పోవాలి. సిబ్బంది ఆవశ్యకత, సాంకేతిక, సంసిద్ధత తక్షణ అవసరం. నిజమైన భూ యజమానిని వెదికి పట్టుకోవడం, ప్రకటించడం, అభ్యంతరాలను పరిష్కరించడం శాంతంగా, సామరస్యంగా చేయవలసిన పని.

ప్రభుత్వం అంటున్నంతగా గ్రామాల్లో, కోర్టుల్లో భూ తగాదాలు లేవు. వాటికి ప్రభుత్వం బాధ్యత వహించవలసిన అవసరం కూడా లేదు. 1000 కోట్ల రూపాయల ఖర్చుతో ప్రభుత్వం చేపడుతున్న ఈ సర్వే వల్ల రైతుల సమస్యలు తీరేకన్నా ప్రభుత్వానికి భూ స్వరూపం తెలిసిపోతుంది. కేవలం భూసేకరణ కోసమే ఈ బృహత్కార్యం తోడ్పడితే రైతుల చేతిలోంచి భూమి జారిపోయినట్లే.

దారిద్ర్యంపై పోరుకు లంబాడీలు ఏకమవ్వాలి



ఎం.ధర్మనాయక్
9490098685

దేశంలో లంబాడీలు, బంజారాలు తరతరాలుగా అసమానతలతో వెనకబడి ఉన్నారు. రెండవ ప్రపంచ యుద్ధం అనంతరం సైన్యంలో చేరి పనిచేశారు. ఎడ్లబండిపై ఉప్పు అమ్ముకుంటూ సంచార జీవనం సాగించారు. ఇప్పుడు ఆర్థిక వనరులు సరిగా లేక అడవిలో వంట చెరకు, అటవీ ఫలాలు, పశువుల సంపదను ఆసరా చేసుకొని జీవిస్తున్నారు. దేశంలో లంబాడీలు (బంజారా) ప్రత్యేకంగా తండా సముదాయంతో భాష, వేష, పండుగలు, పెళ్లిల్లు, పంచాయితీలు కూడా ప్రత్యేకమైనవిగా వీరి చరిత్ర ఉంది. ఎవ్వరూ వీరి జీవితం గురించి చరిత్ర గురించి సంపూర్ణంగా వ్రాయలేదు. దేశంలో 28 రాష్ట్రాలలో 420 జిల్లాల్లో ఏడుకోట్ల జనాభా ఉన్నారు. 96.76శాతం హిందువులుగా, 3.08 క్రిస్టియన్స్‌గా, 0.01 జైనులుగా, 0.04 ఇస్లాంలుగా, 0.02 ఇతర మతాల వైపు ఆకర్షితులయ్యారు. 12శాతం పురుషులు, 3 శాతం మహిళలు మాత్రమే చదువుకున్నారని అంచనా. 15 రాష్ట్రాల్లో లంబాడీలు అధికంగా గోర్ బోలీ భాష ఆయా రాష్ట్రాల్లో మాట్లాడుతున్నారు. హిందీ, తెలుగు, కన్నడ, మరాఠా, మార్వాడీ, బెంగాలీ, దుందారీ, చత్తీస్ఘర్, బాగ్రీ, గుజరాతీ, మాల్వీ, మోవాలీ, మేర్‌వారీ, ఓడిస్సా, సిక్వాడీ, లంబాడీ, గోర్‌బోలీ దేశంలో అభివృద్ధికోసం ఆర్టికల్ 8 ఉన్నది. భాషను అభివృద్ధి చేయడంలో కేంద్ర ప్రభుత్వాలు ముందుకు రావడంలేదు. దేశం మొత్తం మీద లంబాడీలకు పండుగలు ఏడు మహిళా దేవతలను వాటితోపాటు ప్రకృతిని ఆరాధించడం వారి సంప్రదాయం. తీజ్ మత్రాల్ సిక్లా, కంకాళీ, ఇంగ్లా, మేరామ, ద్వాళ్ ఆంగళ్, సేవాలాల్‌లను పూజిస్తారు. తరతరాలుగా వున్న లంబాడీ భాష కనుమరుగవుతున్నది. దేశంలో 53 శాతం లంబాడీలుగా, 25శాతం బంజారాలుగా, 18శాతం ఇతర పేర్లతో పిలువబడుతున్నారు.

చౌహాన్ (6 గోత్రాలు) రాథోడ్ (27 గోత్రాలు), పమార్ (21 గోత్రాలు) జాదవ్ గోత్రాలు (61) పై చిలుకుగా ఉన్నాయి. బంజారా ప్రత్యేక వస్త్రాధారణతోపాటు వారి దగ్గర తులం బంగారంతో చేసిన ముక్కుపుడక, కిలో వెండితో ఆభరణాలు, పంచలోహాలతో కలిసి ఆభరణాలు వారి ప్రత్యేక అలంకరణ. ఇప్పుడు పండుగలకు పెళ్ళిళ్ళకు ఇతర శుభకార్యాలకు ధరించి వారి వేషధారణ కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వీటితోపాటు ఆటలు, పాటలు, డ్యాన్సులు కూడా అవసరమే. దేశంమొత్తం వ్యాపించి యున్నందున వీరికి రావాల్సిన సంక్షేమ ఫలాలు, విద్య, వైద్య, భూమి, నీళ్ళు, నిధులు, అభివృద్ధి ఫలాలు అందడంలేదు. ఇప్పటికీ ఆయా రాష్ట్రాల్లో అసమానతలు ఉన్నాయి.

కాలం మారుతుంది. ఏ జాతి చైతన్యం అయినా మారుతుంది. మార్పు అనేది సహజం. పాతది వదిలేసి కొత్తది కోరుకోవడం అవసరం. మార్పుకు అనుగుణంగా సమాజ అవసరాలను తీర్చిదిద్దుకోవడం చరిత్ర. మన కర్తవ్యాన్ని నెరవేర్చుకోవడం, నాగరికతా సంస్కృతులు సుసంపన్నమౌతుంది. 7కోట్ల మంది లంబాడీల భాష, వేషధారణ అంతరించే పరిస్థితి ఉంది. 17వ శతాబ్దంలో తండాలుగా ఏర్పడ్డాయని చరిత్రకారులు చెపుతున్నారు. అప్పటి నుండి భూమిలేనివారుగా ఉన్నారు. రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా, సంస్కృతుల్లో శాస్త్ర సాంకేతికాల్లో అభ్యుదయంగా మలచుకోవాల్సిన అక్షరాయుధం నేటికీ లంబాడీల దరి చేరలేదు. అందుకే వారి చరిత్ర, జీవన విధానం ఎక్కడా రాయబడలేదు. వీరిని చరిత్రవైపు మళ్ళించ కుండా సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ వైపు పెట్టుబడి దారి చేతుల్లోకి వనరులు వెళుతున్నా యి. భాషా శాస్త్రవేత్త సాహితీ అకాడమీ పురస్కార గ్రహీత పీపుల్స్ లింగ్విస్టిక్ సర్వే ఆఫ్ ఇండియా (పిఎస్ఎల్ఐ) చైర్మన్ గణేష్, ఎన్. దేవి లు 780 భాషలకు 400 భాషలు అంతరించే పరిస్థితి ఉందన్నారు. 30 భాషలు మాత్రమే వాడుకలో ఉన్నాయి. లంబాడీ భాష, గోర్‌గోలీని రక్షించుకోవాల్సిన అవసరం ఉంది. 250 భాషలు అంతరించాయన్నారు. గిరిజన లంబాడీ తండాల మీద దాడి ప్రారంభించారు. వారి పండుగల్లో బ్రాహ్మణులు వచ్చారు. వ్యాపారంలో, మార్కెట్స్‌లో కూడా పెట్టుబడి దారులు ప్రవేశించారు. లంబాడీలుఅటవిలో లభించే వంటచెరకును అమ్ముకునే పరిస్థితి లేదు తినే తిండిలో మార్పు వచ్చింది. వేష, భాషలో సంస్కృతుల్లో ప్రైవేటీకరణ జోరు పెరిగింది. చివరికి తండాలను కూడా లేకుండా చేయాలనే కుట్ర జరుగుతుంది. ఆచార వ్యవహారాల్లో పంటపొలాల్లో, తిండిలో పాడే పాటల్లో, ఆడే ఆటల్లో కూడా మార్పు వస్తున్నది. తండాల్లో ఇప్పటికీ ఉదయాన్నే కోడి కూస్తే లేవడం, పొద్దుపోకముందే రాత్రి భోజనం చేసే పరిస్థితి ఉంది. దేశం మొత్తం మీద ఉన్న బంజారాల్లో బోర్‌బోలీని వారి ఆచార వ్యవహారాలను చైతన్య పరుస్తూ వారికి అన్ని రకాల సంక్షేమ ఫలాలు ఆర్థిక వనరులను ఉపాధి అవకాశాలు కల్పించి రక్షించుకోవాలని ప్రభుత్వంపై వత్తిడి తీసుకొద్దాం, సాధిద్దాం.

లంబాడీలను వివిధ రాష్ట్రాల్లో పిలిచే పేర్లు

తెలంగాణ	–	లంబాడీ, బంజారా
ఆంధ్రప్రదేశ్	–	సుగాలి, లంబాడీ
ఉత్తరప్రదేశ్	–	బంజారా
హర్యానా	–	సిరికివాలా
బీహార్	–	వనజారా
మధ్యప్రదేశ్	–	బంజారా
జార్ఖాండ్	–	వనజరా
చత్తీస్‌ఘడ్	–	బంజారా
కర్ణాటక	–	లమాణీ, లంబాడీ
తమిళనాడు	–	సుగాలి
కేరళ	–	గోర్, గౌర్యా
రాజస్థాన్	–	గవారియా
పంజాబ్	–	సిరికివాలా
మహారాష్ట్ర	–	గవర, కంగ్‌సిమా
ఢిల్లీ	–	సిరికి బాంద్
ఒడిస్సా	–	లంబాడీ

మన తెలంగాణ
5
హైదరాబాద్
మంగళవారం
22, ఆగస్టు, 2017
www.manatelangana.news

యువత

గ్రాడ్యుయేషన్ తర్వాత

ఉద్యోగం ఇలా సాధ్యం..



జీవితంలో త్వరగా స్థిరపడాలని కోరుకోనిదెవరు? ఇటు డిగ్రీ పూర్తవగానే అటు ఉద్యోగం రావాలని అదీ మంచి ఉద్యోగం కావాలని ప్రతీ ఒక్కరూ కోరుకుంటారు. కాని పరిస్థితులెప్పుడూ ఒకేలా ఉండవు, అంత సులువుగా ఉద్యోగం కూడా దొరకకపోవచ్చు. అయితే ముందు నుంచే సరైన ప్రణాళికతో శిక్షణ తీసుకుంటే కోరుకున్న ఉద్యోగం పొందడం పెద్ద కష్టమేం కాదు. ఎవరికైనా ప్రాథమిక చదువు అవసరమే! దానికి తోడు సాంకేతికత, ఎంచుకున్న సబ్జెక్టుకు ఉపయోగపడే ఇతర కోర్సులు ముందుగానే పూర్తిచేసి ఉంటే మీరు కోరుకున్న ఉద్యోగం పొందవచ్చు. ఉన్నత ప్రమాణాలు కలిగిన కాలేజీల్లో మంచి పర్సేంటేజీతో పాసైన విద్యార్థులు నిపుణతతో పని చేస్తారని, ఉత్తమ కమ్యూనికేషన్ స్కిల్స్ కలిగిఉంటారని, వీరిలో కొత్త ఆలోచనలు చేసే శక్తి అధికంగా ఉంటుందని పలు సర్వేలు చెబుతున్నాయి. మంచిడిగ్రీ, మంచి శిక్షణ, మంచి నైపుణ్యం కలిగిన వారి కోసం పెద్దపెద్ద కంపెనీలు గాలిస్తుంటాయి. ఆ అర్హతలు మీలో ఉంటే పెద్దకంపెనీ ఉద్యోగం మీదవుతుంది. పెద్దకంపెనీల కోరికలకు అనుగుణంగా మీరు తయారవాలంటే ఈ జాగ్రత్తలు తీసుకోవాలి.

ఒక మంచి మిత్రుడు, పేరెంట్, ఇష్టమైన ప్రొఫెసర్ ఇలా ఎవరినైనా మంచి గురువు లేదా మెంటార్‌గా ఎంచుకోవచ్చు. మీకు ఏ ఉద్యోగం సూట్ అవుతుంది.. ఏది కావాలి..అనే విషయంలో మాటసాయం చేయడానికి వీరు ఎంతగానో ఉపయోగపడతారు. ఏదైనా కంపెనీ నుంచి మీకు ఇంటర్వ్యూ పిలుపు వస్తే దానికి ఎలా ప్రిపేర్ కావాలో తెలియజేసేందుకు మెంటార్‌షిప్ ఉపయోగపడుతుంది. గ్రాడ్యుయేషన్ తర్వాత మీరు చేరాలనుకునే కంపెనీకి సంబంధించిన వ్యక్తిని గురువుగా ఎంచుకుంటే మరింత ఉపయోగకరంగా ఉంటుంది.

మంచి మార్కులతో బయటకి రావాలి :

మీరు కోరుకున్న కోర్సులో చేరాక కష్టపడి చదవడం మంచి మార్కులతో పాసవడం చాలా అవసరం. మొదటి నుంచి ఎగ్జామ్ పాయింట్ ఆఫ్ వ్యూలో కాక సబ్జెక్ట్ నేర్చుకోవాలనే తహతహతో చదువుకోవాలి. పునాదులు బలంగా వేసుకోవాలి. దానికి లెక్చరర్ నుంచి అందే సహకారం కన్నా మీరు చేసే కృషే మూలమవుతుంది. ఉద్యోగం కోసం అప్లై చేశాక మొదట పరిశీలనలోకి వచ్చేది మీ మార్కులు, గ్రేడ్లు మాత్రమే! అవే మీకు మంచి కంపెనీలోకి ఎంట్రీ పాసుల్లా ఉపయోగపడతాయి. అవే మీ తరఫున వకాల్తా పుచ్చుకుని రికమెండేషన్ ఇస్తాయి. మన ప్రతిభాపాటవాలకు మార్కులు కొలమానాలు కాకపోయినా మనమీద పెద్దల దృష్టిపడేలా చేసేవి మాత్రం ఖచ్చితంగా మార్కులే! కనుక ఎవరైనా మార్కులు చూసే వాడు మూర్ఖుడు లాంటి మాటలు మాట్లాడితే ఆ మాటల్లోపడి చదువులు నెగ్లెట్ చేయకండి. పాసైతే చాల్లే అన్న ధోరణిలో ఉండకండి. మంచి ఉద్యోగం పొందాలంటే మంచి మార్కులతో ఉన్న కాలమ్ మీ సర్టిఫికేట్లలో ఉండడం చాలా చాలా అవసరం. మీ రెజ్యూమేతో మేనేజ్‌మెంట్ సంతృప్తి చెందితేనే ఇంటర్వ్యూ అవకాశాలు వస్తాయి. వారు తృప్తిపడడానికి ఆయుర్వేద గుళికలా ఉపయోగపడేవి మార్కులే!

క్లాస్ రూం నుంచి బయటపడాలిః

క్లాస్‌రూం చదువులకుతోడు బైట అందుబాటులో ఉన్న అవకాశాలు వినియోగించుకుని వర్క్ ఎక్స్‌పీరియెన్స్ సాధించుకోడానికి ప్రయత్నించాలి. క్లాస్‌రూమ్ అవతల బతుకుతెరువుదారికి ఉపయోగపడే అంశాలు చాలా ఉంటాయి. అందుకని ఏదైనా పార్ట్‌టైం ఉద్యోగంలో చేరాలి. ఇందువల్ల ఆఫీసు కల్చర్ కూడా తెలుస్తుంది. ప్రాక్టికల్‌గా ఉండే ఇబ్బందులు, సదుపాయాలు అనుభవానికి వస్తాయి. అందువల్ల దృష్టి విశాలమవుతుంది. ప్రాబ్లం షూటర్‌గా మారడానికి అవకాశాలు పెరుగుతాయి.

మన చదువుకు అనుబంధంగా ఉండే సాఫ్ట్, హార్డ్ స్కిల్స్ తెలుస్తాయి. మీరు ఎంచుకున్న లైన్‌లో మరింత రాటుతేరడానికి లేదా లైన్ మార్చుకుని మరో మార్గాన్ని అన్వేషించుకోడానికి వీలవుతుంది. పనితనం పరిధి పెరుగుతుంది. చదువుకు, వర్క్‌కు ఉన్న అంతరమేమిటో, ఉద్యోగాలిచ్చే కంపెనీలు ఉద్యోగి నుంచి ఏం కోరుకుంటున్నాయో, వారు కోరుకునే నైపుణ్యాలలో మనకేం ఉన్నాయో, ఇంకెంత ప్రిపేర్ కావాలో తెలుస్తుంది. ముఖ్యంగా ఎబిలిటీస్ బలపడతాయి. మిమ్మల్ని మీరు సరిగా ఎక్స్‌పోజ్ చేసుకోడానికి, మీలో ఉన్న టాలెంట్స్‌ను బయటపెట్టడానికి వీలవుతుంది.

మంచి మెంటార్ కావాలి:

ఒక మంచి మిత్రుడు, పేరెంట్, ఇష్టమైన ప్రొఫెసర్ ఇలా ఎవరినైనా మంచి గురువు లేదా మెంటార్‌గా ఎంచుకోవచ్చు. మీకు ఏ ఉద్యోగం సూట్ అవుతుంది.. ఏది కావాలి..అనే విషయంలో మాటసాయం చేయడానికి వీరు ఎంతగానో ఉపయోగపడతారు. ఏదైనా కంపెనీ నుంచి మీకు ఇంటర్వ్యూ పిలుపు వస్తే దానికి ఎలా ప్రిపేర్ కావాలో తెలియజేసేందుకు మెంటార్‌షిప్ ఉపయోగపడుతుంది. గ్రాడ్యుయేషన్ తర్వాత మీరు చేరాలనుకునే కంపెనీకి సంబంధించిన వ్యక్తిని గురువుగా ఎంచుకుంటే మరింత ఉపయోగకరంగా ఉంటుంది.

స్నేహాన్ని బలపరుచుకోవాలి :

క్లాసులో, క్యాంటీన్లో, స్టడీ గ్రూపుల్లో, సోషల్, కల్చరల్ ఈవెంట్‌లలో, క్యాంపస్‌లో ఉండేవారైతే హాస్టల్ రూముల్లో ఉండేవారితో స్నేహాన్నిపెంచుకోవాలి. దీని వల్ల విద్యార్థుల్లో నెట్‌వర్క్ విశాలమవుతుంది. వీరి వల్ల మరిన్ని పరిచయాలు పెరిగి ఉద్యోగం పొందడంలో ఉపయోగపడతాయి.

సరైన ప్రణాళిక వేసుకోవాలి :

పట్టా చేతపట్టగానే ఉద్యోగం పొందాలంటే ముందునుండే సన్నద్ధంగా ఉండాలి. మీకిష్టమైన సబ్జెక్ట్ ఏంటి? అదే ఎందుకు కోరుకుంటున్నారు? దానికి మార్కెట్‌లో డిమాండ్ ఎలా ఉంది? మీరు చేరే రోజున ఉండే డిమాండ్ కాదు మీరు చదువు పూర్తిచేసి బైటకు వచ్చేనాటికి ఎలా ఉంటుంది? పోటీ ఏ స్థాయిలో పెరుగుతుంది. దానికి సిద్ధపడడానికి ఏం చేయాలి? ఎంత కష్టపడాలి? అనేవి అర్థమవుతాయి. ఈ సన్నద్ధతనుబట్టే దొరికే ఉద్యోగం ఆధారపడి ఉంటుంది. మీరు కోరుకునే కెరీర్‌లో మొదటి మెట్టు మీరెంచుకునే సబ్జెక్టే!

వృత్తి శిక్షణ అవసరం :

మీరు చదివిన సబ్జెక్టులో మీరు ఎంత నైపుణ్యం పొందితే అంత మంచి ఉద్యోగం పొందే అవకాశం వస్తుంది. దీనికోసం ఖాళీ సమయం దొరికినప్పుడెల్లా వృత్తికి సంబంధించి శిక్షణ తీసుకుంటూ, నైపుణ్యం పెంపొందించుకోవడం అవసరం. సబ్జెక్టుపై పట్టు రావడం వల్ల ఉత్తమ ప్రతిభ కనబరిచే అవకాశం ఉంటుంది. ఇది కెరీర్‌లో ఉత్తమంగా రాణించేందుకు మీకు ఉపయోగపడుతుంది.

ఇంటెర్న్‌షిప్ : మంచి గైడెన్స్‌తో, ఉన్నతమైన కంపెనీలో చేసే ఇంటెర్న్‌షిప్ మీ కెరీర్‌ను సరైన దిశగా నడిపిస్తుంది. కేవలం ఆరునెలల ఇంటెర్న్‌షిప్‌తో మీరు అనుభవజ్ఞుల లిస్టులో చేరిపోతారు. ఇది మీ సబ్జెక్టు పరిజ్ఞానాన్ని, నైపుణ్యాలను పెంచి కోరుకున్న ఉద్యోగం వచ్చేలా దోహదం చేస్తుంది. కనుక అవకాశం ఉంటే కొన్ని నెలలు ఇంటెర్న్‌షిప్ చేయడం మంచిది.

ప్రొఫెషనల్ సివి : ఉద్యోగ సంస్థలకు మిమ్మల్ని మీరు పరిచయం చేసుకునేది సివి ద్వారనే కాబట్టి దీన్లో మీ గురించి స్పష్టంగా, సమర్థంగా చెప్పడం అవసరం. సివి తయారుచేసేప్పుడు తప్పులు లేకుండా, అప్‌డేటెడ్‌గా ఉండడం అవసరం.

ఐటి ఉద్యోగాలు

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్

కంపెనీ	: వర్సె ఇన్నోవేషన్ ప్రై.లిమిటెడ్
అర్హత	: బిఇ/బి.టెక్, ఎంసిఎ
స్కిల్స్	: జావా కోడింగ్, లినక్స్ ఒఎస్
జాబ్ లొకేషన్	: బెంగళూరు
చివరి తేదీ	: 31 ఆగస్టు 2017

జూనియర్ ఆండ్రాయిడ్ డెవలపర్

కంపెనీ	: సాత్విక్ టెక్నాలజీస్
అర్హత	: బిఇ/బి.టెక్, బిఎస్‌సి, బి.కామ్
స్కిల్స్	: సి, సి++, జావా
జాబ్ లొకేషన్	: చెన్నై
చివరి తేదీ	: 31 ఆగస్టు 2017

పిహెచ్‌పి డెవలపర్

కంపెనీ	: సాఫ్ట్‌లాజిక్ ఇన్ఫోసిస్టమ్స్ ప్రై.లిమిటెడ్
అర్హత	: బిఎస్‌సి, బిసిఎ, బిఇ/బి.టెక్
స్కిల్స్	: పిహెచ్‌పి, వర్డ్‌ప్రెస్
జాబ్ లొకేషన్	: చెన్నై
చివరి తేదీ	: 31 ఆగస్టు 2017

ట్రైనీ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్

కంపెనీ	: వెగమ్ సొల్యూషన్స్ అరియోలె టెక్నాలజీస్
అర్హత	: బిసిఎ, ఎంసిఎ, బిఇ/బి.టెక్
స్కిల్స్	: సి#, ఎఎస్‌పి.నెట్,ఎస్‌క్యూఎల్
జాబ్ లొకేషన్	: బెంగళూరు
చివరి తేదీ	: 31 ఆగస్టు 2017

ఐటి ఇంటెర్న్

కంపెనీ	: క్లిక్టెక్ ఇంటర్నేషనల్ ఎబి
అర్హత	: ఎంఎస్‌సి, బిఎస్‌సి, బిఇ/బి.టెక్
స్కిల్స్	: ఎఎస్‌పి.నెట్, అజాక్స్, జావాస్క్రిప్ట్
జాబ్ లొకేషన్	: బెంగళూరు
చివరి తేదీ	: 30 ఆగస్టు 2017

అప్లికేషన్ సాఫ్ట్‌వేర్ డెవలపర్

కంపెనీ	: బల్సె రీసెర్చ్
అర్హత	: ఎంఇ/ఎం.టెక్, ఎంసిఎ, బిఇ/బి.టెక్
స్కిల్స్	: పిహెచ్‌పి, జావాస్క్రిప్ట్
జాబ్ లొకేషన్	: బెంగళూరు (జెపి నగర్)
చివరి తేదీ	: 26 ఆగస్టు 2017

పై ఉద్యోగాలకు సంబంధించిన మరిన్ని వివరాలకు www. freshersworld.comలో చూడవచ్చు.

సందేహాలకు సమాధానం

యుడు యాప్



మనకొచ్చిన సందేహాలను తీర్చుకోవాలంటే నలుగురినీ అడిగి తెలుసుకునే రోజులు పోయాయి. నెట్ ముందు కూర్చుంటే చాలు ఏమైనా తెలుసుకోవచ్చుననే రోజులివి. ఒక్కోసారి అక్కడా తికమక మొదలవుతుంది. ఇంటర్‌నెట్‌లో మన డౌట్‌కు సరైన సమాధానం వచ్చిందంటే సరే సరి... లేదంటే తిప్పలు తప్పవు. నెట్‌లో వేలకొద్దీ పేజీలు లోడ్ అవుతూంటాయి. సమస్య తీరకపోగా...మరింత అయోమయానికి గురవడం ఖాయం. ఇలాంటి సందేహాలకు సమాధానమే 'యుడు' స్టార్టప్. ఎలాంటి ప్రశ్న అయినా నిముషాల్లో సమాధానం చెప్పేస్తుంది.

లీడర్‌షిప్, మేనేజ్‌మెంట్ ట్రైనర్ అయిన హైదరాబాద్‌కు చెందిన తేజ గుడ్లూరు ఈ యాప్‌నకు శ్రీకారం చుట్టారు. అసలు తేజకు ఈ ఆలోచన ఎలా వచ్చిందంటే...ఒకసారి తేజ సింగపూర్ నుంచి కౌలాలంపూర్ వెళ్తున్నాడు. అతనికి ట్రాన్సిట్ వీసా కావాల్సివచ్చింది. దాని గురించి తేజకు పెద్దగా తెలీదు. ప్రొసీజర్ తెలుసుకోవడం కోసం ఇంటర్‌నెట్ ముందు కూర్చున్నాడు. ఇంకేముంది ట్రాన్సిట్ వీసా అని టైప్ చేయగానే బోలెడన్ని పేజీలు వచ్చాయి. రెండు గంటలు ఎంతో ఓపిగ్గా వెతికాడు. సమాధానం దొరక్కపోగా మరింత అయోమయంలో పడ్డాడు. బ్లాగుల్లో సమాధానం వెతికాడు. అక్కడ కొంతమంది రకరకాల వ్యాఖ్యానాలు పెట్టారు. మరికొంతమంది హేళనగా కామెంట్లు పెట్టారు. ఒక్క సందేహం తీరడానికి ఇన్ని అగచాట్లు పడాలా అంటూ విసిగిపోయాడు. అటువంటి సమయంలో తేజకు వచ్చిన ఆలోచనే యుడు యాప్. తనలాగే చాలామంది సమాధానం దొరకని ప్రశ్నలతో సతమతమౌతుంటారు. అలాంటివారికోసం పక్కా ప్లాట్‌ఫాం ఏమైనా తయారుచేయాలనుకున్నాడు. నిపుణులతో మాట్లాడించే వెసులుబాటు కలిగించాలనుకున్నాడు. ఇదంతా యాప్ ద్వారానే నడిపించాలనుకున్నాడు. 2017 ఏప్రిల్‌లో యుడు యాప్‌ను లాంచ్ చేసి తన ఆలోచనకు శ్రీకారం చుట్టాడు.

పనితీరు సులభం..

యాప్ డౌన్‌లోడ్ చేసుకుని సైనప్ అవ్వాలి. అడగాల్సిన ప్రశ్న ఏ రంగానికి సంబంధించిందో వెతకాలి. వెంటనే సంబంధిత ప్రాంతం నుంచి ఒక నిపుణుడు లైన్లోకి వస్తాడు. మీరడిగిన ప్రశ్నకు సంతృప్తికరమైన సమాధానం ఇస్తాడు. నిముషాల్లో మన డౌట్లను తీర్చేస్తారు. అదేవిధంగా మీరు సంపాదించుకునే అవకాశం కూడా ఇస్తుందీ యాప్ అంటాడు తేజ. మీరు ఏదైనా రంగంలో నిష్ణాతులైతే ఎక్స్‌పర్ట్ ప్యానెల్లో చేరేందుకు అవకాశం ఉంటుంది. కొంత పర్సెంటేజీ ఇస్తున్నారు. కెరీర్ కౌన్సెలింగ్, రిలేషన్‌షిప్స్, ఫ్యాషన్, పెట్స్ ఇలా 25 రంగాలకు చెందిన 300 వందల మంది నిపుణులు అడ్వైజరీ ప్యానెల్‌లో ఉంటారు. యూజర్ల ప్రైవసీని పక్కాగా మెయింటెన్ చేస్తారు. ఇండియాలో ఇలాంటి యాప్స్ రెండు మూడు మాత్రమే ఉన్నాయి. బెంగళూరుకు చెందిన టాప్ చీఫ్, చండీఘడ్‌కు చెందిన క్విక్ కన్సల్ట్ ఇన్‌స్టంట్ అడ్వైజ్ సేవలు అందిస్తున్నాయి. ఈ రెండూ వెబ్ సర్వీసులను మాత్రమే అందిస్తున్నాయి. తేజ స్టార్టప్ 'యుడు' ఒక్కటే యాప్ మోడ్‌లో ఉంది.

స్పందన బాగుంది..

ఐదుగురు ఉద్యోగులు, ఆరుగురు అడ్వైజర్లు, రూ.20లక్షల పెట్టుబడితో మొదలైన యుడు యాప్‌నకు మంచి స్పందన వస్తోంది. ఇప్పటికే 9వేల డౌన్‌లోడ్స్ నమోదు చేసింది. ఆండ్రాయిడ్ యూజర్లకు అందుబాటులో ఉంది. వచ్చే ఆరు నెలల్లో మరో నాలుగు స్టార్టప్‌లతో కలిసి పనిచేయబోతున్నట్లు తేజ చెబుతున్నారు. 4.5 లక్షల విద్యార్థులకు రీచ్ కావాలనేది యాప్ టార్గెట్. వ్యవసాయం, టూరిజం, స్కిల్ డెవలప్‌మెంట్ రంగాల్లో యాప్‌ను ఇంకా తీసుకెళ్లాలనుకుంటున్నారు తేజ. కొన్ని గ్రూపుల సాయంతో కౌన్సెలింగ్ నిర్వహించి రైతుల ఆత్మహత్యలను ఆపాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు.

లక్ష్యతో లక్ష్యానికి చేరువ

మారుమూల గ్రామాల్లో ఆర్థికంగా వెనుకబడి ఉన్న కుటుంబాల్లోని పిల్లలు ఎటువంటి లక్ష్యాలను లేకుండా ఉండటాన్ని గమనించారు 'భూమి' స్వచ్ఛంద వాలంటీర్లు. అటువంటి వారికి జీవితంలో ఎదగాలంటే ఏమేం అవసరమో వాటి ప్రాధాన్యాన్ని చెప్పదలిచారు. ఇందుకోసం ఢిల్లీకి చెందిన గోవింద్, రాహుల్, సంతోష్ అనే విద్యార్థులతో కలిసి భూమి వాలంటీర్లు హిమాన్ష్, లక్బీర్ కౌర్, ఊర్వశి, నరేందర్, రోనిల్, మిక్కి, స్నేహ్‌లు ఈ లక్ష్య ప్రాజెక్టును ప్రారంభించారు. ఆ పిల్లలకు రోజువారీ ట్యూషన్లు చెప్పడం ప్రారంభించారు. పిల్లలకు చదువు విలువ చెప్పి అతికష్టంపై వారు పదో తరగతి పరీక్షలు రాసేలా చేశారు. కళాశాల చదువుకు దూరంగా ఉంచిన వారి తల్లిదండ్రులను ఎంతో కష్టంమీద ఒప్పించారు. తర్వాత పైచదువులకు ఎంట్రన్స్ పరీక్షలు రాయించగా వారు మంచి ర్యాంకులు సంపాదించారు. విద్యార్థులకు కులం ఆదాయం సర్టిపికెట్లు ఇప్పించి ఢిల్లీ పాలిటెక్నిక్ కాలేజీలో చేర్పించారు. చదువుకొనే అర్హత ఉండికూడా పేదరికం, అవగాహన లేకపోవడం వల్ల చాలా మంది విద్యకు దూరమౌతున్నారు. అలాంటి పిల్లల్ని చేరదీసి వారికి అవగాహన కల్పించి, ఉన్నత చదువులు చదివేలా చేయడం మాకు చాలా ఆనందంగా ఉంది అంటున్నారు భూమి వాలంటీర్లు. వారివల్ల ఉన్నత చదువులు చదువుతున్న విద్యార్థులు భూమి వాలంటీర్లకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నారు. వాలంటీర్లు ఇదేవిధంగా రోజువారీగా ట్యూషన్లు చెబుతూ వారి భవిష్యత్తును బంగారు బాటలు వేస్తున్నారు.

వెనుకబడిన వర్గాల పిల్లలకు మనోధైర్యంతో పాటు ఆత్మవిశ్వాసం కల్పిస్తూ, వారి అభివృద్ధికి సహాయసహకారాలు అందిస్తున్నారు భూమి అనే స్వచ్ఛంద సంస్థ వాలంటీర్లు. వసతిగృహాల విద్యార్థులకు జీవన నైపుణ్యాలు అందిస్తూ, వారి బలాలను తెలియజేస్తూ, భవిష్యత్తులో ఉన్నతులుగా స్థిరంగా ఉండేలా తీర్చిదిద్దుతున్నారు. 2016లో ఢిల్లీలో ప్రారంభమైన భూమి అనే స్వచ్ఛంద సంస్థ పేద పిల్లల అభివృద్ధే ధ్యేయంగా 'లక్ష్య' అనే ప్రాజెక్టును మొదలుపెట్టింది.



కృత్రిమ కవాటం ఏర్పాటు

మన తెలంగాణ/హైదరాబాద్ : మినిమల్లీ ఇన్‌వేజివ్ పద్ధతిలో 22 సంవత్సరాల యువకునికి కృత్రిమ కవాటం ఏర్పాటు చేసి ప్రతిమ హాస్పిటల్స్‌లో అరుదైన చికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ప్రతిమ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ సి.టి సర్జన్ డాక్టర్ హరీష్ బదామి చికిత్స వివరాలను వెల్లడించారు. నల్గొండ జిల్లా దేవరకొండ మండలానికి చెందిన రాంబాబు కొంత కాలంగా ఆయాసం, ఊపిరి పీల్చుకోవడంలో ఇబ్బంది, వణకడం, దగ్గినప్పుడు రక్తం పడడం తదితర సమస్యలతో ఆసుపత్రిక,ఇ వచ్చారు. పరీక్షలు చేసి గుండెలో కవాటం తగిన రీతిలో పని చేయడం లేదని నిర్ధారించుకున్న వైద్యులు మినిమల్లీ ఇన్‌వేజివ్ పద్ధతిలో దీనిని అమర్చారు. దీనితో కేవలం రెండు అంచుల కోతతో రొమ్ము భాగంలోని ఎముకను కత్తిరించకుండా కవాటంను మార్చడానికి వీలు కలిగింది. ఈ పద్ధతిలో అతి తక్కువ రక్తస్రావం, ఇన్‌ఫెక్షన్‌లు లేకుండా రోగి త్వరగా కోలుకుంటారని బదామి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ చికిత్సలో అనస్థీషియాలజిస్ట్ డాక్టర్ యం.ఎల్.ప్రశాంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారన్నారు.



నేడు బ్యాంకు ఉద్యోగుల సమ్మె

మన తెలంగాణ/హైదరాబాద్/హిమాయత్‌నగర్: కేంద్ర ప్రభుత్వ రంగ బ్యాంకులను నిర్వీర్యం చేసి ప్రైవేటు వ్యక్తులకు అప్పగించాలనే ప్రభుత్వ ప్రయత్నానికి వ్యతిరేకంగా కార్పొరేట్ సంస్థలు తీసుకున్న రుణాలు వసూలు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం దేశవ్యాప్తంగా బ్యాంకు ఉద్యోగులు, అధికారులు ఒకరోజు సమ్మె నిర్వహిస్తున్నట్లు ఏపి, తెలంగాణ రాష్ట్రాల యునైటెడ్ ఫోరం ఫర్ బ్యాంక్ యూనియన్ తెలిపింది. ఈ మేరకు సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఫోరం కన్వీనర్ వివిఎస్ ఆర్ శర్మ, నాయకులు హర్షవర్ధన్, సుబ్రమణ్యం, రాధాకృష్ణ తదితరులు మాట్లాడుతూ బ్యాంకు సమ్మెలో దేశవ్యాప్తంగా ఉన్న 10 లక్షల మంది, ఉభయ తెలుగు రాష్ట్రాలలోని 8 వేల మంది ఉద్యోగులు, అధికారులు ఈ సమ్మెలో పాల్గొంటారని తెలిపారు. కార్పొరేట్ శక్తులు బ్యాంకుల నుంచి రెండున్న లక్షల కోట్ల రూపాయలు రుణాలు తీసుకున్నారని అన్నారు. రుణాలు తీసుకుని చెల్లించని సంస్థలపై క్రిమినల్ కేసులు పెట్టి ముక్కుపిండి వసులు చేయాలని వారు డిమాండ్ చేశారు.

పూజారి బీరువాలో దొరికిన మరో విగ్రహం

మనతెలంగాణ/బాసర: బాసర సరస్వతిదేవి ఆలయంలోని సంజీవ్ పూజారి బీరువాలో సరస్వతిదేవి రాగి విగ్రహం బయటపడిన సంఘటన మరో మారు సంచలనంగా మారింది. ఆలయంలో అమ్మవారి ఉత్సవ విగ్రహంఅపహరణకు గురయిన సంఘటనపై దేవాదాయశాఖ నియమించిన కమిటీ సోమవారం ఆలయంలోని పలు ప్రాంతాలలో విగ్రహం కోసం వెతికిన అనంతరం పలువురిని



విచారించారు. ఈసందర్భంగా ఆలయంలోని ఒక బీరువాను తెరిచి చూడగా దానిలో ఎటువంటి విగ్రహం ఆచూకీ లభించలేదు. సంజీవ్ పూజారికి చెందిన రెండవ బీరువా తాళాన్ని పగలగొట్టి వెతకగా అందులో సరస్వతి దేవికి చెందిన రాగి విగ్రహం, రాగి గద, రూ. 8000 వేల నగదు పట్టు వస్త్రాలతో పాటు ఇతర సామగ్రి లభించినట్లు కమిటీ సభ్యులు ముథోల్ సిఐ రఘుపతి తహసీల్దార్ వెంకటరమణ ఇఒ అన్నాడి సుధాకర్ రెడ్డిలు తెలిపారు. ఈ సందర్భంగా ఇఒ మాట్లాడుతూ నింబంధనలకు విరుద్ధంగా తన సొంత బీరువాలో విగ్రహాలను నగదును పట్టు వస్త్రాలను దాచి పెట్టడం సరికాదని దీనిపై శాఖాపరమైన చర్యలుంటాయని తెలిపారు. తదనంతరం పూజారి గదిలో కూడా వెతకగా అమ్మవారికి సమర్పించిన నగదు ఆభరణాలు లభ్యం కాగా అవి పూజారి ఆధీనంలో ఉండేవేనని ఇఒ తెలిపారు. ఇదిలా వుండగా పూజారి బీరువాలో రాగి విగ్రహం లభించగా కంచు ఉత్స విగ్రహం ఏమైఉంటుందని గ్రామస్తులు చర్చిస్తున్నారు. జులై 28వ తేదీనా ఆలయం నుండి ఉత్సవ విగ్రహం మాయం కావడం అదే విగ్రహానికి నల్లగొండ జిల్లా దేవరకొండ లోని ఒక పాఠశాలలోని అక్షరాభ్యాసాల కార్యక్రమంలో సంజీవ్ పూజారి, ప్రణవ్‌శర్మలు పూజలు చేసారనన్న ఆరోపణాలతో సస్పెండైన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో ఆలయ సూపరింటిండెంట్ గిరిధర్ సిబ్బంది సాయిలు ఉన్నారు.

ప్రైవేటు హాస్పిటల్స్‌పై పిటీషన్ కేసులో

కౌంటర్ దాఖలుకు ఆఖరి అవకాశం

మన తెలంగాణ/హైదరాబాద్ : ప్రైవేటు హాస్పిటల్స్‌పై దాఖలైన పిటిషన్‌పై హైకోర్టు మరోసారి విచారణ చేపట్టింది. కౌంటర్ దాఖలు చేసుకునేందుకు ప్రైవేటు హాస్పిటల్స్‌తో పాటు రెండు తెలుగు రాష్ట్రాలకు మరో రెండు వారాల గడువు ఇస్తున్నట్లు స్పష్టం చేసింది. ఇదే చిట్టచివరి అవకాశంగా భావిస్తున్నామన్న బెంచ్ కౌంటర్ దాఖలు చేయకుంటే తుది తీర్పు ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొంది. కాజీపేట నరేందర్ గతంలో కార్పొరేట్ హాస్పిటల్స్ అక్రమాలు, దోపిడి, తప్పుడు ఆపరేషన్లపై చర్యలు తీసుకోవాలంటూ దాఖలైన పిటీషన్‌ను హైకోర్టు విచారించింది. కౌంటర్ దాఖలు చేసేందుకు కావాల్సినంత సమయం ఇచ్చినప్పిటికీ దాటవేత ధోరణి కనబరిచిన ప్రైవేటు హాస్పిటల్స్‌తో పాటు రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలను మందలిం చింది. జస్టిస్ వి.రామసుబ్రమణ్యం, జస్టిస్ సి.రజనీలతో కూడిన ధర్మాసనం మరో రెండు వారాల గడువు మాత్రమే ఇస్తున్నట్లు తెలిపింది. కేసు విచారణ సందర్భంగా పిటీషనర్ నరేందర్ తరపున న్యాయవాది అర్జున్ కుమార్ మాట్లాడుతూ, గ్లోబల్ ఆసుపత్రిలో నిఖిల్‌రెడ్డి ఎత్తు పెంచుతామని చెప్పి మోసగించారని, కేర్ ఆసుపత్రిలో గైనకాలజిస్ట్ అనీల్ కౌర్ చికిత్సతో సునీత అనే పేషెంట్‌కు క్యాన్సర్‌ను గుర్తించడంలో విఫలమై చనిపోయేందుకు కారణమయ్యారని అన్నారు. విచారణకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున న్యాయవాది హాజరు కాలేదు. తెలంగాణ ప్రభుత్వం తరపున న్యాయవాది హాజరయ్యారు.

మున్సిపల్ సమ్మెపై చర్చలు వాయిదా

మన తెలంగాణ/హైదరాబాద్: మున్సిపల్ కార్మిక సంఘాల జెఎసి ప్రతినిధులతో సచివాలయంలో సోమవారం మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులు జరిపిన చర్చలు ఈ నెల 23వ తేదీకి వాయిదా పడ్డాయి. ఈ నెల 28, 29న రాష్ట్ర వ్యాప్తంగా రెండు రోజుల పాటు సమ్మె నిర్వహిస్తామని కార్మిక సంఘాల జెఎసి సమ్మె నోటీసులిచ్చిన నేపథ్యంలో మున్సిపల్ కార్యదర్శి నవీన్‌మిట్టల్, మున్సిపల్ డైరక్టర్ డాక్టర్ టి.కె.శ్రీదేవి తదితర ఉన్నతాధికారులు జెఎసి ప్రతినిధులతో చర్చలు జరిపారు. జెఎసి డిమాండ్లను పరిష్కరిస్తామని, ముందు సమ్మెను వాయిదా వేయాలని అధికారులు కోరగా, అందుకు జెఎసి అంగీకరించలేదు, కార్మిక వేతనాల పెం పు, బకాయిల చెల్లింపులపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తే సమ్మె అంశాన్ని పునరాలోచిస్తామని జెఎసి ప్రతినిధులు స్పష్టం చేశారు. దీంతో తమకు కొంత గడువు కావాలని అధికారులు కోరినట్లు తెలిసింది. ఈ చర్చలో జెఎసి నాయకులు పాలడుగు భాస్కర్, కమర్‌అలీ, జె.వెంకటేష్(సిఐటియు), కె.ఏసురత్నం, పి.శ్రీనివాస్‌రావు(ఎఐటియుసి), కె.సూర్యం(ఐఎఫ్‌టియు), ఎం.కె.బోస్(టిఎన్‌టియుసి) తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్ల వద్ద పనిచేసే విద్యుత్ కార్మికుల క్రమబద్ధీకరణపై చర్చలు

మన తెలంగాణ/హైదరాబాద్: ట్రాన్స్‌ఫార్మర్ రిపేరింగ్ సెంటర్లలో ప్రైవేటు కాంట్రాక్టర్ల వద్ద పనిచేస్తున్న 2000 మందిని విలీనం చేసుకోవాలని కార్మికులు డిమాండ్ చేశారు. విద్యుత్ సంస్థల్లో కార్మికులను విలీనం చేసుకున్నా, తమను ఆ జాబితాలో చేర్చలేదని యూనియన్ నాయకులు జానకి రాములు, వెంకన్న, అంజయ్య ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై సోమవారం నాడు టిఎస్ ఎస్‌పిడిసిఎల్ సిఎండి రఘుమారెడ్డితో కార్మికులు చర్చలు జరిపారు. కోర్టు పరిధిలో ఉన్న అంశం కాబట్టి, ఇప్పుడు ఎటువంటి హామీని ఇవ్వలేనని, త్వరలోనే సానుకూల నిర్ణయం తీసుకుంటామని రఘుమారెడ్డి చెప్పారు. వెంటనే ప్రైవేటు కాంట్రాక్టర్ వద్ద ట్రాన్స్‌ఫార్మర్ రిపేరింగ్ సెంటర్లలో పనిచేసే కార్మికులంతా విధుల్లోకి హాజరుకావాలని కోరారు.


క్లాసిక్ పరాఠాల ఆవిష్కరణ

మన తెలంగాణ/హైదరాబాద్ : ఆహర తయారీ, సరఫరాలో ప్రముఖ సంస్థ ఇన్నోవేటివ్ ఫుడ్స్ లిమిటెడ్ (ఐఎఫ్ఎల్) నూతన లైనప్ పరాఠాలను ఆవిష్కరించింది. నగరంలో సోమవారం జరిగిన ఒక కార్యక్రమంలో ఆ సంస్థ సేల్స్ అండ్ మార్కెటింగ్ ఉపాధ్యక్షులు సౌరభ్ కుమార్, మార్కెటింగ్ జిఎం సూరజ్ శర్మ నూతన శ్రేణి పరాఠాలు బీట్‌రూట్ అండ్ జీరా, టర్మరిక్ అండ్ అజ్వైన్, మేథీ అండ్ స్పినాచ్, మల్టీగ్రెయిన్‌లను ఆవిష్కరించారు. ఈ పరాఠాలు రూ.80 నుండి రూ.100లలో లభిస్తాయని వారు తెలిపారు.

ప్రాణాల మీదకి 'బ్లూ వేల్'

- **ఇంటర్నెట్ వినియోగంపై స్కూళ్లకు సిబిఎస్‌ఇ హెచ్చరిక**
- **సురక్షిత ఇంటర్నెట్ వినియోగంపై మార్గదర్శకాలు జారీ**

మనతెలంగాణ/హైదరాబాద్ : ప్రపంచవ్యాప్తంగా ఓ స్మార్ట్‌ఫోన్ గేమ్ పిల్లల ఉసురు తీస్తోంది. గంటల కొద్దీ గేమ్‌ను ఆడి మానసికంగా దానికి బానిసై, చివరకు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఇలాంటి ప్రాణాంతకమైన గేమ్‌పై సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సిబిఎస్‌ఇ) అప్రమత్తమై, పాఠశాలలకు 18 పాయింట్ల మార్గదర్శకాలు జారీ చేసింది. సురక్షితమైన ఇంటర్నెట్ వినియోగంపై పిల్లలకు అవగాహన కల్పించాలని పేర్కొంది. స్కూళ్లలో ఇంటర్నెట్ వినియోగంపై దృష్టి సారించి, ఎప్పటికప్పుడు పరిశీలిస్తుండాలని తెలిపింది. కొన్ని రకాల వెబ్‌సైట్లను బ్లాక్ చేయాలని సూచించింది. పిల్లల వయసు కు తగినట్లుగా ముందుగా ఎంపిక చేసిన వెబ్‌సైట్లనే చూసే విధంగా వారిని అనుమతించాలని పేర్కొంది. సురక్షిత ఇంటర్నెట్ వినియోగంపై బోధన, బోధనేతర సిబ్బందితో పాటు తల్లిదండ్రులకు కూడా అవగాహన కల్పించాలని సూచించింది. సురక్షితంగా ఎలక్ట్రానిక్ డివైస్‌ల వినియోగంపై పాఠశాలల్లో ఒక విధానం రూపొందించి, దానిని అమలు చేయాలని తెలిపింది. స్కూల్ బస్సుల్లో సైతం పిల్లలకు ఇంటర్నెట్ సౌకర్యం ఉన్న ఫోన్లు ఇవ్వకూడదని సిబిఎస్‌ఇ పేర్కొంది. అత్యవసర పరిస్థితుల్లో సంప్రదించేందుకు సాధారణ ఫోన్ ఇవ్వాలని సూచించింది. పాఠశాల పరిసర



ప్రాంతాలలో ఫోన్లు వినియోగించవద్దని 2009లో సిబిఎస్‌ఇ జారీ చేసిన మార్గదర్శకాలను అమలు చేయాలని తెలిపింది.

మారుతున్న గేమ్స్ తీరు : కాలానుగుణంగా గేమ్స్ తీరు మారుతోంది. ఇంటర్నెట్ యుగం ప్రారంభమయ్యాక, ఎన్నో రకాల గేమ్స్ పిల్లలను ఆకట్టుకుంటున్నాయి. స్మార్ట్‌ఫోన్లు వచ్చాక ఆ గేమ్స్ అరచేతిలోకి వచ్చాయి. ఈ గేమ్స్ ఉచ్చులో పడి పిల్లలు ప్రపంచాన్నే మరిచిపోతున్నారు. ఇందులో కొన్ని గేమ్స్ ఆహ్లాదాన్ని పంచుతుంటే, మరికొన్ని మాత్రం ఆత్మహత్యలకు ప్రేరేపిస్తున్నాయి. ఇలాంటి గేమ్ ఒకటి ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. అదే బ్లూ వేల్ ఛాలెంజ్. ఇప్పటికే దీని బారినపడి పిల్లలు చాలామంది ప్రాణాలు తీసుకున్నారు. ఈ రోగం ఇప్పుడు మనదేశంలోకి పాకింది. మనదేశంలో ముంబై, షోలాపూర్, మధ్యప్రదేశ్, పశ్చిమబెంగాల్ కొంత మంది విద్యార్థులు ఈ గేమ్ బారిన ప్రాణాలు కూడా కోల్పోయారు. ఎక్కువగా సంపన్న కుటుంబాలకు చెందిన పిల్లలకే అత్యాధునిక ఫీచర్లు ఉన్న సెల్‌ఫోన్లను వినియోగిస్తూ ఈ గేమ్ బానిసలవుతున్నారు. ఇటీవల డ్రగ్స్ విషయంలో కొన్ని బడా కార్పోరేట్ స్కూళ్లకు విద్యార్థులు బానికలైనట్లు వెలుగుచూసిన విషయాలు తల్లిదండ్రులను దిగ్భ్రాంతికి గురిచేయగా, అంతలోనే బ్లూ వేల్ ఛాలెంజ్ లాంటి ఆత్మహత్యలకు ప్రేరేపించే గేమ్స్‌తో మరింత ఆందోళనకు గురవుతున్నారు. పిల్లలు ఫోన్లలో లేదా కంప్యూటర్‌లో ఇంటర్నెట్ వినియోగంపై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉంటూ, వారికి కనిపెడుతూ ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

ఏంటీ బ్లూ వేల్ గేమ్..? : అపార విజ్ఞాన, వినోదాలకు కేంద్రమైన ఇంటర్నెట్‌లో కొందరు సాంకేతిక నిపుణులు శాడిస్టులుగా మారి తయారు చేసిందే బ్లూ వేల్ గేమ్. ముఖ్యంగా హైస్కూల్ విద్యార్థులను ఆత్మహత్య చేసుకునేలా ప్రేరేపించడానికి ఈ గేమ్‌ను అభివృద్ధి చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది పిల్లలు ఈ గేమ్ బారిన పడి ప్రాణాలు వదిలారు. సుమారు 50 రోజులపాటు పలు విధాలైన సవాళ్లను ఎదుర్కొంటూ ఆట ఆడటానికి ఉంచుతారు. చివరగా భవనం పైనుంచి దూకమని లేదా ఇతరత్రా ఆత్మహత్యా మార్గాలను సూచిస్తారు. ఈ ఆటలో చేరిన వారికి మొదట సులభమైన సవాళ్లను ఉంచుతారు. తెల్లవారుజామున నిద్రలేవడం, హర్రర్ సినిమా చూడటం, చేతులపై తిమింగళం బొమ్మను గీసుకోవడం తదితర సవాళ్లతో ఆసక్తిని పెంచుతారు. తర్వాత క్రమంగా ఈ గేమ్ ప్రాణాంతకంగా మారుతుంది.

పంట బీమాతో ప్రయోజనం: మోడీ

న్యూఢిల్లీ : గతేడాది ఖరీఫ్ సీజన్‌తోపాటు 2016–17 రబీ సీజన్‌ల ద్వారా దాదాపు 90 లక్షల మందికి పైగా రైతులు పంట బీమా ప్రయోజనాన్ని పొందారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద వారికి రూ.7,700 కోట్ల మేర నష్టపరిహారాలను కూడా చెల్లించారు. ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన సోమవారమిక్కడ జరిగిన సమీక్షా సమావేశం తాలూకూ వివరాలను ప్రధాన మంత్రి కార్యాలయం (పిఎంఒ) ఈ మేరకు ఒక ప్రకటన ద్వారా వెల్లడించింది. పంట బీమా నష్టపరిహారాలకు సంబంధించిన సమాచారాన్ని వేగంగా సేకరించడానికి స్మార్ట్‌ఫోన్లు, రిమోట్ సెన్సింగ్, ఉపగ్రహ సమాచారం, డ్రోన్లు సహా అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నామని ఈ సమావేశంలో పాల్గొన్న వ్యవసాయశాఖ అధికారులు ప్రధానికి తెలిపారు.

కార్పొరేట్ నిధులపై సిపిఐ వివరణ

న్యూఢిల్లీ : దేశంలోని రాజకీయ పార్టీలు అందుకున్న నిధుల వివరాల నివేదికపై సిపిఐ హర్షం వ్యక్తం చేసింది. ఏఏ పార్టీలకు ఎంత మొత్తంలో సొమ్ము ముట్టిందనే అంశాన్ని ప్రజాస్వామిక సంస్కరణల సంస్థ (ఎడిఆర్) వెల్లడించడం అభినందనీయం అని సిపిఐ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర రెడ్డి తెలిపారు. అధికార పార్టీలకు కార్పొరేట్ సంస్థలతో ఉన్న లోగుట్టు వివరాలు ఈ చందాల వివరాలతో వెల్లడి అయ్యాయని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అయితే తమ పార్టీ సిపిఐకి కార్పొరేట్ సంస్థల నుంచి రూ 18 లక్షల వరకూ విరాళాలు అందాయనే వార్తలో నిజం లేదని సురవరం స్పష్టం చేశారు. ఇది చాలా చిన్న మొత్తం అని ఈ నివేదికలో తెలిపినప్పటికీ , దీనికి సంబంధించి పార్టీ వివరణ ఇవ్వడం సముచితమని పేర్కొంటూ వివరాలు అందించారు. నివేదికలో పేర్కొన్నట్లు ఆయా సంవత్సరాలలో సిపిఐకి కార్పొరేట్ సంస్థల నుంచి ఎలాంటి నిధులు అందలేదని తెలిపారు. రూ 20 వేలు అంతకు మించి విరాళాలు అందించిన వారి పేర్లను పార్టీ వెల్లడించిందన్నారు. అంతకాకుండా అవి కూడా ఎక్కువగా పార్టీ ఎంపీలు, మాజీ ఎంపీలు లెవీలు చెల్లించే వారు అందించినవే అని ఇక ఎంపీలు, మాజీ ఎంపీల వేతనాలు, పింఛన్లలో 15 శాతం వరకూ పార్టీ నిధికి జమచేశారని, కొన్ని పత్రికలు ఇవి సంఘాలు, సంస్థల నుంచి వచ్చినవని పేర్కొన్నాయని సురవరం తెలిపారు. అయితే అది నిజం కాదని పేర్కొన్నారు. సన్నిహితులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు, ప్రజల నుంచి తీసుకునే విరాళాల వివరాలను పార్టీ ఎప్పటికప్పుడు ప్రజల ముందుంచుతుందని జవాబుదారిగా నిలుస్తుందని సిపిఐ ప్రధాన కార్యదర్శి ఈ ప్రకటనలో వెల్లడించారు.

చేతిలో చెయ్యేసి


(మొదటిపేజీ తరువాయి)

పరస్పరం ఆలింగనం చేసుకుంటూ తమను ఎవరూ విడదీయలేరని ప్రకటించారు. విలీన ప్రకటన చేసిన కొద్ది నిమిషాలకే ఆశీర్వాదం కోసం జయలలిత స్మారక స్థూపం వద్దకు వారిద్దరూ వెళ్లారు. ఆమెకు నివాళులర్పించారు. పార్టీ వ్యవస్థాపకుడు, దివంగత మాజీ సిఎం ఎంజిఆర్ స్మారక స్థూపానికి కూడా వారు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వేలాది మంది పార్టీ మద్దతుదారులు, కార్యకర్తలు వారి వెంట ఊరేగింపుగా సాగారు. కార్యకర్తలు బాణసంచా పేలుస్తూ, స్వీట్లు పంచుతూ సందడి చేశారు. 'మమ్మల్ని ఎవ్వరూ విడదీయలేరు. మేమంతా అమ్మ పిల్లలం. మా (రెండు వర్గాల) మధ్య స్వల్ప అభిప్రాయభేదాలు ఉండేవి. అయితే పార్టీ ప్రయోజనాల దృష్ట్యా వాటిని పక్కనపెట్టి కలిసి సాగాలని నిర్ణయించుకున్నాం' అని పన్నీర్ సెల్వం అన్నారు. ఆయనకు రాష్ట్ర ఆర్థిక, గృహ మంత్రిత్వ శాఖలను అప్పగించారు. ఆయన సన్నిహితుడు కె.పాండ్యరాజన్‌కు తమిళ అధికారిక భాష, తమిళ సంస్కృతి శాఖను కేటాయించారు. ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన పన్నీర్‌సెల్వం, పాండ్యరాజన్‌కు ప్రధాని మోడీ అభినందనలు తెలిపారు. ముఖ్యమంత్రి పళనిస్వామి ప్రభుత్వానికి అన్ని రకాలుగా సహకరిస్తామని హామీ ఇచ్చారు. సమీప భవిష్యత్‌లో తమిళనాడు రాష్ట్రం సరికొత్త శిఖరాలకు చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు. కాగా, అదాయానికి మించిన ఆస్తుల కేసులో సిఎం పదవికి జయ రాజీనామా చేసిన సమయంలోనూ, డిసెంబరు 5, 2016న ఆమె మరణించాక పన్నీర్ సెల్వం తమిళనాడు ఆపద్ధర్మ ముఖ్యమంత్రిగా వ్యవహరించారు. అయితే తనను సిఎం పదవి నుండి పార్టీ చీఫ్ శశికళ తప్పించడంతో పన్నీర్‌సెల్వం ఈ ఏడాది ఫిబ్రవరి 7న తిరుగుబావుటా ఎగురవేసిన సంగతి తెలిసిందే. ఉప ముఖ్యమంత్రి పదవితో పాటు పన్నీర్‌కు పార్టీలోనూ పెద్దపీట వేశారు. పార్టీని సమర్థవంతంగా ముందుకు నడిపించడానికి 11 మంది సభ్యులతో ఏర్పాటు చేసిన మార్గదర్శక కమిటీకి ఆయన నాయకత్వం వహించనున్నారు. ఈ కమిటీకి పళనిస్వామి ఉప సమన్వయకర్తగా ఉంటారు. తమ వర్గాలు విలీనం కావడం పట్ల పార్టీ దివంగత నేతలు ఎంజిఆర్, అమ్మ(జయలలిత) చాలా సంతోషిస్తారని ముఖ్యమంత్రి పళనిస్వామి అన్నారు. గత ఆరు మాసాల్లో తాము చాలా సమస్యలను ఎదుర్కొన్నామని, ఇక వాటిని సమిష్టిగా అధిగమిస్తామని వేలాది మంది మద్దతుదారుల హర్షధ్వానాల నడుమ ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. పార్టీ ఎన్నికల గుర్తు 'రెండాకుల'ను తిరిగి దక్కించుకోవడంపై ప్రధానంగా దృష్టి సారించనున్నట్లు ఆయన చెప్పారు.

దినకరన్ అత్యవసర భేటీ

అన్నాడిఎంకె చీలిక వర్గాల విలీనం నేపథ్యంలో పార్టీ అసమ్మతి నేత, శశికళ మేనల్లుడు టిటివి దినకరన్ తమకు మద్దతుగా ఉన్న 16 మంది ఎంఎల్‌ఎలతో ఇక్కడ అత్యవసరంగా భేటీ అయ్యారు. ఇటీవల తమకు అనుకూలంగా 20 మంది ఎంఎల్‌ఎల మద్దతు ఉందని ఆయన చెబుతున్నారు. కాగా, 234 మంది సభ్యులున్న తమిళనాడు అసెంబ్లీలో అన్నాడిఎంకె బలం 134. ఒకవేళ దినకరన్ తన మద్దతుదారులతో బయటకొస్తే, ఆ పార్టీ మైనార్టీలో పడుతుంది. మరోవైపు శశికళను పార్టీ నుండి తప్పిస్తే ప్రభుత్వం పడిపోతుందని ఆయన హెచ్చరిస్తున్నారు.

విలీనంపై కమల్ విమర్శలు



ఆరు నెలలుగా రాజకీయ సంక్షోభాన్ని ఎదుర్కొని ఎట్టకేలకు సోమవారం ఒక్కటైన అన్నాడిఎంకె వైరి వర్గాలపై నటుడు కమల్ హాసన్ విమర్శలు సంధించారు. విలీనం ద్వారా పార్టీ నాయకులు ప్రజలను పిచ్చోళ్లను చేశారని ఆయన వ్యాఖ్యానించారు. అందువల్ల ప్రజలు ఒక్కసారి ఆలోచించాలని ఆయన కోరారు. మాజీ సిఎం పన్నీర్ సెల్వం, సిఎం పళనిస్వామి వర్గాలు విలీనమైన నేపథ్యంలో ఆయన ఇలా ట్వీట్ చేయడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

శ్రీరాంసాగర్‌కు వరద

(మొదటిపేజీ తరువాయి)


గేట్లెత్తుతారు. నిజాంసాగర్‌లో 2400 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, ప్రస్తుతం 2 టిఎంసిల నీరు మాత్రమే రిజర్వాయర్లో ఉంది. మరో 16 టిఎంసిల నీరొస్తేనే నిజాంసాగర్ పూర్తిస్థాయిలో నిండుతుంది. ఎల్లంపల్లి రిజర్వాయర్లో 6110 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. గత రెండు రోజులుగా కడెం ప్రాజెక్టు నుంచి వచ్చిన నీళ్లు ఎల్లంపల్లిలోకి వస్తున్నాయి. 20 టిఎంసిల సామర్థ్యం ఉన్న ఎల్లంపల్లిలో 8.55 టిఎంసిలు రావాల్సి ఉంది. సింగూరు, లోయర్ మానేరు డ్యాంలలోకి ఇన్‌ఫ్లో లేదు. కృష్ణా బేసిన్‌లో ఆల్మట్టికి ఇన్‌ఫ్లో లేకపోగా, 35,000 క్యూసెక్కులను దిగువకు వదిలి నారాయణపూర్ డ్యాంను నింపుకుంటున్నారు. ఉజ్జయిని డ్యాంలోకి 32 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, మరో 30 టిఎంసిల నీరు వస్తేనే గేట్లు తెరిచేది. జూరాలకు 2500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. తుంగభద్రకు 6326 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతలకు ఇన్‌ఫ్లో లేదు.

ఈ పోరు ఆగదు

(మొదటిపేజీ తరువాయి)

వీటిని అంగీకరించేవారు కాదు, ఇప్పుడు కెసిఆర్ అదే ధోరణిలో నిరంకుశ వైఖరిలో వ్యవహరిస్తున్నారన్నారు. కెసిఆర్ రాజకీయాల్లోకి రాకముందే హైదరాబాద్ పట్టణంలో ధర్నా చౌక్ ఉన్నదన్నారు. దగ్గరలో నిరసన తెలిపితేనే అధికార పీఠానికి చేరుతుంది. ఊరిబయట ఎక్కడో ధర్నా నిర్వహిస్తే ఏం ప్రయోజనమని ప్రశ్నించారు. పార్లమెంట్‌కు అర కిలో మీటరు దూరంలో ఉన్న జంతర్ మంతర్లో ధర్నాలకు అనుమతి ఉండగా, హైదరాబాద్‌లో ఇందిరాపార్క్ వద్ద ఎందుకు వద్దన్నారంటూ సిఎంని సూటిగా ప్రశ్నించారు. తెలంగాణలో జరుగుతున్న ఇసుక దందాలు, నిరుద్యోగుల సమస్యలు, రైతు సమస్యలపై గళం విప్పకుండా కెసిఆర్ నిరంకుశంగా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ధర్నా చౌక్ పునరుద్ధరణ కోసం జరిగే పోరాటాన్ని సిపిఐ మరింత ముందుకు తీసుకుపోతుందని సురవరం ప్రకటించారు. సిపిఐ (ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మాట్లాడుతూ బాబ్రీ మసీదు ఘటన తర్వాత ఢిల్లీలోని బోట్స్ క్లబ్ లో ఉన్న ధర్నాచౌక్‌ను అప్పటి కేంద్ర ప్రభుత్వం నగరం వెలుపలకు తరలించిందని, కేంద్ర ప్రభుత్వంతో పోరాడి, పార్లమెంట్ సమీపంలో ఉన్న జంతర్ మంతర్‌ను ధర్నాచౌక్‌గా సాధించుకున్నామని తెలిపారు. అదే స్ఫూర్తితో ఇందిరా పార్క్ వద్ద కూడా ధర్నాచౌక్‌ను తిరిగి సాధించుకుంటామని అన్నారు. సాయుధ తెలంగాణ పోరాట వారసత్వం, ఎమర్జెన్సీ వ్యతిరేక పోరాట స్ఫూర్తితో ఈ హక్కును సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ధర్నాచౌక్ పోరాట కమిటీ కన్వీనర్ చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ఐదు నెలలుగా ధర్నా చౌక్ కోసం డిమాండ్ చేస్తున్నా పట్టించుకోకుండా తెలంగాణ సర్కారు నియంతృత్వంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. ధర్నాచౌక్ పునరుద్ధరణకోసం ఢిల్లీ దాకా రావడాన్ని ఒక ప్రత్యేక పరిస్థితిగా కోదండరామ్ అభివర్ణించారు. ఏ ప్రజాస్వామిక విలువలకోసం తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామో ఆ విలువల కోసం డిమాండ్ చేసే వేదిక లేకుండా చేయడం కెసిఆర్ నియంతృత్వ పోకడకు నిదర్శన్నారు. కెసిఆర్ హిట్లర్ పాలనకు వ్యతిరేకంగా ధర్నా పరిరక్షణ కమిటీ సభ్యులు చేస్తున్న ఉద్యమానికి ఎఐసిసి తరుపున మద్దతు ఇస్తున్నామని కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ రామచంద్ర కుంతియా ప్రకటించారు. కెసిఆర్‌కు వ్యవసాయంలో కాకుండా, హక్కులను కాలరాసే నియంతగా అవార్డు ఇవ్వాలని సిపిఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. ప్రశ్నించడానికి అవకాశమివ్వని నియంతృత్వ ప్రభుత్వం ప్రస్తుతం తెలంగాణలో నడుస్తోందని ఆరోపించారు. ఇందిరాపార్క్‌లో కాదంటే హైదరాబాద్ అంతా ధర్నాచౌక్ అవుతుందని హెచ్చరించారు. ఉద్యమ సమయంలో ఇందిరా పార్కు వద్ద ధర్నాలు చేసిన కెసిఆర్, ఇప్పుడు అదే ధర్నాచౌక్‌ను తొలగించడం దారుణమైన చర్య అని కాంగ్రెస్ మాజీ ఎంపి విహెచ్ అన్నారు. సామాన్యుడికి ప్రవేశం లేని ప్రగతి భవన్ నుంచి కెసిఆర్ పాలన సాగిస్తే తమ ఇబ్బందులు ఎవరికి చెప్పుకోవాలంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం కెసిఆర్ పాలనలో తెలంగాణ సమాజంలో అన్ని వర్గాలు నైరాశ్యంలో ఉన్నాయని టిపిసిసి అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. రైతులు, విద్యార్థులు కెసిఆర్‌పై అసంతృప్తితో ఉన్నారన్న ఆయన, కెసిఆర్‌కు తన పాలనపై ఏమాత్రం నమ్మకం వున్నా ధర్నాచౌక్ ను ఇందిరాపార్క్ నుంచి తరలించేవారు కాదన్నారు.

పాఠశాల దశనుంచే సైన్స్‌పై మక్కువ




మన తెలంగాణ /హైదరాబాద్/మాదాపూర్ : భారత దేశంలో మొట్టమెదటిసారిగా ఇంటర్నేషనల్ యూనియన్ ఆఫ్ క్రిస్టల్లోగ్రఫీ 24వ కాంగ్రెస్ సదస్సును సోమవారం మాదాపూర్‌లోని హెచ్ఐసిసిలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ప్రముఖ శాస్త్రవేత్తలు ప్రొఫెసర్ మైక్ గ్లేజర్, డాక్టర్ మైఖేల్ హెన్జ్, ప్రొఫెసర్ జీఆర్ దేశిరాజ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కాంగ్రెస్ సదస్సు ఏడు రోజుల పాటు జరుగుతుంది. ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే ఈ సమావేశం మన భారతదేశంలో నిర్వహించడం మొదటిసారి అన్నారు. 1700 వందల మంది పాల్గొనే సదస్సులో మన భారతదేశానికి చెందిన శాస్త్రవేత్తలు 500 వందల మంది పాల్గొన్నారు. ప్రపంచదేశాల నుంచి మొత్తం 75 దేశాలకు చెందిన శాస్త్రవేత్తలు సదస్సులో పాల్గొన్నారు. దేశిరాజ్ మాట్లాడుతూ క్రిస్టల్లోగ్రఫీ అంటే క్రిస్టల్స్‌ను అభ్యసించే విద్య అని ఆయన తెలిపారు. పంచదార, ఐస్, సాధారణ ఉప్పు కణాలు వంటివి క్రిస్టల్స్‌కు కొన్ని ఉదాహరణలు అన్నారు. ఈ హైదరాబాద్ నగరంలో ఏర్పాటు చేయడానికి ముఖ్య కారణం హైదరాబాద్ చుట్టు పక్కల చాలా ఫార్మా కంపెనీలు ఉన్నాయన్నారు. స్పటిక శాస్త్రం ఒక్కొక్క దానిపై శాస్త్రవేత్తలు పరిశోధించి దాని పనితీరును గుర్తించడం జరుగుతుందన్నారు. శాస్త్రవేత్తలు పరిశోధించిన దానిని వివిధ కంపెనీ యాజమాన్యానికి తెలిపి అందులోని శాస్త్రవేత్తకు స్పటిక శాస్త్రం గురించి వివరించడం జరుగుతుందన్నారు. క్రిస్టల్స్ ప్రతి చోటా ఉంటాయన్నారు.

ఎముకలు మొదలు రాక్స్ వరకు ఫార్మాస్యూటికల్ డ్రగ్స్‌లో సైతం ఈ క్రిస్టల్స్ ఉంటాయన్నారు. ఆకర్షణీయమైన లక్షణాలు, అందమైన స్పటికాకార పదార్థాల ఆకృతి వాటి మాలిక్యులర్ పరమాణు విభాగాల అమరిక నుండి వస్తాయన్నారు. ప్రపంచవ్యాప్తంగా క్రిస్టల్లోగ్రఫర్స్ నెట్ వర్స్ ఏర్పడడానికి దోహదం చేస్తుందన్నారు. పాఠశాల దశ నుంచి విద్యార్థులకు సైన్స్‌పై మక్కువ పెంచాలన్నారు. భారతదేశంలో చాలా మందికి టాలెంట్ ఉందన్నారు. అందుకు యువకులు ప్రోత్సహించాలన్నారు. ఈ సదస్సులో చాలా విషయాలపై చర్చలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ దేశాలకు చెందిన శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

ఎన్‌ఎంసిఎంఇ సభ్యునిగా రాంనేని శ్రీకాంత్

మన తెలంగాణ/ హైదరాబాద్: జాతీయ అల్పసంఖ్యాక వర్గాల విద్యా పర్యవేక్షక కమిటీ (ఎన్‌ఎంసిఎంఇ) సభ్యులుగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా రుద్రారం గ్రామానికి చెందిన రాంనేని శ్రీకాంత్ నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కేంద్ర మానవవనరుల అభివృద్ధి శాఖ మంత్రి ప్రకాశ్ జావదేకర్ ఛైర్మన్‌గా వ్యవహరించే ఈ కమిటీలో నాలుగు రాష్ట్రాల విద్యా కార్యదర్శులు, లోక్‌సభ, రాజ్యసభ ఛైర్మన్, నామినేట్ చేసిన వారు సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ పదవీ కాలం మూడు సంవత్సరాలు ఉంటుంది. మైనార్టీల విద్య ప్రణాళి కలను పర్యవేక్షిస్తూ మైనార్టీలకు మెరుగైన విద్యాను అందించేందుకు కమిటీ తగిన సూచనలు, సలహాలను ఇస్తుంది. ఇలాంటి కమిటీకీ రాంనేని శ్రీకాం త్‌కు అవకాశం కల్పించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. రాంనేని శ్రీకాంత్ విద్యార్థి దశ నుంచే వరంగల్‌లో విద్యారంగ సంస్కరణల కోసం అనేక ఉద్యమాలు చేశారు. ఈశాన్య రాష్ట్రాలలో పది సంవత్సరాల పాటు విద్యారంగంలో కూడా పనిచేశారు. బంగ్లాదేశ్ చొరబాటు దారులకు వ్యతిరేకంగా పనిచేశారు.

మైనార్టీలకు అభివృద్ధి ఫలాలు అందేలా కృషి : ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి ఫలాలు మైనార్టీలకు అందేలా కృషి చేస్తానని ఎన్‌ఎంసిఎంఇ సభ్యులు రాంనేని శ్రీకాంత్ తెలిపారు. ప్రభుత్వ పథకాలు, రాయితీలు అందుకోని మైనార్టీ వర్గాలు చాలా ఉన్నాయన్నారు. ఇటీవల కొన్ని విద్యా సంస్థలలో కొందరు వేర్పాటు వాదులు, అతివాద దోరణులతో విద్యార్థులను విభజిస్తున్నారని, వారి నుంచి



విద్యార్థులను అప్రమత్తం చేయాల్సిన అవసరం ఉన్నదని ఆయన అభిప్రాయపడ్డారు. కమిటీలో తనకు అవకాశం కల్పించడం పట్ల ఆయన ప్రధాని నరేంద్రమోడి, మంత్రి ప్రకాశ్ జావదేకర్ తదితరులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

బి.టెక్, బి.ఫార్మసీ రీవాల్యుయేషన్ ఫలితాలు విడుదల

మనతెలంగాణ/హైదరాబాద్ : బి.టెక్, బి.ఫార్మసీ రీకౌంటింగ్, రీవాల్యుయేషన్ ఫలితాలు సోమవారం జెఎన్‌టియుహెచ్ విడుదల చేసింది. ఈ ఫలితాలను పోర్టల్‌లో ప్రిన్సిపాల్ అకౌంట్‌లో పొందుపరిచినట్లు జెఎన్‌టియుహెచ్ డైరక్టర్ ఆఫ్ ఎవాల్యూషన్ డాక్టర్ వి.కామాక్షి ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24 నుంచి ప్రథమ సంవత్సరం రెండవ సెమిస్టర్(ఆర్16, ఆర్ 15 రెగ్యూలేషన్స్) అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

రుణ విమోచన కమిషన్

(మొదటిపేజీ తరువాయి)

విచారించింది. తెలంగాణ సర్కార్ మూడు నెలల్లో కమిషన్ ఏర్పాటు చేస్తుందని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది శరత్‌కుమార్ హైకోర్టుకు హామీ ఇచ్చారు. ఈ వ్యవధి గురించి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తెలిపారని చెప్పారు. ప్రభుత్వ హామీని రికార్డు చేసి అందుకు తగిన ఆదేశాలివ్వాలని పిటిషనర్ న్యాయవాది బాలాజీ వదేరా అభ్యర్థన మేరకు హైకోర్టు పై ఉత్తర్వులు ఇచ్చింది.



టిఆర్ఎస్ పాలనలో క్రియాశూన్యత : రావుల

మన తెలంగాణ/హైదరాబాద్ : టిఆర్ఎస్ ప్రభుత్వం పాలనలో ఊహచిత్రాలే తప్ప, పాలనలో క్రియాశూన్యత నెలకొని ఉన్నదని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు రావుల చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. గతంలో చేసిన కుటుంబ సర్వేనే ఒక ప్రహసనంగా చేశారని, ఇప్పుడు సమగ్ర భూసర్వే అంటున్నారని అన్నారు. సమగ్ర కుటుంబ సర్వే ప్రభుత్వానికి ఏ రకంగా ఉపయోగపడిందో చెప్పాలన్నారు. సర్వే వివరాలను బయటపెట్టే ధైర్యం ప్రభుత్వం ఎందుకు చేయడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వంలో ఏ వ్యవస్థ చూసినా పాలనలో సంపూర్ణంగా వైఫల్యం చెందినట్లు స్పష్టమౌతోందన్నారు. ఎన్‌టిఆర్ ట్రస్టు భవన్‌లో సోమవారం రావుల మీడియా సమావేశంలో మాట్లాడారు. చివరకు పంచాయితీరాజ్ వ్యవస్థను కూడా నిర్వీర్యం చేశారన్నారు. 8700 గ్రామ పంచాయితీలు, 6500 ఎంపిటిసిలు, 500 జడ్‌పిటిసిలు ఉన్నారని, ఈ వ్యవస్థలకు పనులు లేని దుస్థితి నెలకొందన్నారు. జిల్లా పరిషత్‌లు త్రిశంఖు స్వర్గంలో ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థలకు రూ. 15 వేల కోట్లు బకాయిలు ఇవ్వాల్సి ఉందని, వీటిని వెంటనే విడుదల చేయాలన్నారు. ఎస్‌సిలకు మూడెకరాల భూపంపిణీ, అర్హులందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణం చేసి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో టిడిపి నేత అజ్మీరా రాజునాయక్ కూడా ఉన్నారు.

ప్రమాదంలో యువకుడి మృతి

మన తెలంగాణ/జన్నారం : మంచిర్యాల జిల్లా జన్నారం మండలం కలమడుగు ఫారెస్టు చెక్‌పోస్టు దండకు తగిలి సోమవారం తెల్లవారు జామున యువకుడు వినోద్ (24) అక్కడికక్కడే మృతి చెందాడు. దస్తూరాబాద్ మండలం గుడి సెరాలకు చెందిన దాగేటి వినోద్ మరికొందరితో కలసి జగిత్యాల జిల్లా కేంద్రం నుంచి గణేష్ విగ్రహాన్ని ఆటోలో గ్రామానికి తీసుకువ స్తుం డగా అతివేగంగా ఆటోట్రాలి కలమడుగు వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు దండాకు తగిలి కిందపడి పోయి అక్కడికక్కడే మృతి చెందాడు. మిగతా వారు స్వల్పంగా గాయపడ్డారని జన్నారం ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. మృతుని దండ్రి లస్మయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగిందని ఆయన తెలిపారు.

డెంగ్యూ జ్వరంతో మహిళ మృతి

అనాధులుగా మారిన పిల్లలు

మనతెలంగాణ/టేకుమట్ల : వరంగల్ జిల్లా టేకుమట్ల మండలంలోని వెలిశాల గ్రామానికి చెందిన దోమకొండ నిర్మల(45) డెంగ్యూ జ్వరంతోచనిపోయినట్లు సోమవారం తెలిసింది. వారం రోజుల నుంచి నిర్మల జ్వరంతో బాధపడుతూ స్థానికంగా ఉన్న ఆసుపత్రిలో వైద్యం చేయించుకోగా ఎంతకు జ్వరం తగ్గకపోవడంతో రెండు రోజుల క్రితం నిర్మల డెంగ్యూ జ్వరంతో భాదపడుతూ ఎంజిఎం ఆసుపత్రిలో చికిత్స కోసం ఆసుపత్రిలో చేరింది. గత రెండు రోజుల నుండి ఎంతకు జ్వరం తగ్గకపోవడంతో వైద్యం అందిస్తున్న క్రమంలో ఆదివారం రాత్రి తుదిశ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా నిర్మల భర్త శంకరాచారి 2001 చనిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వీరికి ఒక కుమార్తె,ఒక కుమారుడు ఉన్నారు. పిల్లలు చిన్నవయస్సులో ఉన్నప్పుడే భర్త చనిపోగా నిర్మల రోజు వారి కూలీగా పనిచేస్తూ పిల్లలను సాకేదని తండ్రి, తల్లి చనిపోవడంతో ఆనాధులుగా అయ్యారని స్థానికులు విలపించారు.

హత్య చేసి శవాన్ని కాల్చారు

మన తెలంగాణ/నల్లగొండ ప్రతినిధి: నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి అద్దంకి రహదారి పక్కన శేషమ్మగూడెం సమీపంలో గుర్తుతెలియని వ్యక్తిని చంపి దుండగులు శవాన్ని కాల్చివేసిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం శేషమ్మగూడెం సమీపంలో శవం కాలుతున్న విషయాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్‌లతో విచారణ చేపట్టారు. మృతుడికి 45 ఏండ్ల వయస్సు ఉన్నట్లు తెలుస్తుంది. స్థలం వద్ద మృతుని వంగరం, కొన్ని నాణెలు పోలీసులకు లభించాయి. ఘటనా స్థలాన్ని ఎస్‌పి ప్రకాష్‌రెడ్డి పరిశీలించారు. తిప్పర్తి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఈతకు వెళ్లి విద్యార్థి మృతి

మన తెలంగాణ/వలిగొండ : ఈతకు వెళ్లి డిగ్రీ విద్యార్థి మృతి చెందిన దుర్ఘటన మండల పరిధిలోని గోకారం గ్రామ చెరువు వద్ద సోమవారం చోటు చేసుకుంది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్ మండలానికి చెందిన కారింగుల కృష్ణ, భాగ్యలక్ష్మి ల కుమారుడు కారింగుల వెంకటేశం(21) బిఎస్‌సి డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి అమ్మమ్మ జంగిలి నాగమ్మ, తాత ఎల్లయ్య ఇంటికి చౌటుప్పల్ మండల పరిధిలోని కుంట్లగూడెం గ్రామం బోనాల పండుగ కోసం వచ్చి సోమవారం ఉదయం 11 గంటల సమయంలో మేనమామ కొడుకు జంగిలి నందుతో కలిసి చెరువులో ఈతకు వెళ్లి చెరువులో లోతైన ప్రదేశంలో మునిగి చనిపోయాడని తెలిపారు. ఈ ప్రమాద వార్తను తెలుసుకొని దుర్ఘటన ప్రదేశానికి చౌటుప్పల్ ఆర్‌డిఓ సూరజ్‌కుమార్, వలిగొండ తహసీల్దార్ బి.యాదయ్య, వలిగొండ ఎస్ఐ డి.వెంకటేశ్వర్లు నీట మునిగిన శవంకోసం రెవెన్యూ, పోలీస్ సిబ్బంది సహాయంతో గాలింపును చేపట్టారు. శవం కోసం తెప్పల సహాయంతో పాతాళ గడియళ సాయంతో బయటకు తీసేప్రయత్నాలు,తీవ్ర గాలింపులు జరుపుతున్నారు.

నెమలిని చంపిన వ్యక్తిపై కేసు నమోదు

మన తెలంగాణ/ కొండమల్లెపల్లి : జాతీయ పక్షి నెమలిని వేటాడి చంపిన కొండమల్లెపల్లికి చెందిన బిజిలి లింగయ్యపై పోలీ సులు కేసు నమోదు చేశారు. సోమవారం తెల్లవారు జా మున గాజీనగర్ అడవుల్లో నెమలిని కొండమల్లెపల్లికి తీసుకువచ్చి దాని గొంతుకోసి మంటల్లో కాల్చాడు. ఈ విషయం తెలుసుకున్న పోలీ సులు ఘటనస్థలానికి చెరుకుని నెమలి కళేబరాన్ని లింగ య్య నుండి అటవీ సిబ్బందికి అప్పగించారు. లింగయ్యపై వన్య ప్రాణ సంరక్షణ చట్టం కింద కేసు నమోదు చెసుకుని ఫారెస్టు అధి కారులకు అప్పగించినట్లు సిఐ శివరాంరెడ్డి తెలిపారు. పోలీస్ స్టేషన్‌లో విలేకరులతో జరిగిన సమావేశంలో సిఐ శివరాంరెడ్డి, ఎస్ఐ శంకర్‌రెడ్డి ఈ వివరాలను వెల్లడించారు.

ఎటిఎంల మోసగాడి అరెస్టు

మన తెలంగాణ/ ఖమ్మం క్రైం : ఖమ్మం నగరంలోని పలు బ్యాంకుల ఏటిఎంల వద్ద డబ్బులు డ్రా చేయరాని వ్యక్తుల వద్ద మాయ మాటలు చెప్పి సాయం చేస్తానని నమ్మించి బురిడీ కొట్టిస్తున్న ఓ వ్యక్తిని సోమవారం ఉదయం ఖమ్మం నగర త్రీటౌన్ ప్రాంతంలోని ఎస్‌బిఐ మెయిన్ బ్రాంచ్ వద్ద అదుపులోకి తీసుకున్నట్లు ఖమ్మం నగర ఏసిపి పివి. గణేష్ తెలిపారు. ఈ సందర్భంగా త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జల్సాలకు అలవాటుపడ్డ తిరుమలాయపాలెం మండలం తిమ్మక్కపేటకు చెందిన నూకారపు ప్రవీణ్‌ను అదుపులోకి తీసుకున్నారు. కొంత కాలంగా ఎటిఎంల ద్వారా డ్రా చేసిన సుమారు రూ.50వేలు, ఓ ఏటిఎం కార్డును స్వాధీనపర్చుకున్నామని తెలిపారు. గత కొంత కాలంగా ఈ విషయంపై త్రీటౌన్ పోలీసులు ప్రత్యేక దృష్టిసారించి సిఐ వెంకన్నబాబు, ఎస్ఐలు పి.మల్లయ్య, ఇంద్రసేనారెడ్డి, త్రీటౌన్ ఐడి పార్టీ పోలీసులు మహబూబాబాద్ శ్రీనివాస్, దుర్గాప్రసాద్‌లు ప్రత్యేక టీంలుగా ఏర్పడి ఇతన్ని పట్టుకున్నట్లు ఏసిపి తెలిపారు. విలేకరుల సమావేశంలో సిఐ వెంకన్న బాబు, ఎస్ఐలు మల్లయ్య, ఇంద్రసేనారెడ్డి, శ్రీనివాస్, దుర్గాప్రసాద్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏసిపి గణేష్ త్రీటౌన్ పోలీసులను ప్రత్యేకంగా అభినందించారు.

కెసిఆర్‌కు అవార్డుపై కాంగ్రెస్ రాజకీయం

మన తెలంగాణ/హైదరాబాద్: సిఎం కెసిఆర్‌కు అవార్డు రావడాన్ని కూడా కాంగ్రెస్ నేతలు రాజకీయం చేస్తున్నారని తెలంగాణ స్టేట్ కో ఆపరేటివ్ ఆపెక్స్ బ్యాంక్ ఛైర్మన్ కె.రవీందర్‌రావు అన్నారు. తెలంగాణ భవన్‌లో సోమవారం మీడియా సమావేశంలో రవీందర్‌రావుతో పాటు టిఎస్ మార్క్‌ఫెడ్ ఛైర్మన్ లోక బాపురెడ్డి, టిఎస్ఎంఎస్ఐడిసి ఛైర్మన్ పర్యాద కృష్ణమూర్తి మాట్లాడుతూ శాస్త్రవేత్త స్వామినాథన్ ఆధ్వర్యంలోని కమిటీ సిఎం కెసిఆర్‌ను వ్యవసాయ నాయకత్వ అవార్డుకు ఎంపిక చేస్తే కాంగ్రెస్ నేతలు ఆరోపణలు చేయడం అన్యాయమన్నారు. ప్రతి అంశాన్ని విమర్శించాలనే విధానం మంచిది కాదన్నారు. 2008లో దేశ వ్యాప్తంగా రూ. 55వేల కోట్లు మాత్రమే యుపిఎ ప్రభుత్వం రుణమాఫీ చేసిందని, కాని టిఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో రూ.17,500 కోట్ల రుణాలను మాఫీ చేసిందని వివరించారు. పంజాబ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వ ప్రతినిధులు తెలంగాణ రాష్ట్రానికి వచ్చి ఇక్కడి రుణ మాఫీ విధానాన్ని పరిశీలించి మెచ్చుకున్నారని వారు గుర్తు చేశారు. సిఎం కెసిఆర్‌కు వ్యవసాయ నాయకత్వ అవార్డు రావడం ప్రతి రైతు గర్వించాల్సిన విషయమన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ నేతలు వ్యవసాయాభివృద్ధికి మంచి సలహాలు ఇవ్వాలని సూచించారు.

వాన జాడేది?

- ఖరీఫ్‌లో సాగు విస్తీర్ణం కేవలం 45 శాతమే
- భారీగా తగ్గిన వరిసాగు
- ఆయకట్టులో తీవ్ర వర్షాభావం

మన తెలంగాణ/ నల్లగొండ ప్రతినిధి: ఆగస్టుపై రైతులు పెంచుకున్న ఆశలు ఆవిరవుతున్నాయి. సకాలంలో వానలు కురవక అల్లాడుతున్న రైతులు గతేడాది మాదిరిగానే ఆగస్టు మాసంలో భారీ వర్షాలు కురుస్తాయని అన్నదాతలు ఆశ పడ్డారు. ఆగస్టు చివరి వారం సమీపిస్తున్నా జిల్లా వ్యాప్తంగా ఏ ప్రాంతంలోనైనా ఒక సెంటిమీటరు వర్షాపాతం నమోదు కాక పోవడంతో రైతులు విలవిల్లాడుతున్నారు. చిరుజల్లుతోనే మబ్బులు మాయమౌతుండటంతో ఆకాశం వైపు దీనంగా చూస్తున్నారు. నల్లగొండ జిల్లాలోఖరీఫ్ సాధారణ పంట విస్తీరణం 3,19,625 ఎకరాలు కాగా జులై నాటికి 45 శాతం మాత్రమే సాగైంది. 57,567 ఎకరాల్లో వరి సాగు జరగాల్సివుండగా 2,500 ఎకరాల్లో సాగు జరిగింది. రెండు లక్షల 13 వేల ఎకరాలకుగాను లక్షా 43 వేల ఎకరాల్లో పత్తిని సాగుచేసారు. కంది పంట విస్తీరణం పదివేల ఎకరాలు కాగా 12 వందల ఎకరాల్లోనే సాగు జరిగింది. మిరప, మినుములు, ఉలవలు, సోయాబీన్, చెరకు, లాంటి పంటల సాగు జీరో శాతానికి పడిపోయింది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 3,80,000 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లుండగా ప్రస్తుతం 24 గంటలు కరెంటు సరఫరా అవుతుండటంతో బోర్లు నిరంతరాయంగా భూగర్భ జలాలను తోడి పోస్తున్నాయి. సరైన వర్షాలు కురవక నీరు తక్కువగా లభ్యమౌతున్న సమయంలో ఉన్న భూగర్భ జలాలను తోడేస్తుండటంతో మడిలోని నీరు పక్క మడిలోకి పారకుండా ఇంకి పోతున్నాయి. జిల్లాలోని అనేక మండలాల్లో సగటు వర్షపాతం కంటే అతి తక్కువగా వర్షం కురిసింది. ఆయకట్టు మండలాల్లో అతి స్వల్పంగా వర్షాలు కురిసాయి. సాధారణ వర్షాపాతం కంటే అనుముల మండలంలో 34.3, నిడమనూరు 33.3, దామరచర్ల 24.1, అడవిదేవులపల్లి 14.3, తిరుమలగిరి (సాగర్) 26.2, పెద్దవూర 43.8, మిర్యాలగూడ 10.9, గుండ్లపల్లి 46.1, కనగల్ 14.5, చిట్యాల మండలంలో 20.7 మి.మీ వర్షాపాతం తక్కువగా నమోదయింది. రెండు రోజులకోమారు వాతావరణ వేత్తలు భారీ వర్షాలు కురుస్తాయన్న సూచనలు చేస్తున్నప్పటికి మామూలు జల్లులతోనే తెప్పరిల్లిపోతోంది. ఈ నేపథ్యంలో వర్షాల కోసం రైతులు ఆకాశం కేసి కళ్ళప్పగించి దీనంగా ఎదురుచూస్తున్నారు.



బోరు ద్వారా సాగవుతున్న వరి

అవకతవకలతోనే ఆర్‌టిసికి నష్టాలు


మన తెలంగాణ/హైదరాబాద్: అనేక అవకతవకలతోనే టిఎస్ఆర్‌టిసిలో నష్టాలు వస్తున్నాయని, దీనికి రాష్ట్ర ప్రభుత్వం, సంస్థ యాజమాన్యమే కారణమని టిఎస్ఆర్‌టిసి కార్మిక సంఘ్ అధ్యక్షులు కె.వెంకటాచారి అన్నారు. ఈ నెల 27న నల్లగొండలో జరగనున్న సంఘ్ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని కోరారు. మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను సంఘ్ కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మహాసభకు బిఎంఎస్ జాతీయ కార్యదర్శి రాజ్ బిహారిశర్మ, బిఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవిశంకర్, బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మనోహర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘ్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్.వెంకట్‌రెడ్డి, ఉపాధ్యక్షులు యు.మంజుల, కె.మధుసూదన్, బి.రాఘవులు, బి. వేణుగోపాల్‌రావు పాల్గొన్నారు.

లోక్‌సత్తా రాష్ట్ర కార్యవర్గం

మన తెలంగాణ/హైదరాబాద్: లోక్‌సత్తా పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గాన్ని రాష్ట్ర అధ్యక్షులు డా.పాండురంగారావు సోమవారం ప్రకటించారు. లోక్‌సత్తా ఎజెండాను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కొత్త కార్యవర్గం నూతనోత్సాహంతో పనిచేస్తుందని చెప్పారు. వచ్చే ఎన్నికలకు పార్టీని సిద్ధం చేసేందుకు సమిష్టిగా కృషి చేస్తామని ప్రకటనలో పేర్కొన్నారు. నూతన కార్యవర్గం: ఉపాధ్యక్షులుగా జగన్‌మెట్ల, బి.దుర్గారావు, ప్రధాన కార్యదర్శి గోవిందరావు, కార్యదర్శులుగా ఎన్.సరోజాదేవి, సకనాల సత్తయ్య, గట్టయ్య, కోశాధికారి బాలసుబ్రహ్మణ్యం, కమ్యూనికేషన్స్ కన్వీనర్ హమీద్, లీగల్ కన్వీనర్ కోటేశ్వరరావు, అధికార ప్రతినిధులు దేవిప్రసాద్, సాంబిరెడ్డి, కొంగర గంగాధరరావు, మహిళా సత్తా అధ్యక్షురాలు గజానని, యువసత్తా అధ్యక్షులు శివరామకృష్ణ, విద్యార్థి సత్తా రాజీవ్, కార్మిక సత్తా అధ్యక్షులు కొండల్ రెడ్డి, సమతాసత్తా అధ్యక్షులు గోపాల్‌తో పాటు జిల్లా అధ్యక్షులను నియమించారు.

సికింద్రాబాద్, హౌరాల మధ్య

ప్రత్యేక రైళ్లు



మన తెలంగాణ/హైదరాబాద్ : వరదల కారణంగా గువాహటికి వెళ్లే రైళ్లు రద్దు కావడంతో ప్రయాణికుల రద్దీని తగ్గించేందుకు దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్, హౌరాల మధ్య ప్రత్యేక రైళ్లను ప్రకటించింది. వాటి వివరాలివి. సికింద్రాబాద్, హౌరా, ప్రత్యేక రైలు ఆగస్టు 22న సికింద్రాబాద్ నుండి సాయంత్రం 5.55 గంటలకు బయలు దేరి మరుసటి రోజు రాత్రి 10.30 గంటలకు హౌరా చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో హౌరా, సికింద్రాబాద్ ప్రత్యేక రైలు ఆగస్టు 25న మధ్యాహ్నం 1.05 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 4 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. మార్గమధ్యలో ప్రత్యేక రైళ్లు కాజీపేట్, వరంగల్, విజయవాడ తదితర స్టేషన్లలో ఆగుతాయి. బెర్త్‌లను అడ్వాన్స్ రిజర్వేషన్ చేసుకునే సౌకర్యం కల్పించారు. అదే విధంగా ఆగస్టు 22న హౌరా , బెంగుళూరు కంటోన్మెంట్, ఆగస్టు 24న బెంగుళూరు కంటోన్మెంట్ , హౌరా ప్రత్యేక రైలును నడుపనున్నారు.

సాగునీటి కోసం అఖిలపక్షం ధర్నా



మన తెలంగాణ/జగిత్యాల : జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలోని పోతారం జలాశయం పనులను పూర్తి చేసి ఎల్లంపెల్లి ఎత్తిపోతల ద్వారా జలాశయం నింపి కొడిమ్యాల, మల్యాల మండలాలకు తాగు, సాగునీటి సౌకర్యం కల్పించాలని అఖిల పక్షం నాయకులు డిమాండ్ చేశారు. శనివారం పోతారం నుంచి ప్రారంభమైన పాదయాత్ర ఆదివారం జగిత్యాలకు చేరుకుంది. కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి ప్రభుత్వ పనితీరు పట్ల నిరసన వ్యక్తం చేశారు. కొడిమ్యాల, మల్యాల మండలాల్లోని పలు గ్రామాలు సాగు, తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, రిజర్వాయర్ నిర్మాణంతో తమ సమస్యలు పరిష్కారం అవుతాయనుకున్న ప్రజలఆశలను ప్రభుత్వం నీరుగారుస్తుందన్నారు. రిజర్వాయర్ పనులు 90శాతం మేర పూర్తి అయ్యాయని మిగతా 10 శాతం పనులు పూర్తి చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. రిజర్వాయర్ కోసం గత కొన్ని సంవత్సరాల నుంచి ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం చాలా బాధాకరమన్నారు. అనంతరం కలెక్టరేట్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ మేడిపెల్లి సత్యం, జిల్లా అధ్యక్షుడు అయిల్నేని సాగర్‌రావు, బిజెపి కిసాన్ మోర్చ జాతీయ ప్రధాన కార్యదర్శి సుగుణాకర్‌రావు, జిల్లా అధ్యక్షుడు బాజోజు భాస్కర్ పాల్గొన్నారు.

బ్యాంకుకు నకిలీ పూచీకత్తు

- పారితోషికంగా రూ.కోటి కొల్లగొట్టి పరార్
- ఐదేళ్ల తరువాత సిసిఎస్‌కు చిక్కిన నిందితుడు

మన తెలంగాణ/హైదరాబాద్ సిటీబ్యూరో : తన స్నేహితుడు రూ.6.60 కోట్లకు పెట్టుకున్న బ్యాంకు రుణానికి నకిలీ బ్యాంకు పూచీకత్తు ఇచ్చాడు. ఇక రేపో మాపో రుణం వస్తుందని నమ్మించి స్నేహితుడి నుంచి రూ.కోటి పారితోషికంగా తీసుకుని ఉడాయించాడు. అతను ఇచ్చిన బ్యాంకు పూచీకత్తు నకిలీదని తేలడంతో రుణం రద్దయింది. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించడంతో రంగంలోకి దిగిన పోలీసులు ఐదేళ్ల తరువాత నిందితుడ్ని అరెస్టు చేశారు. సిసిఎస్ డిసిపి అవినాష్ మహంతి కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ముంబాయికి చెందిన గోవింద్ సాల్‌గోనేర్ అలియాస్ శివాజీ రావు తన అనుచరులతో కలిసి రూ.84 కోట్లు మోసగించిన కేసులో 2015లో సిబిఐ పోలీసులు అరెస్టు చేశారు. బెయిల్‌పై వచ్చిన అతడు ఈ కేసులో కోర్టుకు హాజరు కాకుండా పేరు మార్చుకుని తప్పించుకు తిరుగుతున్నాడు. ఇదిలా వుండగా అమీర్‌పేట్‌లోని క్వోరి అర్మిన్ లిమిటెడ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ శ్రీనాథ్‌రెడ్డితో గోవింద్‌కు 2012లో పరిచయం ఏర్పడింది. తన సంస్థ అభివృద్ధి కోసం శ్రీనివాస్‌రెడ్డి రూ.6.60 కోట్ల రుణం కోసం ఓ బ్యాంకును ఆశ్రయించారు. అయితే అందుకు తగిన పూచీకత్తు ఇస్తే రుణం మంజూరు చేస్తామని అతనికి బ్యాంకు అధికారులు చెప్పారు. ఈ విషయం తెలుసుకున్న గోవింద్ తన వద్ద కోల్‌కత్తాకు చెందిన ఓ బ్యాంకు డిడి ఉందని, దాన్ని పూచీకత్తుగా ఇస్తామని శ్రీనివాస్‌రెడ్డిని నమ్మించాడు. అయితే అందుకు తనకు రూ.కోటి ఇవ్వాలని షరతు విధించాడు. అందుకు అంగీకరించిన శ్రీనివాస్‌రెడ్డి, గోవింద్‌ను తాను రుణం కోసం దరఖాస్తు చేసుకున్న హైదరాబాద్‌లోని ఓ బ్యాంకుకు తీసుకెళ్లాడు. బ్యాంకులో గోవింద్ తన వద్ద కోల్‌కత్తాకు చెందిన ఓ బ్యాంకు నకిలీ డిడిని పూచీకత్తు కింద సమర్పించాడు. రేపో మాపో రుణం వస్తుందని నమ్మిన శ్రీనివాస్‌రెడ్డి ఒప్పందం ప్రకారం గోవింద్‌కు రూ.కోటి అప్పగించాడు. కాగా నకిలీ డిడిని పూచీకత్తు కింద పెట్టడంతో తాను పెట్టుకున్న రుణ దరఖాస్తు తిరస్కరణకు గురైంది. తాను మోసపోయానని తెలుసుకున్న శ్రీనివాస్‌రెడ్డి, గోవింద్ కోసం ఆరా తీయగా అతని ఆచూకీ లభించలేదు. దీంతో ఈ ఉదంతంపై 2012లోనే శ్రీనివాస్‌రెడ్డి సిసిఎస్ పోలీసులకు ఫిర్యాదు ఇవ్వడంతో కేసు నమోదు చేశారు. అయితే అప్పటి నుంచి పరారీలో ఉన్న గోవింద్‌ను చాకచక్యంగా సోమవారం అరెస్టు చేశారు. రిమాండ్‌లో ఉన్న ఇతన్ని సిబిఐ పోలీసులు త్వరలో తీసుకెళ్లే అవకాశాలు ఉన్నాయి.

ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట ప్రసవం



తెలకపల్లి ప్రభుత్వ ఆసుపత్రి, ఇన్‌సెట్‌లో బాలింత

మన తెలంగాణ/తెలకపల్లి : ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పులు చేయించుకోండి .కెసిఆర్ కిట్‌ను పొందండి అంటూ ప్రభుత్వం ఒక వైపు గొప్పగా ప్రచారం చేసుకుంటుండగా ప్రభుత్వ ఆసుపత్రి గేటు ముందు కన్న శిశువుకు కనీసం బొడ్డుకూడా కత్తిరించడానికి ఆసుపత్రిలో సిబ్బందిలేని దిక్కుమాలిన పరిస్థితి తెలకపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నెలకొంది. సోమవారం తెల్లవారు జామున జరిగిన ఈ సంఘటనకు సంబంధించి బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకా రం. జిల్లా పరిధిలోని లింగాల మండలం రాంపురం గ్రామానికి చెందిన మహేశ్వరికి గ్రామంలో ఉండగానే పురిటినొప్పులు ప్రారంభమయ్యాయి. తెలకపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి ఆటోలో తీసుకు వచ్చారు. ఆసుపత్రి గేటులోకి రాగానే ఆటోలోనే ఆమె శిశువుకు జన్మనిచ్చింది. కుటుంబ సభ్యులు బాలింతను ఆసుత్రిలోపలికి తీసుకెళ్లారు. ఆసుపత్రిలో సిబ్బంది అందుబాటులో లేరు. కనీసం పుట్టిన శిశువుకు బొడ్డు కత్తిరించేందుకు కూడా ఎవరూ ముందుకు రాలేదు. రెండు గంటల వరకు బాలింత,శిశువు అలాగే ఉండాల్సి వచ్చింది. అనంతరం ఓ నర్స్ అక్కడి వచ్చి తల్లీబిడ్డలకు వైద్యం అందించింది.

పట్టించుకోని సిబ్బంది

పట్టించుకునే వారు లేరు

లింగాల ఆసుపత్రికి వెళితే ఇబ్బంది కలుగుతుందని తెలకపల్లి ఆసుపత్రికి తీసుకొచ్చాం. నర్స్‌లు, సిబ్బంది లేకపోవడంతో గేటు వద్ద కాన్పు అయిన నాకోడలిని పట్టించుకునే వారే కరువయ్యారు. ప్రభుత్వ ప్రచారాన్ని నమ్మివస్తే ఇక్కడ పరిస్థితి చాలా దారుణంగా ఉంది. ఏదైనా జరగరానిది జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారు. **—శంకరమ్మ,రాంపురం**

ప్రచారం ఎక్కువ పనితక్కువ

ప్రభుత్వ ఆసుపత్రులకు సంబంధించి ప్రభుత్వం చేస్తున్న ప్రచారానికి తగ్గట్లు పనితీరు లేదు. అధికారుల మాటలు నమ్మి ప్రభుత్వ ఆసుపత్రికొస్తే పట్టించుకునే వారు లేకుండా ఉన్నారు. ఇటీవల నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రిలో గర్భిణి గోస చూసిన తర్వాత కూడా పరిస్థితిలో ఎలాంటి మార్పు రాలేదనడానికి తెలకపల్లిలో ఆసుపత్రిలో జరిగిన ఈ సంఘటన నిదర్శనం. ఈ పరిస్థితులు మారాలి. ప్రభుత్వం స్పందించాలి. **—ఎం యాదయ్య, బిజెపి మండల అధ్యక్షులు**

ప్రత్యామ్నాయం లేకుండానే వెళ్లింది

విధులు నిర్వహించాల్సిన స్టాఫ్ నర్స్ శివలీల తమ బంధువులు ఎవరో చనిపోయారని సమాచారం ఇచ్చింది. సూపర్‌వైజర్‌కు చెప్పి ప్రత్యామ్నాయం ఏర్పాటు చేసి వెళ్లాలని సూచించా. ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండా నిర్లక్ష్యంగావెళ్లింది. జరిగిన సంఘటన గురించి పై అధికారులకు ఫిర్యాదు చేస్తా. **—డా.అరవింద్, తెలకపల్లి ,పిహెచ్‌సి**



తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న బాధితులు

మంత్రాల నెపంతో కుల బహిష్కరణ

- తహసీల్దార్‌కు బాధితుల ఫిర్యాదు

మన తెలంగాణ/వెల్దుర్తి : మంత్రాల నెపంతో గొల్లకుర్మ కులానికి చెందిన ఇరువురిని మూడు సంవత్సరాలుగా కుల బహిష్కరణ చేస్తున్న సంఘటన ఆలస్యంగా వెలుగులోకి రాగా దీనికి సంబంధించి బాధితులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే ... మండలంలోని కొప్పుల గ్రామానికి చెందిన దేవునూరి ఎల్లయ్య అనే వృద్ధుడిని 2014 డిసెంబరు 12న మంత్రాల నెపంతో విద్యుత్ స్తంభానికి కట్టివేసి చిత్రహింసలపాలు చేశారు. ఈ విషయమై మరుసటి రోజే ఎల్లయ్య కుమారులు సిద్దిరాములు, బీరయ్యలు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం కేసు కోర్టులో నడుస్తోంది. అయితే తమ కులానికి చెందిన పెద్దలు కేసును వాపసు తీసుకోవాలంటూ తమపై ఒత్తిడి తెస్తున్నట్లు పేర్కొన్నారు. కేసు ఉపసంహరణకు తాము అంగీకరించకపోవడంతో నాటి నుండి తమను కులం నుండి బహిష్కరించారని వాపోయారు. ఎవ్వరి ఇంట్లో శుభకార్యం జరిగినా తమను పిలవడంలేదని తెలిపారు. దీనికి తోడు తమ నానమ్మ చనిపోతే కూడా తమ ఇంటికి ఎవ్వరూ రాకుండా పెద్దలు జరిమానా విధిస్తామని హెచ్చరించడంతో తమ కులస్తులు ఎవ్వరూ రాలేదని తెలిపారు. ప్రభుత్వం పంపిణీ చేసిన గొర్రెల యూనిట్లు తమకు మంజూరు కాకుండా అడ్డుకున్నారని ఆరోపించారు. ఈ విషయమై పూర్తి విచారణ చేపట్టి కులబహిష్కరణ చేసినవారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై తహసీల్దార్ రాజేశ్వర్‌రావు స్పందిస్తూ గ్రామంలో క్షేత్రస్థాయిలో విచారణ చేపడతామన్నారు. బాధితుల ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

విశ్రాంత ఐఎఎస్ అధికారి పివిఆర్‌కె ప్రసాద్ కన్నుమూత

మన తెలంగాణ/హైదరాబాద్ /పంజాగుట్ట : విశ్రాంత ఐఎఎస్ అధికారి పీవీఆర్‌కే ప్రసాద్ బంజారా హిల్స్‌లో తుదిశ్వాస విడిచారు. శనివారం రాత్రి ఆయనకు గుండెపోటు రావడంతో చికిత్స నిమిత్తం బంజారాహిల్స్‌లోని కేర్ ఆసుపత్రికి హుటాహుటిన తరలించారు. తిరుమల తిరుపతి దేవస్థానం మాజీ కార్యనిర్వాహక అధికారిగా కూడా ఆయన సేవలు అందించారు. స్వర్గీయ మాజీ ప్రధాని పీవీ నరసింహారావు వ్యక్తిగత సలహాదారుగా ఆయన సుధీర్ఘ కాలం పని చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం ప్రాముఖ్యతను తెలియజేస్తు ఆయన అనేక రచనలు చేశారు. పీవీఆర్‌కు భార్య, కుమారుడు, కుమార్తె లు ఉన్నారు. ఆయన మరణ వార్త ఆయన అభిమానులతో పాటు సన్నిహితులకు తీరని దుఃఖాన్ని కలిగించింది. ఆయనకు కడసారి నివాళులు అర్పించేందుకుగాను ఆయన బంధుమిత్రులు, స్నేహితులు , సహోద్యోగులు ఆయన స్వగృహానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా వారు పీవీఆర్‌తో తమకున్న అనుభంధాన్ని గుర్తు చేసుకున్నారు. పీవీఆర్ మృతి పట్ల తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో పాటు పలువురు ప్రముఖులు తమ సంతాపాన్ని తెలియజేశారు. సోమవారం సాయంత్రం ఆయన కుటుంబ సభ్యులు పంజాగుట్ట హిందు స్మశాన వాటికలో ఆయనకు అంత్యక్రియలు నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వం తరపున మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున సలహాదారు పరకాల ప్రభాకర్‌లు స్మశాన వాటికకు వచ్చి నివాళులర్పించారు.

గవర్నర్, సిఎం సంతాపాలు : పివిఆర్‌కె ప్రసాద్ మరణం పట్ల గవర్నర్ ఇఎస్ఎల్.నరసింహన్, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు తమ ప్రగాడ సానుభూతిని తెలియజేశారు. ప్రసాద్ మృతిపట్ల తెలంగాణ స్టేట్ ఐఎఎస్ ఆఫీసర్స్ ఇన్‌స్టిట్యూట్ అధ్యక్షులు బి.పి.ఆచార్య సంతాపాన్ని వ్యక్తం చేశారు.

మద్యం విధానంపై ముసాయిదా

మన తెలంగాణ / హైదరాబాద్ : త్వరలో రానున్న నూతన మద్యం పాలసీపై ఎక్సైజ్ శాఖ మంత్రి పద్మారావు సోమవారం నాడు సచివాలయంలో సమీక్షించారు. మద్యం దుకాణాల లైసెన్సు లు ఉన్న వారందరితో ఒక సమావేశంలో పెట్టి డ్రాఫ్ట్ పాలసీని తయారు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఎన్ని దుకాణాలు ఉంటాయి? ఎన్నింటిని షిఫ్టింగ్ చేయాల్సి ఉంటుందన్న అంశంపై పూర్తి వివరాలు అందించాలన్నారు. కల్లుగీత కార్మికులకు చెట్టేందుకు యంత్రాలు, నీరా స్టోరేజీ, మార్కెటింగ్, కల్లుగీత కార్మికులకు గుర్తింపు కార్డులు జారీ అంశాలను పద్మారావు ఈ సమావేశంలో చర్చించారు. దీర్ఘకాలికంగా పని చేస్తున్న అధికారులను బదిలీ చేయాలని కూడా అధికారులకు సూచించారు.

నేడు ఆర్‌టిసి డిపోల ఎదుట ఇయు నిరాహార దీక్షలు

మన తెలంగాణ/హైదరాబాద్ : ఆర్‌టిసి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్(ఇయు)ఆధ్వర్యంలో మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని డిపోల ముందు కార్మికులు ఒక రోజు ''నిరాహారదీక్ష'' చేపట్టనున్నారు. 2017 ఏప్రిల్ 1 నుంచి కార్మికులకు పే స్కేల్ అమలు చేయాలని, 30 శాతం ఐ.ఆర్‌ను ఇవ్వాలని, ప్రైవేటు బస్సుల అక్రమ రవాణను అరికట్టాలని, అద్దెబస్సులను రద్దు చేసి, ఆర్‌టిసిలో మూసివేతలు ఆపాలని ఇయు డిమాండ్ చేసింది. ఒక రోజు పాటు జరిగే నిరాహారదీక్షలో కార్మికులందరూ పాల్గొనాలని ఇయు కోరింది.

బాలీవుడ్‌లో 'ఫిదా' రీమేక్?

శేఖర్ కమ్ముల సినిమాలకు హిట్ టాక్ వస్తే బాక్సాఫీస్ కలెక్షన్లు ఏ రేంజ్‌లో ఉంటాయో మళ్లీ మరోసారి చూపించింది ఆయన ఇటీవలి చిత్రం 'ఫిదా' వరుణ్‌తేజ్‌సాయి పల్లవి జంటగా తెర కెక్కిన ఈ సినిమా అటు నిర్మాతలు, ఇటు బయ్యర్లకు బాగానే లాభాలు తెచ్చిపెట్టింది. ఈ నేపథ్యంలో ఫిదాను బాలీవుడ్‌లో రీమేక్ చేసేందుకు సన్నాహాలు మొదలయ్యాయనే టాక్ వినిపిస్తోంది. పంజాబ్ బ్యాక్‌డ్రాప్‌తో ఈ చిత్రాన్ని తెరకెక్కించేందుకు కొందరు బాలీవుడ్ ఫిల్మ్‌మేకర్స్ ప్లాన్ చేస్తున్నారట. అయితే ఈ సినిమాలో హీరో కంటే హీరోయిన్‌కే ఎక్కువ ప్రాధాన్యత ఉండటం వలన ఆ పాత్రను ఓ క్రేజీ బాలీవుడ్ హీరోయిన్‌తో చేయించడానికి ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలిసింది. అంతేకాదు ముందు టాలీవుడ్‌లోకి అడుగుపెట్టి ప్రస్తుతం బాలీవుడ్‌లో దూసుకుపోతున్న ఓ భామ 'ఫిదా' హిందీ రీమేక్‌లో హీరోయిన్‌గా నటించే అవకాశం ఉందని అంటున్నారు. అయితే ఈ సినిమాను తెలుగులో ప్రముఖ నిర్మాత దిల్‌రాజు నిర్మించాడు. త్వరలోనే దిల్ రాజు కూడా బాలీవుడ్‌లో సినిమా చేసే అవకాశం ఉందనే టాక్ ఫిల్మ్‌నగర్‌లో వినిపిస్తోంది. దీంతో ఫిదా రీమేక్‌తోనే ఆయన బాలీవుడ్‌లో అడుగుపెడుతున్నాడా లేదా అనే విషయంపై ప్రస్తుతానికి క్లారిటీ లేదు. మరి త్వరలోనే ఈ రీమేక్‌పై ఏదైనా అధికారిక ప్రకటన వస్తుందా అనేది చూడాలి.


సాయి పల్లవి

ముచ్చటగా మూడో చిత్రం షూటింగ్‌లో...

నందమూరి బాలకృష్ణ హీరోగా కె.ఎస్.రవికుమార్ దర్శకత్వంలో సికె ఎంటర్‌టైన్‌మెంట్స్ ప్రై. లిమిటెడ్ పతాకంపై సి.కళ్యాణ్ ఓ భారీ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇటీవల ప్రారంభమైన ఈ చిత్రంలో స్టార్ బ్యూటీ నయనతారను కథానాయికగా ఎంపిక చేసిన విషయం తెలిసిందే. సోమవారం నుండి ఆమె ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్‌లో పాల్గొంటోంది.

మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రం రెగ్యులర్ షెడ్యూల్ ప్రస్తుతం హైదరాబాద్‌లోని రామోజీ ఫిలిం సిటీలో జరుగుతోంది. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత సి.కళ్యాణ్ మాట్లాడుతూ ''సింహా, శ్రీరామరాజ్యం వంటి బ్లాక్‌బస్టర్ హిట్స్ అనంతరం బాలకృష్ణనయనతార కాంబినేషన్‌లో వస్తున్న సినిమా ఇది. ఆ సినిమాల స్థాయిలోనే ఈ సినిమాలో కూడా వారి మధ్య మంచి కెమిస్ట్రీ ఉంటుంది. ఈ హిట్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ఈ మూడో సినిమాపై అభిమానులు, ప్రేక్షకుల్లో భారీ అంచనాలున్నాయి. బాలకృష్ణ కెరీర్‌లోనే ఇది మరో సంచలన చిత్రమవుతుంది''అని అన్నారు. బ్రహ్మానందం, ప్రకాష్‌రాజ్, అశుతోష్ రాణా, మురళీమోహన్, బాహుబలి ప్రభాకర్, శివపార్వతి తదితరులు ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్న ఈ భారీ చిత్రానికి కథ, మాటలుః ఎం.రత్నం, యాక్షన్ః అంబరీవ్, కెమెరాః సి.రాంప్రసాద్, సంగీతంః చిరంతన్ భట్, కోప్రొడ్యూసర్ః సి.వి.రావు, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ః సి.తేజ, సి.వరుణ్‌కుమార్.


నయనతార, బాలకృష్ణ

మహేష్ ఆగమనం కోసం..

పొరుగు భాషలకు చెందిన స్టార్ హీరోలు మన తెలుగు మార్కెట్‌లో మంచి వసూళ్లను సాధిస్తున్నారు. దీంతో మన స్టార్ హీరోలు కూడా పొరుగు భాషల మార్కెట్‌లో సత్తా చాటాలని తహతహలాడుతున్నారు. సూపర్ స్టార్ మహేష్‌బాబు ఇప్పుడు అదే పనిలో ఉన్నాడు. కోలీవుడ్‌లో సత్తా చాటేందుకు ఒక పెద్ద అడుగువేస్తున్నాడు. మిగతా వాళ్లలాగా ఇక్కడ సినిమా తీసి తమిళ్‌లోకి అనువాదం చేసి రిలీజ్ చేయడం కాకుండా భారీ స్థాయిలో తెలుగు, తమిళ్‌లో 'స్పైడర్' చిత్రాన్ని చేస్తున్నాడు. మురుగదాస్‌లాంటి స్టార్ డైరెక్టర్‌ను పెట్టుకొని అతను చేస్తున్న ఈ చిత్రం తమిళ ప్రేక్షకుల దృష్టిని కూడా బాగానే ఆకర్షిస్తోంది. ముందునుంచి తమిళంలో ఈ సినిమాను ప్రమోట్ చేయడానికి ప్రత్యేక ప్రణాళికలతో వెళ్తున్నాడు మహేష్. ఇందుకోసం ఇదివరకే తమిళ మీడియాకు ప్రత్యేక ఇంటర్వ్యూలు కూడా ఇచ్చాడు. సెప్టెంబర్ 9న చెన్నైలో జరిగే ఒక భారీ కార్యక్రమం ద్వారా కోలీవుడ్‌లోకి మహేష్ ఆగమనాన్ని ఘనంగా చాటేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. సూపర్‌స్టార్ రజనీకాంత్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరవుతాడని సమాచారం. తమిళ చిత్ర పరిశ్రమ నుంచి మరికొందరు అతిరథ మహారథులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారట. అదే రోజు 'స్పైడర్' థియేట్రికల్ ట్రైలర్‌ను కూడా లాంచ్ చేయబోతున్నారు. తెలుగు ట్రైలర్‌ను మామూలుగా ఆన్‌లైన్‌లో రిలీజ్ చేసేసి... తమిళ ట్రైలర్‌ను మాత్రం ఆ వేడుకలో ఘనంగా లాంచ్ చేయబోతున్నట్లు సమాచారం. ఈ సినిమా కోసం చాలామంది తమిళ నటీనటులు, సాంకేతిక నిపుణులు పనిచేస్తున్నారు. మొత్తానికి తన తొలి తమిళ సినిమా కోసం మహేష్ చూపిస్తున్న శ్రద్ధ అతనికి అక్కడ ఎలాంటి ఫలితాన్నిస్తుందో చూడాలి.


మహేష్‌బాబు

యూత్‌ఫుల్ లవ్ స్టోరీ

చూడాలని ఉంది, ఇంద్ర, యువరాజుతో పాటు దాదాపు 50 సినిమాల్లో బాలనటుడిగా తెరపై కనువిందుచేసిన ఘనత మాస్టర్ తేజ సొంతం. మాస్టర్ తేజ ఇప్పుడు తేజగా మారి హీరోగా పరిచయమవుతున్నాడు. ఈ లాంచింగ్ చిత్రాన్ని బెక్కం వేణుగోపాల్ (గోపి) నిర్మిస్తున్నారు. ప్రముఖ నిర్మాత శ్యాంప్రసాద్ రెడ్డి సంస్థలో దర్శకత్వ విభాగంలో దాదాపు ఎనిమిదేళ్లు పనిచేసిన హరి ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు.

ఈ సందర్భంగా నిర్మాత గోపి మాట్లాడుతూ ''ఈ సినిమాకు కథ అద్భుతంగా కుదిరింది. విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో జరిగే యూత్‌ఫుల్ లవ్‌స్టోరీ ఇది. కుటుంబ సమేతంగా చూసేలా ఈ సినిమా ఉంటుంది. సెప్టెంబర్ 15 నుంచి రెగ్యులర్ షూటింగ్ ఉంటుంది. ఉయ్యాల జంపాల, స్వామిరారా చిత్రాలకు స్వరాలు సమకూర్చిన సంగీత దర్శకుడు సన్నీ ఎం.ఆర్. మా సినిమాకు బాణీలు అందిస్తున్నారు. పూర్తి వివరాలను త్వరలోనే తెలియజేస్తాం''అని అన్నారు.


బెక్కం వేణుగోపాల్

వెబ్ సిరీస్‌లో రానా

నేను హీరోను కాను నటుడిని అని కథానాయకుడు రానా గతంలో చాలా సార్లు చెప్పాడు. ఇప్పుడు అదే మాటను పలుసార్లు చెబుతూ కొత్త కొత్త కథలతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాడు. ఇటీవల తేజ దర్శకత్వంలో వచ్చిన 'నేనే రాజు నేనే మంత్రి' సినిమాలో జోగేంద్ర పాత్రలో నటించి మెప్పించాడు రానా. ప్రస్తుతం 'సోషల్' అనే ఫిక్షన్ డ్రామా వెబ్ సిరీస్‌లో అతను నటించబోతున్నాడు. ఈ వెబ్ సిరీస్ ఒక అమ్మాయి కిడ్నాప్ కేసు చుట్టూ ఉండబోతోందని తెలిసింది. జోరు, అసుర చిత్రాల్లో కథానాయికగా చేసిన ప్రియాబెనర్జీ ఈ వెబ్ సిరీస్‌లో హీరోయిన్‌గా నటించనుంది. ఇందులో తనకు మంచి పాత్రలో నటించే అవకాశం వచ్చిందని అంటున్న ప్రియ... కమర్షియల్ విలువలు ఉంటూనే నటించడానికి చక్కని అవకాశమున్న వెబ్ సిరీస్ ఇదని చెప్పింది. ఇందులో నటి కావాలనుకునే అమ్మాయి పాత్రలో నటిస్తోందట. ఇంటర్నెట్, సోషల్ మీడియా యుగంలో చిన్న అవకతవకలు జరగటం మూలంగా ఒక అమ్మాయి జీవితం ఎలాంటి మలుపులు తిరగబోతోందనేదే ఈ వెబ్ సిరీస్ కథ అని తెలిసింది. ప్రియాబెనర్జీ ఇప్పుడు శశి డైరెక్ట్ చేస్తున్న ఈ వెబ్ సిరీస్‌తో పాటు మరికొన్ని హిందీ వెబ్ సిరీస్‌లలో కూడా నటిస్తోంది. రానా చేస్తున్న ఈ వెబ్ సిరీస్‌ను తెలుగు, హిందీ భాషలలో యూట్యూబ్‌లో విడుదల చేస్తారట.



హీరోల స్థాయిలో ఆదరణ లేదు

చిత్ర పరిశ్రమలో ప్రతి నటుడు, నటికి వారి వారి స్థాయిని బట్టి రెమ్యునరేషన్ ఇస్తుంటారు. ముఖ్యంగా హీరోలు అయితే ఏ స్థాయిలో పారితోషికాన్ని పొందుతారో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. నేటి రోజుల్లో చాలా సినిమాలకు హీరోలే ప్లస్ పాయింట్ అవుతుండడంతో వారి మార్కెట్‌కు అనుగుణంగా అవసరమైన బడ్జెట్‌తో సినిమాను తెరకెక్కిస్తున్నారు ఫిల్మ్‌మేకర్స్. అయితే హీరోయిన్‌లతో పోల్చుకుంటే హీరోలకు అధిక ప్రాధాన్యత కల్పిస్తూ వారికి భారీగా రెమ్యునరేషన్‌ను అందజేస్తున్నారని హీరోయిన్ రాధికాఆప్టే వాపోయింది. నేటి రోజుల్లో హీరోలను చూస్తున్నట్లు హీరోయిన్‌లను చూడటం లేదని... కథానాయికలు ఎంతగా కష్టపడుతున్నా వారికి హీరోల స్థాయిలో ఆదరణ దక్కడం లేదని ఆమె చెప్పింది. తాను నటించిన చాలా సినిమాల్లో హీరోతో సమానంగా కష్టపడినా హీరోకు ఇచ్చిన స్థాయిలో తనకు రెమ్యునరేషన్ ఇవ్వలేదంటూ ఆవేదన వ్యక్తంచేసింది. ఇదే తరహాలో తనతో సన్నిహితంగా ఉండే మరో ముగ్గురు టాప్ హీరోయిన్‌ల పరిస్థితి కూడా ఇలాగే ఉందని చెప్పింది. సల్మాన్‌వంటి సూపర్‌స్టార్స్‌తో నటిస్తున్న దీపికా పదుకునే, ప్రియాంక చోప్రా వంటి స్టార్ హీరోయిన్‌లకు రెమ్యునరేషన్ విషయంలో తగిన న్యాయం జరగడం లేదని వాపోయింది. చివరికి ప్రేక్షకులు కూడా హీరోలతో పోల్చుకుంటే హీరోయిన్లకు తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదని చెప్పింది. అయితే నేడు కొందరు హీరోయిన్‌లు లేడీ ఓరియెంటెడ్ మూవీస్ చేస్తూ సక్సెస్‌ను సాధిస్తుండడంతో ఇప్పుడు కొంత మార్పు కనిపిస్తోంది. లేడీ ఓరియెంటెడ్ సినిమాలు చేస్తున్న హీరోయిన్‌లకు సూపర్‌స్టార్ మర్యాదలు ఇస్తూ వారికి భారీగా పారితోషికాన్ని కూడా అందజేస్తున్నారు ఫిల్మ్‌మేకర్స్.


రాధికాఆప్టే


అక్షయ్ కుమార్

తొమ్మిదవ 100 కోట్ల సినిమా

మొత్తానికి బాలీవుడ్ 'బాహుబలిః ది కంక్లూజన్' సందడి నుంచి బయటపడ్డట్లే ఉంది. ఆ సినిమా వచ్చినప్పటి నుంచి మరే హిందీ సినిమా కూడా ఆడింది లేదు. సల్మాన్‌ఖాన్ చిత్రం 'ట్యూబ్‌లైట్'... షారుఖ్‌ఖాన్ సినిమా 'జబ్ హ్యారీ మెట్ సెజల్' కూడా దారుణమైన ఫలితాలు చవిచూడగా... మిగతా సినిమాలు కూడా అంతంత మాత్రంగానే ఆడాయి. అయితే ఎట్టకేలకు బాలీవుడ్ బాక్సాఫీస్‌ను ఓ హిందీ సినిమా కళకళలాడిస్తోంది. అదే 'టాయిలెట్ః ఏక్ ప్రేమ కథ'. తొలి వీకెండ్‌లో దుమ్ము దులిపిన ఈ సినిమా సెకండ్ వీకెండ్‌లోనూ జోరు చూపించింది. శుక్ర, శని, ఆదివారాల్లో కలిపి ఇండియాలో రూ.19 కోట్ల గ్రాస్ వసూలు చేసింది ఈ చిత్రం. రెండో వీకెండ్‌లో ఈ సినిమాకు ఈ స్థాయి వసూళ్లు రావడం విశేషమే. అందులోనూ ఇది ఏ ఖాన్ స్టార్ నటించిన సినిమా కాదు. అక్షయ్ కుమార్ హీరోగా నటించిన ఈ చిత్రం అతని కెరీర్‌లోనే అత్యంత వేగంగా ఇండియాలో రూ.100 కోట్ల గ్రాస్ మార్కును అందుకున్న సినిమాగా నిలిచి రికార్డు సృష్టించింది. ఇప్పటికే ఈ చిత్రం దేశవ్యాప్తంగా రూ.115 కోట్ల గ్రాస్ కలెక్ట్ చేసింది. వరల్డ్‌వైడ్ వసూళ్లు రూ.140 కోట్ల దాకా ఉన్నాయి. ఫుల్ రన్‌లో ఈ చిత్రం రూ.200 కోట్ల గ్రాస్ వసూలు చేసి అక్షయ్ కెరీర్‌లో బిగ్గెస్ట్ హిట్‌గా నిలుస్తుందని అంచనా వేస్తున్నారు. మరో విశేషమేమిటంటే అక్షయ్‌కు ఇది తొమ్మిదవ 100 కోట్ల సినిమా. సల్మాన్ ఖాన్ 11 వంద కోట్ల సినిమాలతో అగ్రస్థానంలో ఉన్నాడు. అమీర్ ఖాన్, షారుఖ్‌ఖాన్ వంటి సూపర్‌స్టార్లు కూడా అక్షయ్ వెనుకే ఉండటం విశేషం.

మరోసారి రెమ్యునరేషన్ పెంచుతుందట

ఇటు టాలీవుడ్, అటు కోలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా రాణిస్తున్న భామ కాజల్ అగర్వాల్. తెలుగు, తమిళ్‌లో టాప్ హీరోలతో హిట్ సినిమాలు చేస్తూ ప్రేక్షకులను అలరిస్తోంది ఈ బ్యూటీ. ఈ భామ ఈమధ్యన ఇప్పటికే ఓసారి తన రెమ్యునరేషన్‌ను పెంచింది. ప్రస్తుతం తమిళనాట సినిమాకు ఒక కోటి యాభై లక్షల రూపాయలను రెమ్యునరేషన్‌గా తీసుకుం టోంది. ఇప్పుడు ఈ పారితోషికాన్ని మరోసారి పెంచే ఆలోచనలో ఉందట. ప్రస్తుతం ఆమె చేసిన రెండు తమిళ్ సినిమాలు విడుదలైన తర్వాత తన పారి తోషికాన్ని సవరించడానికి సిద్ధమవుతోంది కాజల్. కోలీవుడ్‌లో స్టార్ హీరో అజిత్ సరసన 'వివేగమ్' సినిమా చేసింది కాజల్. ఈ చిత్రం తెలుగులో 'వివేకం' పేరుతో వస్తోంది. ఈనెల 24న ఈ సినిమా విడుదలకానుంది. తమిళ్‌లో మరో స్టార్ హీరో విజయ్ సరసన 'మెర్సెల్' సినిమాలో నటిస్తోంది ఈ భామ. ఈ సినిమా అక్టోబర్‌లో విడుదలకానుంది. ఈ రెండు సినిమాల ఫలితాలను చూసిన తర్వాత మ రోసారి తన పారితోషికాన్ని పెంచాలని భావిస్తోందట కాజల్ అగర్వాల్. అయితే కాజల్ తన పారితోషికాన్ని కోలీవుడ్‌లో మాత్రమే పెంచుతుందట. తెలుగులో ఆమె కాస్త తక్కువ రెమ్యునరేషన్‌కే సినిమాలు చేస్తోంది. తాజాగా కళ్యాణ్‌రామ్‌తో చేస్తున్న సినిమాకు కోటి కంటే తక్కువ మొత్తానికే ఆమె డేట్స్ ఇచ్చింది. ఇంకా చెప్పాలంటే 'సర్దార్ గబ్బర్‌సింగ్' తర్వాత మళ్లీ ఆ స్థాయిలో రెమ్యునరేషన్ తీసుకున్న తెలుగు సినిమా లేదు.


కాజల్ అగర్వాల్



169 మెక్‌డొనాల్డ్స్ ఔట్‌లెట్ల మూసివేత!

న్యూఢిల్లీ: ప్రముఖ బర్గర్, ఫాస్ట్ ఫుడ్ చైన్ మెక్‌డొనాల్డ్స్ దేశంలో మొత్తం 169 రెస్టారెంట్లు మూసివేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. అమెరికాకు చెందిన మెక్‌డొనాల్డ్స్.. విక్రమ్ బక్షికి చెందిన కన్నాట్ ప్లాజాతో ఉన్న ఫ్రాంఛైజీ ఒప్పందాలను రద్దు చేసుకున్నట్టు సంస్థ ప్రకటించింది. దీంతో బ్రాండ్‌పేరును వినియోగించడాన్ని 15 రోజుల్లో నిలిపివేయాల్సి ఉంది. అందువల్ల రెస్టారెంట్లను మూసివేయాల్సి వస్తోంది. దేశంలోని తూర్పు, ఉత్తర ప్రాంతాల్లో కన్నాట్ ప్లాజా రెస్టారెంట్ ప్రైవేట్ లిమిటెడ్ (సిపిఆర్‌ఎల్) మెక్‌డొనాల్డ్స్ ఫ్రాంఛైజీలను నిర్వహిస్తోంది. జూన్ 29న ఢిల్లీలో కన్నాట్ ప్లాజాకు చెందిన 40 రెస్టారెంట్ల అనుమతుల గడువు దాటిపోవడంతో వాటిలో కార్యకలాపాలను రద్దు చేసింది. ఈ నిర్ణయంపై మెక్‌డొనాల్డ్స్ ఇండియా స్పందిస్తూ సిపిఆర్‌ఎల్ ఒప్పంద నియమాలను ఉల్లంఘించిందని ఆరోపించింది. దీంతోపాటు కొన్ని రెస్టారెంట్లలో ఉల్లంఘనలను అరికట్టడంలో కూడా సిపిఆర్‌ఎల్ విఫలమైందని పేర్కొంది. అయినా తప్పులు సరిదిద్దుకోనేందుకు అవకాశం కూడా ఇచ్చామని తెలిపింది. ప్రస్తుత నిర్ణయంతో ఇప్పుడు మెక్‌డొనాల్డ్స్ కొత్త భాగస్వామిని వెతుక్కునే పనిలో ఉంది. ఈ నిర్ణయం ప్రభావం ఉద్యోగులపై తక్కువగా ఉండేట్లు చూస్తున్నామని మెక్‌డొనాల్డ్స్ ఇండియా తెలిపింది.

ఆదుకోని షేర్ల బైబ్యాక్

- రెండు రోజుల్లో ఇన్ఫీకి రూ. 34వేల కోట్ల నష్టం
- సిక్కా రాజీనామాతో కంపెనీ షేరు కుదేలు



ముంబయి: ఐటి దిగ్గజం ఇన్ఫోసిస్ షేరు రోజు రోజుకీ క్షీణిస్తోంది. సిఇఒ, ఎండిగా విశాల్ సిక్కా రాజీనామా చేసిన తర్వాత గత రెండు ట్రేడింగ్ సెషన్‌లలో కంపెనీ దాదాపు రూ.34 వేల కోట్ల మార్కెట్ విలువ(ఎం–క్యాప్)ను కోల్పోయింది. సోమవారం మార్కెట్ ముగిసే సమయానికి ఇన్ఫీ మార్కెట్ విలువ రూ.2,00,640 కోట్లకు పడిపోయింది. అంతకుముందు ఎం–క్యాప్ రూ.234,555 కోట్లుగా ఉంది. అంటే గత రెండు రోజుల ట్రేడింగ్‌లో రూ.33,915 కోట్ల మార్కెట్ విలువ తుడిచిపెట్టుకుపోయింది. 2016 జులై 6న ఇన్ఫీ మార్కెట్ విలువ రూ.2,91,046 కోట్లతో అత్యంత గరిష్ఠ స్థాయిలో ఉంది. అప్పటి నుంచి ఇప్పటి వరకు పరిశీలిస్తే దాదాపు రూ.90,406 కోట్ల విలువ ఆవిరైంది. స్టాక్‌మార్కెట్‌లో ఇన్ఫోసిస్ షేరు కూడా గత రెండు రోజుల్లో 14 శాతం పడిపోయి రూ.874 వద్ద ముగిసింది. అంటే 2014 ఆగస్టు 8నాటి కనిష్ఠ స్థాయికి షేరు విలువ పడిపోయింది. ఐటి దిగ్గజం బైబ్యాక్‌ను ప్రకటించినప్పటికీ మార్కెట్‌ను నిరాశపర్చింది. శనివారంనాడు కంపెనీ రూ.13 వేల కోట్ల విలువ చేసే షేర్ల బైబ్యాక్(షేరుకు రూ.1,150 రేటు)ను ప్రకటించింది. 'సిఇఒ పదవికి సిక్కా రాజీనామాతో కంపెనీ రిస్క్‌లో పడింది. కొత్త నాయకత్వం కంపెనీ సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుంది. సిక్కా కంపెనీని సరైన మార్గంలో నడిపించారని, వినూత్న ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టారు' అని ఆంటిక్యూ స్టాక్ బ్రోకింగ్ విశ్లేషకుడు పేర్కొన్నారు. సిక్కా అనూహ్య పరిణామాల మధ్య రాజీనామా, వ్యవస్థాపకుల నుంచి ఒత్తిడితో షేరు అత్యంత కనిష్ఠానికి పడిపోతోంది.

మార్కెట్‌పై ఇన్ఫీ సంక్షోభం ప్రభావం

ఇన్ఫోసిస్ సంక్షోభం స్టాక్‌మార్కెట్‌ను ప్రభావితం చేస్తోంది. సిక్కా రాజీనామా చేసిన రోజైన శుక్రవారంనాడు షేరు భారీగా పతనమైంది. ఆ తర్వాత బైబ్యాక్ ప్రకటనతో మళ్లీ కోలుకుంటుందని భావించారు. అయితే అమెరికాలోనూ న్యాయపరమైన చిక్కులు ఎదుర్కొనుందని వార్తలు రావడంతో షేరు పతనం కొనసాగింది. దీంతో భారత్‌లోని అత్యంత విలువైన 10 కంపెనీల జాబితాలో ఇన్ఫోసిస్ స్థానాన్ని కోల్పోయింది. రెండువారాల కనిష్ఠ స్థాయిలో మార్కెట్ ముగిసింది. నిఫ్టీ 83 పాయింట్లు నష్టపోయి 9,754 వద్ద ముగిసింది. ఇక సెన్సెక్స్ 265 పాయింట్లు పతనమై 31,253 వద్ద స్థిరపడింది. యాక్సిస్ బ్యాంక్, టిసిఎస్, ఐషర్ మోటార్స్, టెక్ మహీంద్రా, ఎంఅండ్‌ఎం షేర్లు లాభాలను నమోదు చేశాయి. మరోవైపు ఇన్ఫోసిస్, భారతీ ఇన్ఫ్రాటెల్, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఒఎన్‌జిసి, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్ షేర్లు నష్టాల దిశగా పయనించాయి. ఎన్‌ఎస్‌ఇలో ఇన్ఫోసిస్ అత్యంత చురుకైన, అత్యధికంగా పతనమైన షేరుగా నిలిచింది. దీనికి తోడు ఉత్తరకొరియా అమెరికా మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు కూడా మార్కెట్‌పై ప్రభావం చూపాయి. ముఖ్యంగా మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ షేర్లు అత్యధికంగా నష్టపోయాయి. కొద్ది రోజుల వరకూ ఇలాంటి పరిస్థితే ఉండొచ్చని నిపుణులు భావిస్తున్నారు.

ఎస్సార్ ఆయిల్-రోస్‌నెఫ్ట్ ఒప్పందం పూర్తి



ముంబయి: అప్పుల్లో కూరుకుపోయిన ఎస్సార్ గ్రూప్ సంస్థకు చెందిన ఎస్సార్ ఆయిల్‌ను విక్రయం ప్రక్రియను పూర్తి చేసింది. దేశంలోకి ఒకేసారి ఎన్నడూ లేనంత భారీ ఒప్పందం ఇది. ఎస్సార్ గ్రూప్‌నకు చెందిన గుజరాత్‌లోని చమురుశుద్ధి కర్మాగారాన్ని రష్యాకు చెందిన రోస్‌నెఫ్ట్ సంస్థకు రూ.86 వేల కోట్ల(12.9 బిలియన్ డాలర్ల)కు విక్రయించే ప్రక్రియ ముగిసింది. గుజరాత్ వాడినర్‌లో ఎస్సార్ గ్రూపునకు చెందిన 20 మిలియన్ టన్నుల సామర్థ్యం ఉన్న చమురుశుద్ధి కర్మాగారంతో పాటు దేశవ్యాప్తంగా ఉన్న మూడున్నరవేల పెట్రోల్ బంకులను రోస్‌నెఫ్ట్‌కు విక్రయించడం ఈ ఒప్పందంలో భాగంగా ఉంది. దీనికి గాను గత సంవత్సరం అక్టోబర్‌లో గోవాలో జరిగిన బ్రిక్స్ సదస్సులో ప్రధాని నరేంద్రమోడీ, రష్యా అధ్యక్షుడు పుతిన్ సమక్షంలో ఒప్పందం చేసుకున్నారు. అయితే ఎస్సార్ గ్రూపునకు రూ.45 వేలకోట్ల రుణం ఇచ్చిన ఎస్‌బిఐ, ఐసిఐసిఐ, ఎల్‌ఐసితోపాటు 23 సంస్థలు ఈ ఒప్పందానికి తొలుత అడ్డుచెప్పడంతో 10 నెలలు ఆలస్యమైంది. అయితే రుణం చెల్లింపుపై ఎస్సార్ గ్రూపు ఇచ్చిన హామీపై అప్పులు ఇచ్చిన వారంతా గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో ఈ కీలక ఒప్పందం పూర్తయింది.

7,344 కోట్ల విదేశీ పెట్టుబడులు వెనక్కి

విదేశీ పెట్టుబడులు వెనక్కి వెళ్లిపోతున్నాయి. అంతర్జాతీయ అనిశ్చితులు విదేశీ మదుపర్లపై ప్రభావం చూపడం, అమెరికాఉత్తర కొరియా, భారత్‌చైనాల మధ్య ఉద్రిక్తతలు ఇందుకు కారణమయ్యాయి. ఈ ఆందోళనలతో విదేశీ ఇన్వెస్టర్ల స్టాక్ మార్కెట్ల నుంచి తమ పెట్టుబడులను ఉపసంహరించుకుంటున్నారు. ఈ నెలలో 1–18 తేదీల మధ్య ఈక్విటీ మార్కెట్లలో సుమారు రూ.7,344 కోట్ల విలువైన షేర్లను విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపర్లు (ఎఫ్‌పిఐలు) విక్రయించారు. డొల్ల కంపెనీలపై మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ కఠిన చర్యలు కూడా విదేశీ మదుపర్లపై ప్రభావం చూపుతున్నట్లు నిపుణులు పేర్కొంటున్నారు. అదే సమయంలో డెట్ సాధనాలలో దాదాపు రూ.9,364 కోట్లు మదుపు చేశారు. పెట్టుబడులకు సురక్షితమైన సాధనాలను వెతుక్కుంటున్నారనే దానికి దీనిని సంకేతంగా భావించొచ్చని విశ్లేషకులు చెబుతున్నారు. ఈ ఏడాదిలో ఇప్పటికీ ఈక్విటీ మార్కెట్లలోకి నికరంగా రూ. 53,610 కోట్ల పెట్టుబడులు వచ్చాయి.



2018 నాటికి 2.5 లక్షల మంది యువతకు నైపుణ్య శిక్షణ

మన తెలంగాణ / హైదరాబాద్ : రాష్ట్రంలో ఆర్థికంగా వెనుక బడిన రెండున్నర లక్షల మంది నిరుద్యోగ యువతకు 2018 మార్చి నాటికి ఐసిఐసిఐ అకాడమి ఫర్ స్కిల్స్ ద్వారా వృత్తి విద్యా, నైపుణ్య శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఐసిఐసిఐ ఫౌండేషన్ ప్రతినిధి అబమ్ శర్మ తెలిపారు. బ్యాంక్ ఎండి అండ్ సీఈవో చందా కొచ్చార్ ఆశయాలకు మేరకు యువతలో నైపుణ్య వృద్ధికి తోడ్పాటు నందిస్తున్నామన్నారు. శిక్షణలో ముఖ్యంగా అమ్మకపు నైపుణ్యం, రిటైల్ సేల్స్, ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్‌లో యువతకు సంపూర్ణ శిక్షణ ఇస్తున్నామన్నారు. తమ వద్ద శిక్షణ పొందిన యువతకు వంద శాతం ప్లేస్ మెంట్ కోసం పేదరిక నిర్మూలన కార్యక్రమాలను అమలు చేస్తున్న మేప్మాతో ఎంవోయూ కుదుర్చుకున్నామన్నారు. ఐసిఐసిఐ ఫౌండేషన్ హైదరాబాద్ కేంద్రం ద్వారా ఇప్పటికే 7300 మందికి శిక్షణ పొందారని, వారిలో 50 శాతం మంది మహిళలే ఉన్నారన్నారు. నిరుద్యోగులు స్థిరమైన జీవనోపాధి పొందేలా ఉచిత శిక్షణ ఇస్తున్నామని తెలిపిన అబమ్ శర్మ 2013 నుండి ఇప్పటి వరకు ప్రతి సంవత్సరం 50 బ్యాచ్‌లు చొప్పున శిక్షణను పొందినట్లు మీడియాకు వెల్లడించారు.

మార్కెట్లోకి యమహా ఫేజర్-25

ముంబయి: యమహా ఇండియా దేశీయ మార్కెట్లోకి కొత్త ద్విచక్ర వాహనాన్ని లాంఛ్ చేసింది. ఫేజర్25 అనే పేరుతో విడుదల చేసిన ఈ బైక్ ధర రూ.1,28,335 (ముంబయి ఎక్స్‌షోరూం)గా నిర్ణయించింది. ఎఫ్‌జెడ్ 25కి దగ్గరి పోలికలతోనే ఉన్నప్పటికీ కొంత మెరుగు పర్చి కొత్త లుక్‌లో దీన్ని మార్కెట్లోకి తీసుకొచ్చారు. 'ఫేజర్ 25' స్పోర్ట్ లుక్స్‌తో ఉంటుంది. 20, 30 ఏళ్ల రైడర్లను లక్ష్యంగా చేసుకుని ఈ మోటార్‌సైకిల్‌ను తీసుకొచ్చామని కంపెనీ ప్రకటించింది. బిఎస్–4 నిబంధనలకు అనుగుణంగా తీసుకొచ్చిన ఈ బైక్ రెండు రంగుల్లో లభ్యం కానుంది. అల్లాయ్ వీల్స్, 249 సిసి సింగిల్ సిలిండర్ ఫీచర్లుగా ఉన్నాయి.



స్టాక్ మార్కెట్

ఈరోజు మార్కెట్	ముగింపు	మార్పు	%
సెన్సెక్స్	31258.85	-265.83	- 0.84%
నిఫ్టీ	9754.35	- 83.05	- 0.84%

కరెన్సీ మారక రేట్లు

అమెరికన్ డాలర్	64.4700
యూరో	70.4270
బ్రిటిష్ పౌండ్	83.4957
ఆస్ట్రేలియన్ డాలర్	47.4050
కెనెడియన్ డాలర్	47.0500
ఎమిరైట్ దిర్హామ్	17.5040
స్విస్ ఫ్రాంక్	64.5500
చైనీస్ యువాన్	9.3344
మలేషియన్ రింగిట్	14.8460
న్యూజిలాండ్ డాలర్	44.4990
హాంగ్‌కాంగ్ డాలర్	8.2824
జపనీస్ యెన్	0.5688
కువైట్ దినార్	212.0888
సౌతాఫ్రికన్ రాండ్	4.7209

బులియన్





బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22క్యారట్	24క్యారట్	మార్పు(%)
చెన్నై	27580	29497.33	-0.04%
ముంబై	28550	30534.76	0%
ఢిల్లీ	27900	29839.57	- 0.71%
కోల్‌కతా	28480	30459.89	0.18%
కేరళ	27100	28983.96	0%
బెంగళూరు	27300	29197.86	0%
హైదరాబాద్	27530	29443.85	- 0.22%
గల్ఫ్	1367.44	1462.50	0.15%

వెండి ధర (రూ./ కిలో)

నగరం	సోమవారం	ఆదివారం	మార్పు (%)
చెన్నై	42600.00	42300.00	0.71
ముంబై	42600.00	42300.00	0.71
ఢిల్లీ	42600.00	42300.00	0.71
కోల్‌కత్తా	42600.00	42300.00	0.71
హైదరాబాద్	42600.00	42300.00	0.71



కోడిగుడ్లు (100కు) నెక్ రేటు

హైదరాబాద్	355	విశాఖపట్నం	362
వరంగల్	357	చిత్తూరు	390
విజయవాడ	359	చెన్నై	397
గోదావరి	359	బెంగళూరు	382



జిఎస్‌టి కింద రూ. 42వేల కోట్లు

- ఇప్పటి వరకూ ప్రభుత్వానికి వచ్చిన పన్ను

న్యూఢిల్లీ : జిఎస్‌టి(వస్తు, సేవల పన్ను) కింద మొదటి నెల ఫైలింగ్‌లో ప్రభుత్వానికి ఇప్పటివరకు రూ.42 వేల కోట్లు పన్ను వచ్చింది. ఈ వారం ముగింపు నాటికి ఈ రెవెన్యూ మరింతగా పెరిగే అవకాశముంది. ఇంటిగ్రేటెడ్ జిఎస్‌టి కింద రూ.15 వేల కోట్లు, మరో రూ.5 వేల కోట్లు కార్లు, పొగాకు వంటి వస్తువుల ద్వారా వచ్చాయి. మిగతా రూ.22 వేల కోట్ల కేంద్ర జిఎస్‌టి, రాష్ట్రాల జిఎస్‌టి కింద వచ్చాయి. వీటిని కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమానంగా విభజిస్తారు. ఇప్పటివరకు పన్ను డిపాజిట్లు రూ.42 వేల కోట్ల వరకు వచ్చాయని అధికారులు వెల్లడించారు. ఇప్పటివరకు 10 లక్షల మంది పన్ను చెల్లింపుదారులు రిటర్న్‌లను దాఖలు చేయగా, మరో 20 లక్షల మంది లాగ్ అయ్యి, రిటర్న్ ఫామ్‌లను సేవ్ చేశారు. జులై 1 నుంచి అమలు చేసిన జిఎస్‌టి కింద వ్యాపారాలు నెలవారీగా పన్ను రిటర్న్‌లను దాఖలు చేయాలి. మొదటి నెల పన్ను దాఖలుకు గడువును ఆగస్టు 25 వరకు ప్రభుత్వం పొడిగించింది. జిఎస్‌టి ఫైలింగ్‌లో దేశవ్యాప్తంగా వ్యాపారులు సమస్యలు ఎదుర్కొంటున్న నేపథ్యంలో గడువును ప్రభుత్వం ఐదు రోజులు పెంచింది. ఆఖరి తేదీ ఆగస్టు 20 కాగా ఈ గడువును పెంచుతున్నట్టు ప్రకటించింది. రిటర్నులకు చివరి తేది ముగస్తుండంతో, జిఎస్‌టి ఫైలింగ్ వెబ్‌సైట్ కొంత సమయం పనిచేయడం ఆగిపోయింది. దీంతో గడువును పొడిగించారు.

బిఎస్‌ఎన్‌ఎల్ మెగా మేళా

మన తెలంగాణ / హైదరాబాద్ : ఉచిత 3 జి స్మార్ట్ సిమ్ కార్డులను వినియోగదారులకు అందించేందుకు బిఎస్‌ఎన్‌ఎల్ తెలంగాణ, ఏపి సర్కిల్‌లో ఈ నెల 24 వరకు మెగా మేళాను నిర్వహిస్తోంది. ఈ మేళాలో వినియోగదారులు కొత్త కనెక్షన్‌తో 350 ఎంబి ఉచిత డాటా పొందవచ్చని బిఎస్‌ఎన్‌ఎల్ తెలంగాణ టెలికం సర్కిల్ సిజిఎం అనంతరాము ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ల్యాండ్ లైన్, బ్రాడ్ బాండ్, ఎఫ్‌టిటిహెచ్ కనెక్షన్లను కస్టమర్ సర్వీస్ సెంటర్, రిటైల్ ఔట్‌లెట్లలో నిర్వహించే మేళాల్లో పొందవచ్చన్నారు. మరిన్ని వివరాలకు టోల్ ఫ్రీ నెం 1503కి గాని, లేదా 18001801503లో గానీ సంప్రదించవచ్చని అనంతరామ్ తెలిపారు.

వీడియోకాన్ నుంచి 'మెటల్ ప్రో 2' ఫోన్

న్యూఢిల్లీ: వీడియోకాన్ మొబైల్స్ సోమవారం సరికొత్త మొబైల్‌ను విడుదల చేసింది. 4జి విఒఎల్‌టిఇ సదుపాయం కలిగిన ఈ స్మార్ట్‌ఫోన్ ధర రూ.6,999గా కంపెనీ నిర్ణయించింది. వీడియోకాన్ మెటల్ ప్రో 2 పేరిట తీసుకొస్తున్న ఈ ఫోన్ ఈ నెలాఖరు నుంచి దేశవ్యాప్తంగా రిటైల్ స్టోర్లలో లభ్యం కానుంది. గ్రే, గోల్ కలర్స్‌లో లభించే ఈ స్మార్ట్‌ఫోన్‌పై 100 రోజుల రీప్లేస్‌మెంట్ పాలసీ వర్తిస్తుందని కంపెనీ పేర్కొంది. 13 ఎంపి సెల్ఫీ కెమెరా, ఎల్‌ఇడితో 3.2 ఎంపి రేర్ కెమెరాను అందిస్తోంది.


స్మార్ట్రాన్ నుంచి ట్రాన్‌ఎక్స్‌టిఎం

ముంబయి: టెక్నాలజీ, ఇంటర్నెట్ కంపెనీ స్మార్ట్రాన్ ట్రాన్స్‌ఎక్స్‌టిఎంను ఆవిష్కరించింది. ఇది వినియోగదారుల రోజువారీ జీవనం సులభతరం చేసేందుకు దోహదం చేస్తుంది. అలారం క్లాక్ వంటి అంశాలు ఉపయోగపడతాయని, ప్రపంచంలోనే తొలిసారిగా ట్రాన్‌ఎక్స్ లైఫ్ టిఎంను అందిస్తున్నామని కంపెనీ వెల్లడించింది. డివైజ్‌లను కనెక్ట్ చేయడంలో ట్రాన్‌ఎక్స్ ఉపయోగపడుతుందని కంపెనీ వెల్లడించింది.

మెర్సిడెస్ నుంచి జిటిఆర్, జిటి రోడ్‌స్టర్ స్పోర్ట్స్‌కారు

న్యూఢిల్లీ : లగ్జరీ కార్ల తయారీ సంస్థ మెర్సిడెస్ బెంజ్ సోమవారంనాడు ఎఎంజి జిటి రోడ్‌స్టర్, ఎఎంజి జిటిఆర్ స్పోర్ట్స్ కార్లను మార్కెట్లోకి విడుదల చేసింది. ఈ కార్ల ప్రారంభ ధరలు వరుసగా రూ.2.19 కోట్లు, రూ.రూ.2.23 కోట్లుగా కంపెనీ నిర్ణయించింది. ఈ రెండు ప్రొడక్ట్‌లతో మెర్సిడెస్ బెంజ్ తన ఎఎంజి సంఖ్యను భారత్‌లో 12 మోడల్స్‌కు పెంచింది. ఎఎంజి జిటి3 రేసింగ్ కారును స్ఫూర్తిగా తీసుకుని ఎఎంజి జిటిఆర్‌ను మెర్సిడెస్ బెంజ్ ప్రవేశపెట్టింది. మెర్సిడెస్ ఎఎంజి జిటి ఆర్ ఇప్పటికే ప్రపంచంలో అత్యంత వేగవంతమైన రియర్‌వీల్‌డ్రైవ్ కారుగా రికార్డుగా పేరులో ఉంది. దీని గరిష్ట స్పీడు గంటకు 317 కిలోమీటర్లు కాగా కేవలం 3.6 సెకన్లలో గంటకు 100 కిలోమీటర్ల వరకు వేగం అందుకుంటుంది. కొత్త ఏఎంజీ జీటీ ఆర్ యూనిక్‌గా గుర్తించేటట్టు గ్రీన్ రంగుల్లో మార్కెట్‌లోకి వచ్చింది.

ఎస్‌బిఐ రుణాలపై 100% ప్రాసెసింగ్ ఫీజు తగ్గింపు



ముంబయి: పండుగ సీజన్ సందర్భంగా ప్రభుత్వరంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బిఐ వినియోగదారులకు శుభవార్త వినిపించింది. కారు రుణాలు, వ్యక్తిగత బంగారం రుణాలు, వ్యక్తిగత రుణాలపై 100 శాతం ప్రాసెసింగ్ ఫీజును తగ్గించింది. ఎస్‌బిఐ గతంలో గృహ రుణాలపై మాత్రమే ప్రాసెసింగ్ ఫీజును మాఫీ చేసింది. అయితే తాజాగా పండుగ సందర్భంగా పూర్తిగా ప్రాసెసింగ్ ఫీజును మినహాయించింది. ఇటీవల సేవింగ్ ఖాతాల వడ్డీ రేట్లు తగ్గించిన బ్యాంకు ఇప్పుడు ఈ నిర్ణయంతో వినియోగదారులను ఆకర్షించే ప్రయత్నం చేస్తోంది. ఆఫర్ల వివరాల్లోకి వెళితే.. 2017 డిసెంబరు 31 వరకు కారు రుణంపై 100 శాతం ప్రాసెసింగ్ ఫీజు రద్దు చేసింది. 2017 అక్టోబర్ 31 వరకు వ్యక్తిగత బంగారు రుణాలపై 50 శాతం ప్రాసెసింగ్ ఫీజు రద్దు ఇచ్చింది. దీంతో పాటు 2017 సెప్టెంబరు 30 వరకు వినియోగదారులకు ఎక్స్‌ప్రెస్ క్రెడిట్‌పై (వ్యక్తిగత రుణం) ప్రాసెసింగ్ ఫీజు 50శాతం తగ్గింపును ఇస్తోంది. ఎస్‌బిఐకి దేశ వ్యాప్తంగా 23 వేలకు పైగా బ్రాంచ్‌లు, 59 వేల ఎటిఎంలు ఉన్నాయి. బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్‌పై ఎస్‌బిఐ షేరు 1.44 శాతం పడిపోయి రూ.274.65 వద్ద స్థిరపడింది.


దెనా బ్యాంక్ సేవింగ్ ఖాతాలపై వడ్డీ రేటు కోత

ప్రభుత్వరంగానికి చెందిన మరో సంస్థ దేనా బ్యాంక్ సేవింగ్ ఖాతా డిపాజిట్లపై వడ్డీరేటు కోత విధించింది. రూ.25 లక్షల లోపు నగదు ఉన్న ఖాతాలపై దేనా బ్యాంకు 0.5 శాతం వడ్డీ తగ్గించి 3.50 శాతానికి పరిమితం చేసింది. రూ. 25 లక్షల కన్నా ఎక్కువ నగదు ఉన్న ఖాతాలపై యథాతథంగా 4 శాతం వడ్డీ ఇవ్వనుంది. బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బిఐ పొదుపు ఖాతాలపై వడ్డీ కోతలను ముందుగా ప్రారంభించింది. కోటి రూపాయల కన్నా తక్కువ ఉన్న పొదుపు ఖాతాలకు 0.5 శాతం వడ్డీ తగ్గించింది. గత ఆరేళ్లలో బ్యాంకు అందిస్తున్న అతితక్కువ వడ్డీ ఇదే. ఆ తర్వాత ఎస్‌బిఐ బాటలోనే హెచ్‌డిఎఫ్‌సి, బ్యాంక్ ఆఫ్ బరోడా, పంజాబ్ నేషనల్ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, యస్ బ్యాంక్, కర్ణాటక బ్యాంకు వంటివి సేవింగ్ ఖాతాల వడ్డీరేటును తగ్గించిన విషయం తెలిసిందే

యాక్సిస్ బ్యాంక్ నెలసరి వాయిదాల తగ్గింపు

యాక్సిస్ బ్యాంక్ గృహ రుణ మార్కెట్లో ఎక్కువ మార్కెట్ వాటాను సంపాదించేందుకు సరికొత్త ఆఫర్‌ను ఇస్తోంది. గుడ్ క్రెడిట్ అవార్డ్ కోసం 'శుభ్ ఆరంభ్' పేరిట గృహ రుణ పథకాన్ని ప్రారంభించింది. ఇందులో భాగంగా కస్టమర్లకు మరో బంపర్ ఆఫర్‌ను అందిస్తోంది. రూ. 30 లక్షల రుణంపై దాదాపు మూడులక్షల దాకా తగ్గింపును ఆఫర్ చేస్తోంది. అంటే 20 ఏళ్ల కాలానికి సంబంధించిన రుణాలపై కొన్ని ఇఎంఐలను రద్దు చేస్తోంది. యాక్సిస్ బ్యాంక్ ట్విట్టర్ లో అందించిన సమాచారం ప్రకారం ఈ కొత్త రుణ చెల్లింపు వ్యవధిలో కొన్ని నెలవారీ వాయిదా చెల్లింపులకు (ఇఎంఐ) మినహాయింపు లభించేలా ఈ పథకాన్ని రూపొందించింది. 4, 8, 12వ సంవత్సరం చివరలో ఏడాదికి 4 నెలసరి వాయిదాలు చొప్పున రద్దు చేస్తుంది. ఇలా 20 ఏళ్ల వ్యవధికి రుణం తీసుకున్నవారికి మొత్తం మీద 12 ఇఎంఐల మేర ప్రయోజనం కస్టమర్లకు లభించనుంది.

డోక్లామ్ ప్రతిష్టంభనకు త్వరలోనే పరిష్కారం : రాజ్‌నాథ్



న్యూఢిల్లీ: సిక్కిం సెక్టార్‌లోని డోక్లామ్ ప్రాంతం వద్ద భారత్, చైనా సైన్యాల మధ్య రెండు నెలలుగా కొనసాగుతోన్న ప్రతిష్టంభనకు త్వరలోనే పరిష్కారం లభిస్తుందని కేంద్ర హోం శాఖ మంత్రి రాజ్‌నాథ్ సోమవారం అన్నారు. ఈ విషయంలో చైనా సానుకూలంగా స్పందిస్తుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. ఇక్కడ నిర్వహించిన ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటిబిపి) కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. 'డోక్లామ్ సంక్షోభానికి త్వరలోనే పరిష్కారం లభిస్తుంది. ఈ విషయంలో చైనా సానుకూలంగా స్పందిస్తుందని నేను ఖచ్చితంగా చెప్పగలను' అని రాజ్‌నాథ్ ఈ సందర్భంగా విశ్వాసం వ్యక్తం చేశారు. భారత్ శాంతిని కోరుకుంటోందన్న సందేశాన్ని ఇరుగుపొరుగు దేశాలకు పంపాలని తాను కోరుకుంటున్నట్లు ఆయన చెప్పారు. దేశ సరిహద్దులను, భూభాగాలను కాపాడుకునే సత్తా, సామర్థ్యం భారత సైన్యానికి ఉందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. జమ్ము-కశ్మీర్ నుండి అరుణాచల్‌ప్రదేశ్ వరకు ఉన్న సుమారు 4,057 కిలోమీటర్ల పొడవైన చైనా-భారత్ సరిహద్దును ఐటిబిపి పరిరక్షిస్తోంది. సుమారు రెండు నెలల కిందట డోక్లామ్ వద్ద చైనా దళాలు చేపట్టిన రహదారి నిర్మాణాన్ని భారత సైన్యం అడ్డుకోవడంతో ఆ ప్రాంతంలో ప్రతిష్టంభన నెలకొన్న సంగతి తెలిసిందే.

విలీనం వెనుక బిజెపి హస్తం : కారత్

కోయంబత్తూర్: ఎఐఎడిఎంకె వర్గాల విలీనాన్ని అవకాశవాదంగా అభివర్ణిస్తూ, ఈ తతంగం వెనుక బిజెపి హస్తముందని సిపిఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు ప్రకాశ్ కారత్ విమర్శించారు. బిజెపి ప్రోత్సాహంతోనే ఈ రెండు వర్గాలు విలీనమయ్యాయని, కాని తమిళనాడు ప్రజలు దీన్ని వ్యతిరేకించి తీరుతారని ఆయన చెప్పారు. పీపుల్స్ ఫోరంను ప్రారంభించడానికి ఇక్కడికి వచ్చిన ఆయన విమానాశ్రయంలో విలేకరులతో మాట్లాడారు. బిజెపిలాంటి మతశక్తులో చేతులు కలుపడం ఎఐఎడిఎంకు చాలా ప్రమాదకరంగా మారుతుందని, అవకాశవాదాన్ని వ్యతిరేకించే తమిళనాడు ప్రజలకు కూడా ఇది ప్రమాదమేనని అన్నారు.

సెంట్రల్ జైలులో శశికళ దర్జా!



బెంగళూరు: సాధారణ దుస్తుల్లో వున్న ఎఐఎడిఎంకె చీఫ్ వికె శశికళ, తన మరదలుతో కలిసి దర్జాగా సెంట్రల్ జైలులోకి నడుచుకుంటూ వస్తున్న సిసిటివి ఫుటేజీ దృశ్యాలు సంచలనం కలిగిస్తున్నాయి. ఈ ఫుటేజీలను మాజీ డిఐజి (జైళ్లు) డి.రూప ఆగస్టు 19న సిబిఐకు అందించారు. అక్రమాస్తుల కేసులో శిక్ష అనుభవిస్తున్న శశికళ ఈ జైలులో విఐపి సౌకర్యాలు పొందుతున్నారని ఆరోపిస్తూ నివేదికలు అందించిన రూపను రాష్ట్ర ప్రభుత్వం ట్రాఫిక్ విభాగానికి బదిలీ చేసిన విషయం విదితమే. అయితే, తన నివేదికకు బలం చేకూరుస్తూ రూప ఈ సిసిటివి ఫుటేజీలను సిబిఐకి సమర్పించడంతో ఇప్పుడు ఈ దృశ్యాలు సంచలనాన్ని కలిగిస్తున్నాయి. ఇద్దరు మహిళలు చేతుల్లో బ్యాగ్‌లతో పరప్పన అగ్రహార జైలులోకి దర్జాగా ప్రవేశిస్తున్న దృశ్యాలు ఫుటేజీల్లో స్పష్టంగా కనిపిస్తున్నాయి. అయితే, ఈ దృశ్యాలు ఎప్పుడు రికార్డయ్యాయి, దృశ్యంలో కనిపిస్తున్న జైలు భాగం ఏ వైపుది అన్న విషయాల్లో స్పష్టత లేదు. కాగా, సిసిటివి ఫుటేజీల గురించి తనకు తెలియదని డిజి హర్ సింగ్ మెగరిఖ్ మీడియాకు చెప్పారు. ఆరోపణలపై విచారణ జరుపుతున్న కమిషన్ త్వరలోనే నివేదిక సమర్పిస్తుందని అన్నారు.

నేతాజీ సహచరుడు కన్నుమూత

బరేలి: నేతాజీ సుభాష్ చంద్రబోస్ సమకాలికుడు, సహచరుడు కలోనెల్ అమర్ బహదూర్ సింగ్ ఆదివారం మృతి చెందారు. ఆయన వయస్సు 102 సంవత్సరాలు. సింగ్ చాలాకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. భార్యతో విడాకులు పొందిన ఆయన బహేరి ప్రాంతంలోని సిర్సా సమీపాన అన్‌సెస్త్రల్ గ్రామంలో నివసిస్తున్నారు. అనారోగ్యంతో ఆదివారం కన్నుమూసారు. ప్రముఖుల సమక్షంలో ఆయన అంత్యక్రియలు జరిగాయి. సింగ్‌కు ఓ కుమారుడు ఉన్నాడు. 1933లో బ్రిటీష్ ఆర్మీలో చేరిన సింగ్ నేతాజీతో పరిచయం తర్వాత ఆజాద్ హింద్‌ఫౌజ్‌లో పనిచేశారని ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. సింగ్ మరణం పట్ల ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి త్రివేంద్ర సింగ్ రావత్, కేంద్ర మంత్రులు మేనకా గాంధీ, సంతోష్ గాంగ్వార్‌లు సంతాపాన్ని ప్రకటించారు.

సమైక్యంగా ముందుకు సాగండి




న్యూఢిల్లీ: మహాత్మగాంధీ స్వస్థలమైన గుజరాత్‌లో పార్టీ ప్రజాప్రతినిధులంతా సమైక్యంగా పనిచేయాలని, సిద్ధాంతాలు, ధర్మం కోసం పోరాటాన్ని కొనసాగించాలని కాంగ్రెస్ అధిష్టానం పిలుపునిచ్చింది. ఈ ఏడాది అనంతరం జరుగబోయే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో సోమవారం అధినేత్రి సోనియా గాంధీ అధ్యక్షతన ఆమె నివాసంతో పార్టీ ప్రజాప్రతినిధులతో కీలకమైన వ్యూహాత్మక సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో పార్టీ ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ, ఎఐసిసి ప్రధాన కార్యదర్శి, గుజరాత్ ఇన్‌చార్జి అశోక్ గెహ్లాట్, అగ్రనేత అహ్మద్ పటేల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు అంతా సంఘటితంగా ముందుకు సాగాలని సూచించారు. పార్టీకి చెందిన గుజరాత్ ఎంఎల్ఎలు, నాయకులతో సమావేశం ఈరోజు బాగా జరిగిందని సమావేశానంతరం రాహుల్ గాంధీ ట్వీట్ చేశారు. ప్రజాస్వామ్యం, ధర్మం కోసం చేసిన పోరాటంలో విజయం సాధించినందుకు పార్టీ ఎంఎల్ఎలను సోనియా, రాహుల్‌లు ఈ సందర్భంగా సమావేశంలో అభినందించినట్టు తెలిసింది.

అహ్మద్ పటేల్, ఇసిలకు నోటీసులు

అహ్మదాబాద్: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత అహ్మద్ పటేల్, ఎన్నికల సంఘం (ఇసి)లకు గుజరాత్ హైకోర్టు సోమవారం నోటీసులు జారీ చేసింది. ఇటీవల ముగిసిన గుజరాత్ రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇద్దరు తిరుగుబాటు ఎంఎల్ఎల ఓట్లు చెల్లవంటూ ఇసి తీసుకున్న నిర్ణయాన్ని సవాలు చేస్తూ బిజెపి అభ్యర్థి బల్వంత్‌సిన్హ రాజ్‌పుత్ దాఖలు చేసిన పిటిషన్‌ని పరిశీలించిన జస్టిస్ బేల త్రివేది ఈ మేరకు వారికి నోటీసులు పంపారు. నోటీసులకు సెప్టెంబరు 21 లోగా వివరణ ఇవ్వాలని కోర్టు వారిని ఆదేశించింది. తనకు అనుకూలంగా ఓటేసేందుకు ప్రయత్నించిన ఇద్దరు కాంగ్రెస్ ఎంఎల్ఎల ఓట్లను చెల్లనివిగా ప్రకటించినట్లుగానే, అనధీకృత వ్యక్తులకు తమ బ్యాలెట్ పేపర్లను చూపించిన ఆదే పార్టీకి చెందిన మరో ఇద్దరు ఎంఎల్ఎల ఓట్లను కూడా రద్దు చేసి, తనను విజేతగా ప్రకటించాలని రాజ్‌పుత్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. ఇసి నిర్ణయంతో 44 ఓట్లను దక్కించుకోవడం ద్వారా పటేల్ గెలవగా 38 ఓట్లతో రాజ్‌పుత్ ఓటమిపాలయ్యారు.

మాలెగావ్ కేసులో కల్నల్ కు బెయిల్



న్యూఢిల్లీ : మాలెగావ్ పేలుళ్ల కేసులో లెఫ్టినెంట్ కల్నల్ శ్రీకాంత్ పురోహిత్‌కు సుప్రీంకోర్టు సోమవారం బెయిల్ మంజూరు చేసింది. పురోహిత్ బెయిల్ వినతిని తిరస్కరిస్తూ బాంబే హైకోర్టిచ్చిన తీర్పును న్యాయమూర్తులు ఆర్‌కె అగర్వాల్, ఎఎం సప్రిలతో కూడిన ధర్మాసనం పక్కనపెట్టింది. బెయిల్ మంజూరు సందర్భంగా కల్నల్‌కు కొన్ని షరతులు విధించామని సుప్రీం బెంచ్ తెలిపింది. ఈ కేసు పరంగా తాను 'రాజకీయ ఉచ్చు'లో చిక్కుకుపోయానని, తొమ్మిదేళ్లుగా జైలులో మగ్గుతున్నానని పురోహిత్ ఈ నెల 17న సుప్రీంకోర్టుకు వివరించారు. తన బెయిల్ అభ్యర్థనను తోసిపుచ్చుతూ బాంబై హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ ఆయన అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. సెప్టెంబరు 29, 2008న ఉత్తర మహారాష్ట్రలోని నాసిక్ జిల్లాలో ఉన్న మాలెగావ్ పట్టణంలో సంభవించిన బాంబు పేలుడులో ఏడుగురు వ్యక్తులు దుర్మరణం చెందిన సంగతి విదితమే.

గో దళాలపై తీసుకునే చర్యలేంటి?

ముంబయి: వచ్చే నెలలో బక్రీద్ నేపథ్యంలో గోరక్షణ దళాలపై ఎలాంటి చర్యలు తీసుకోబోతున్నారో తెలియజేయాలని బొంబాయి హైకోర్టు మహారాష్ట్ర పోలీసులను ఆదేశించింది. ఈ విషయంలో తగిన విధంగా వ్యవహరించేందుకు స్పష్టమైన విధానాన్ని ఎన్నుకున్నారా లేదా, మార్గదర్శకాలు రూపొందించుకున్నారా లేదా అని ప్రశ్నించింది. అయితే, శాంతి భద్రతల పరిరక్షణ అనేది పోలీసులు బాధ్యత అని పేర్కొంది. గోరక్షణ దళాలతో బక్రీద్ సమయంలో ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తూ నగర వాసి షదాబ్ పటేల్ దాఖలు చేసిన రిట్‌పై విచారణను హైకోర్టు డివిజన్ బెంచ్ పరిశీలించింది.



సోమవారంనాడు చెన్నైలోని అన్నాడిఎంకె కార్యాలయంలో విలీనమవుతున్నట్లు అధికారికంగా ప్రకటన చేస్తున్న సిఎం పళనిస్వామి, పన్నీర్ సెల్వం



శశికళను పార్టీ పదవి నుంచి తప్పించడాన్ని వ్యతిరేకిస్తూ సోమవారంనాడు రాత్రి జయలలిత సమాధి వద్ద మౌనదీక్షకు దిగిన శశికళ, దినకరన్ వర్గ ఎంఎల్ఎలు

పళనికి దినకరన్ దిగులు

- శశికళపై చర్యలకు వ్యతిరేకంగా 18మంది తిరుగుబావుటా
- నేడు గవర్నర్‌తో భేటీ, భవిష్యత్ కార్యాచరణపై ప్రకటన

చెన్నై: ఎఐఎడిఎంకెలోని వైరివర్గాలు ఏకమైన గంటల వ్యవధిలోనే తమిళనాడు రాజకీయాలు మళ్లీ వేడెక్కాయి. శశికళను పార్టీ పదవి నుంచి తప్పించడాన్ని తాము వ్యతిరేకిస్తున్నట్టు 18మంది అధికార అన్నాడిఎంకె ఎంఎల్ఎలు, దినకరన్‌కు మద్దతుదారులు అసమ్మతిగళం విప్పారు. మంగళవారంనాడు ఉదయం గవర్నర్ విద్యాసాగర్‌రావును కలిసిన తర్వాత తమ తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామని ఎంఎల్ఎ వేత్రివేల్ స్పష్టం చేశారు. ఉదయం 10గంటలకు గవర్నర్ తమకు సమయం ఇచ్చారని, ఆయనతో ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులపై చర్చిస్తామని చెప్పారు. 18మంది ఎంఎల్ఎలు శశికళకు మద్దతుగా జయలలిత సమాధి వద్దకు చేరుకుని అక్కడ 15నిమిషాల పాటు మౌదదీక్షలో కూర్చుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడి వెళ్లిపోయారు. అంతకుముందు దినకరన్ మద్దతుదారుడు, ఎంఎల్ఎ పుగలేండి పార్టీలోని వైరివర్గాల ఐక్యతపై ధ్వజమెత్తారు. పళనిస్వామికి ఇకపై సిఎంగా ఎంత మాత్రం కొనసాగే హక్కులేదన్నారు. తమ నాయకుడు దినకరన్ త్వరలో కొత్త సిఎంను ప్రకటిస్తారని చెప్పారు. ప్రభుత్వ మనుగడకు వ్యతిరేకంగా తమ నాయకుడు న్యాయపరమైన చర్యలకు కూడా దిగే అవకాశాలున్నాయని, అందుకు ఉన్న అవకాశాలను పరిశీలిస్తున్నారని పుగలేండి వెల్లడించారు. మరోవైపు శశికళకు మద్దతుగా నిలుస్తున్న 18మంది శాసనసభ్యులు పళనిస్వామి ప్రభుత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేస్తే ఆయన ప్రభుత్వ మనుగడ కొంత ఇబ్బందుల్లో పడే అవకాశాలున్నాయి. ప్రస్తుతం 233మంది సభ్యులున్న తమిళనాడు అసెంబ్లీలో అధికార అన్నాడిఎంకె బలం 134. జయలలిత మరణంతో ఒక సీటు ఖాళీగా ఉంది. వీరిలో అసమ్మతి జెండా ఎగురవేస్తున్న 18మంది పక్కకు వెళితే ఆ బలం 116కు పడిపోతుంది. అంటే ప్రభుత్వ మనుగడకు కావాల్సిన సాధారణ మెజారిటీకి ఒక్క సభ్యుడు తక్కువవుతారు.

అవిశ్వాస తీర్మానం పెడతాం : డిఎంకె

ప్రస్తుతం రాష్ట్రంలో కొనసాగుతున్నది ప్రజా ప్రభుత్వం కాదని, ప్రజలు ఇలాంటి ప్రభుత్వానికి ఓటు వేయలేదని డిఎంకె ధ్వజమెత్తింది. అధికార అన్నాడిఎంకె వ్యవహారాల్లో కేంద్రంలోని బిజెపి జోక్యం చేసుకుంటుందని డిఎంకె కార్యనిర్వహక అధ్యక్షుడు ఎంకె స్టాలిన్ ఆరోపించారు. అధికార పక్షంలోని రెండు వర్గాలు పూర్తిగా బిజెపికి లొంగిపోయాయని, స్టోరీ, స్క్రీన్‌ప్లే, డైరెక్షన్ అంతా ఢిల్లీ కనుసన్నల్లో సాగుతోందని, అందులో పన్నీర్, పళని నటులుగా ఉన్నారని స్టాలిన్ ధ్వజమెత్తారు. వీళ్లిద్దరి ఐక్యతతో తమిళనాడుకు ఒరిగేదేం లేదని అన్నారు. ప్రజల కోసం కాకుండా సొంత ప్రయోజనాల కోసం వాళ్లిద్దరూ కలిసారని ఎంపి కనిమొళి అన్నారు.

శశికళను తప్పిస్తాం

త్వరలోనే పార్టీ సమావేశాన్ని ఏర్పాటు చేసి, శశికళను తప్పిస్తూ ఒక నిర్ణయం తీసు కుంటామని సీనియర్ నేత, రాజ్యసభ ఎంపి ఆర్.వైద్యలింగం అన్నారు. ముఖ్యమంత్రి పళనిస్వామి వర్గానికి చెందిన ఆయన ఇక్కడ పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన విలీన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శశికళ తొలగింపుకు త్వరలోనే చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు. తద్వారా విలీనానికి పన్నీర్‌సెల్వం పెట్టిన ప్రధాన షరతులలో ఒకటైన ఆమె తొలగింపును పళనిస్వామి వర్గం నెరవేర్చనుంది. మాజీ మంత్రిగా పనిచేసిన వైద్యలింగాన్ని పార్టీ ఉప సమన్వయకర్తగా నియమించారు. విలీనానికి ముందు, అన్నాడిఎంకె నేత ఆవడి కుమార్ విలేకరులతో మాట్లాడుతూ.. పార్టీ తాత్కాలిక ప్రధాన కార్యదర్శిగా శశికళను పార్టీ సర్వసభ్య సమావేశం ఎంపిక చేసిందని, ఇపుడు ఆమె తొలగింపుపై కూడా అదే నిర్ణయం తీసుకుంటుందని ఆయన చెప్పారు.

ట్రిపుల్ తలాఖ్‌పై నేడు కీలక తీర్పు

న్యూఢిల్లీ: ట్రిపుల్ తలాఖ్‌పై సుప్రీంకోర్టు మంగళవారం అత్యంత కీలకమైన, చారిత్రకమైన తీర్పును వెలువరించనుంది. మూడుసార్లు తలాఖ్ చెప్పడం ద్వారా వివాహ బంధాన్ని తెంచుకునే ఈ పద్ధతి ముస్లింలలో మతపరంగా సాంప్రదాయంగా చలమాణిలో ఉంది. దీనిని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జెఎస్ ఖేహర్ నాయకత్వంలోని ఐదుగురు సభ్యుల ధర్మాసనం కూలంకుషంగా విచారించింది. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుంది. జస్టిస్ ఖేహర్ అత్యున్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తిగా పదవీ విరమణ పొందుతున్న కొద్దిరోజులకు ముందు తలాఖ్ తీర్పు వెలువడనుంది. వేసవి సెలవుల సందర్భంగా తలాఖ్ వ్యాజ్యాలపై పంచసభ్య ధర్మాసనం ఆరురోజుల పాటు విస్తృతస్థాయిలో విచారణ జరిపింది. తీర్పును సిద్ధం చేసి, రిజర్వ్ చేసి ఉంచింది. మంగళవారం వెలువడే ఈ తీర్పు ఏ విధంగా ఉంటుందనేది మతపెద్దలలో, ముస్లిం వర్గాలలో, సామాజికవేత్తలలో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ట్రిపుల్ తలాఖ్ అంశంపైనే తాము దృష్టి సారించామని, బహుభార్యత్వ విధానం గురించి సమీక్షించలేదని ధర్మాసనం విచారణ సమయంలోనే స్పష్టం చేసింది. ముస్లింలు తమ మత ఆచార వ్యవహారాలను పాటించేందుకు కల్పించిన ప్రాథమిక హక్కులో అంతర్భాగంగా ఈ ట్రిపుల్ తలాఖ్ వ్యవహారం ఉన్నదా లేదా అనేది పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఖేహర్‌తో పాటు న్యాయమూర్తులు కురియన్ జోసెఫ్, ఆర్‌ఎఫ్ నారిమన్, యుయు లలిత్, ఎస్ అబ్దుల్ నజీవర్ ఈ ధర్మాసనంలో సభ్యులుగా ఉన్నారు. ఏడు అభ్యర్థనలు, ముస్లిం మహిళలు దాఖలు చేసుకున్న ఏడు వేర్వేరు పిటిషన్లు విచారణకు వచ్చాయి. ట్రిపుల్ తలాఖ్ రాజ్యాంగబద్ధం కాదని వారు స్పష్టం చేశారు. మూడుసార్లు తలాఖ్ చెప్పడం, కొన్ని సందర్భాలలో ఎక్కడి నుంచో ఫోన్‌లోనే దీనిని వల్లించడం వంటివి, ఎస్ఎంఎస్ చేయడం వంటివి , విడాకులు పొందడానికి దారులైతే అంతకంటే దారుణం మరోటి ఉండదని పిటిషనర్లు ఆవేదన వ్యక్తం చేశారు. వివిధ రాజ్యాంగ నిబంధనల మేరకు చూసినా ఈ పద్ధతి చెల్లనేరదని కేసులో వాదించిన న్యాయవాది రామ్ జెత్మలానీ తెలిపారు. సమానతకు ఇది భంగకరం అన్నారు.

ఇది అంతరాల విషయం : కేంద్రం

ట్రిపుల్ తలాఖ్ అంశంపై కేంద్ర ప్రభుత్వం కూడా తన వాదనను విన్పించింది. దీనిని నిషేధించాలని చెప్పకుండా, ఇది చెల్లుబాటులో లేకుంటే ముస్లింలలో వివాహాలు, విడాకుల అంశాలను నియంత్రించే క్రమబద్ధీకరించే చట్టం రూపొందిస్తామని తెలిపింది. ఏది ఏమైనా సుప్రీంకోర్టు తీర్పును బట్టే తమ స్పందన ఉంటుందని తెలిపారు. అయితే ఇప్పుడున్న ముస్లిం విడాకుల పద్ధతులన్నీ కూడా చట్టాతీతంగానే ఉన్నాయని తెలిపారు. వ్యక్తిగత చట్టాలు రాజ్యాంగ పరిధిలో ఉండాలని, వివాహ హక్కులు, విడాకుల , ఆస్తుల, వారసత్వ అంశాలు కూడా రాజ్యాంగం పరిధిలోనే ఉండాలని స్పష్టం చేశారు. ఇది మెజార్టీ మైనార్టీల సంవాదం కాదని, ప్రత్యేకించి ముస్లిం మగవాడు, అణగారిన మహిళ మధ్య ఉండే వర్గ అంతర్గత వివాదం అని తేల్చారు.

అయోధ్య , ట్రిపుల్ తలాఖ్ ఒక్కటే : సిబల్

ట్రిపుల్ తలాఖ్ వ్యాజ్యంపై ముస్లిం పర్సనల్ లా బోర్డు తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదించారు. విచారణల సందర్భంగా ఆయన ట్రిపుల్ తలాఖ్ ముస్లింల మత ఆచార వ్యవహారాల్లో అంతర్భాగం అని, విశ్వాసాలకు సంబంధించిన విషయం అని, రాముడు అయోధ్యలో జన్మించాడనే విశ్వాసం వంటిదే ట్రిపుల్ తలాఖ్ అని, దీనిని ముస్లిం మతస్తులు నమ్ముతున్నారని తెలిపారు. ఆ నమ్మకం ఎంతో ఈ విశ్వాసం ఈ ఆచారం అంతేనన్నారు. మతపరమైన అంశాన్ని రాజ్యాంగ కట్టుబాట్ల ముందు పరీక్షకు నిలబెట్టరాదని స్పష్టం చేశారు.

రాజకీయాల్లోకి రజనీ

వస్తున్నారు

రచయిత తమిళరువి మణియన్ వెల్లడి

తిరుచిరాపల్లి: రాజకీయాల్లోకి రావాలని రజనీకాంత్ నిర్ణయించుకున్నట్లు తనకు చెప్పారని ప్రముఖ రచయిత తమిళరువి మణియన్ అన్నారు. డిఎంకె, అన్నాడిఎంకె పార్టీలు తమిళనాడు రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించాయని, ఆ రెండు ద్రవిడ పార్టీలకు రజనీయే ప్రత్యామ్నాయమని ఆయన చెప్పారు. ఆదివారమిక్కడ జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. తమిళనాడులో పాలనను నీరుగార్చేసిన ఆ రెండు పార్టీలను రాష్ట్రం నుండి వెలివేయాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రస్తుతం రజనీకి మద్దతివ్వకుంటే రాష్ట్రం అన్ని రకాలుగా దెబ్బతింటుందని ఆయన సభికులనుద్దేశించి ఆందోళన వ్యక్తం చేశారు. 'తమిళనాడులో పాలనా వ్యవస్థను రెండు పార్టీలు భ్రష్టుపట్టించాయి. రజనీకాంత్ రాజకీయ ప్రవేశం ద్వారా స్వచ్ఛమైన, పారదర్శకమైన పాలన ప్రజలకు లభిస్తుంది' అని మణియన్ ఆశాభావం వ్యక్తం చేశారు. అవినీతి నేపథ్యంలేని వ్యక్తులనే రజనీ ఆకాంక్షిస్తున్నారన్నారు.

పోలీసు ఖాళీల భర్తీ ఎప్పుడు?

రాష్ట్రాల నివేదికలకు సుప్రీం ఆదేశాలు



న్యూఢిల్లీ: రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో పోలీసు ఉద్యోగాలలో ఖాళీలపై సుప్రీంకోర్టు తీవ్రస్థాయిలో స్పందించింది. పోలీసు శాఖలోని ఉద్యోగాల భర్తీకి తీసుకుంటున్న చర్యలు, నియామక ప్రక్రియకు యంత్రాంగం ఏర్పాటు, ఎప్పటిలోగా ఖాళీల భర్తీ ఉంటుంది? అనే అంశాలపై 21 రాష్ట్రాలు , కేంద్ర పాలిత ప్రాంతాలు నాలుగు వారాల వ్యవధిలో తగు వివరణలతో అఫిడవిట్లు దాఖలు చేసుకోవాలని ధర్మాసనం సోమవారం ఆదేశించింది. ఇప్పటికైతే బీహార్, కర్నాటక, ఉత్తరప్రదేశ్ వంటి 14 రాష్ట్రాలు ఖాళీగా ఉన్న 4.3 లక్షల పోలీసు ఉద్యోగ ఖాళీలను నిర్ణీత కాల వ్యవధిలో భర్తీ చేయాలని స్పష్టం చేస్తున్నట్లు ప్రధాన న్యాయమూర్తి జెఎస్ ఖేహర్, న్యాయమూర్తి డివై చంద్రచూడ్‌తో కూడిన ధర్మాసనం తెలిపింది. ఇక మిగిలిన రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు ఎప్పటిలోగా ఖాళీలను భర్తీ చేయనున్నదీ తెలియచేసుకోవల్సి ఉంటుందని నిర్దేశించారు. దేశంలోని వివిధ ప్రాంతాలలో పోలీసు శాఖలో భారీ సంఖ్యలో పోలీసు ఉద్యోగాలు భర్తీ కాకుండా ఉన్నాయి. దీనితో శాంతి భద్రతల పరిస్థితి క్షీణిస్తోందని 2013లో న్యాయవాది మనీష్ కుమార్ దాఖలు చేసిన పిటిషన్‌పై అత్యున్నత న్యాయస్థానం విచారణ జరుపుతోంది. వివిధ రాష్ట్రాలలో పోలీసు ఉద్యోగాల భర్తీ ప్రక్రియను సుప్రీంకోర్టు పర్యవేక్షిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వాలు ఈ అంశంపై తమ నియామకాల ప్రక్రియ ఏర్పాట్లను తెలియచేసుకోవల్సి ఉంటుందని ఆదేశించారు. పోలీసు శాఖలో భర్తీల గురించి రాష్ట్రాలు తమ కార్యాచరణలను అందించాలని గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు పలు రాష్ట్రాలు ఈ నివేదికలను సుప్రీంకోర్టుకు అందించాయి.

తెలంగాణలో 17,504 పోలీసు ఉద్యోగాలు

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో వివిధ ర్యాంకులలో మొత్తం 17,504 పోలీసు ఉద్యోగాల ఖాళీలు ఉన్నాయని తెలియచేసుకుంది. వీటిని భర్తీ చేసే ప్రక్రియ సాగుతోందని, ఈ ఏడాది సెప్టెంబర్ 1 నాటికి 9,862 ఖాళీల భర్తీ ప్రక్రియ పూర్తవుతుందని తెలిపింది. ఈ రోడ్‌మ్యాప్ పట్ల సుప్రీంకోర్టు సంతృప్తి వ్యక్తం చేసింది. గుజరాత్‌కు సంబంధించినంతవరకూ వచ్చే ఏడాది ఆగస్టు నెలాఖరులోగా ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలని ఆదేశించారు. పోలీసు శాఖలో భర్తీ ఖాళీకి తమకు రెండేళ్ల సమయం కావాలనే బీహార్ ప్రభుత్వ నివేదికను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. తాజాగా మరో నివేదికను సమర్పించుకోవాలని నితీశ్ కుమార్ ప్రభుత్వాన్ని ఆదేశించారు. దేశంలో దాదాపు ఆరు లక్షల పోలీసు ఉద్యోగాల ఖాళీలు ఉన్నాయని పిటిషనర్ పేర్కొన్నారు.

చైనాకు భారత్ మరో చెక్

మొబైల్ ఫోన్ టెంపర్డ్ గ్లాస్‌పై దిగుమతి సుంకం విధింపు



న్యూఢిల్లీ: చైనా దిగుమతులను అరికట్టే దిశగా కేంద్రం ప్రభు త్వం మరో కఠిన నిర్ణయం తీసుకుంది. మొబైల్ ఫోన్లకు రక్షణగా ఉపయోగించే టెంపర్డ్ గ్లాస్‌లపై దిగుమతి సుంకాన్ని విధించింది. దేశీయ పరిశ్రమలను రక్షించే దిశగా ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు పేర్కొంటూ ఒక నోటిఫికేషన్ విడుదల చేసింది. చైనా నుంచి దిగుమతి అయ్యే టెంపర్డ్ గ్లాస్‌లపై టన్నుకు 52.85 డాలర్ల నుంచి 136.21 డాలర్ల మేర సుంకాన్ని విధిస్తున్నట్లు తెలిపింది. చైనా నుంచి దిగుమతి అవుతున్న ఈ టెంపర్డ్ గ్లాస్‌లు సాధారణ ధర కంటే తక్కువకే వస్తున్నట్లు యాంటీ డంపింగ్ అండ్ అలైడ్ డ్యూటీస్ (డీజీఏడీ) డైరెక్టరేట్ జనరల్ దర్యాప్తులో తేలింది. దీంతో దేశీయ పరిశ్రమలు ఇబ్బందులు పడుతున్నట్లు గుర్తించింది. స్వదేశీ పరిశ్రమలను కాపాడే లక్ష్యంగా దిగుమతి నిరోధక సుం కం విధిస్తున్నట్లు నోటిఫికేషన్‌లో రెవెన్యూ శాఖ పేర్కొంది. రాబోయే ఐదేళ్ల పాటు ఇది అమల్లో ఉంటుందని తెలిపింది.

పొట్ట ఉబ్బి..ప్రాణాంతకమై..



న్యూఢిల్లీ: అసాధారణంగా పొట్ట 59 అంగుళాల మేరకు ఉబ్బిపోయి, దాదాపు 10 కిలోల బరువు పెరిగిపోయి చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న ఓ యువకుడి విషాదకర ఉదంతమిది. అస్సాంకు చెందిన బికాష్ హజారిక (21) ఈ అరుదైన వ్యాధితో బాధపడుతున్నాడు. గత ఐదు సంవత్సరాలుగా కడుపు ఉబ్బిపోయి తీవ్రమైన కడుపునొప్పితో నడువలేక, దైనందిన కార్యక్రమాలు చేసుకోలేక జీవచ్ఛవంలా బతుకీడుస్తున్నాడు. 61 కిలోల బరువున్న బికాష్‌కు ఉన్న ఈ ప్రాణాంతమైన స్థితిని వైద్య పరిభాషలో 'కంజెస్టివ్ హెపటోమెగలీ'గా డాక్టర్లు పేర్కొంటున్నారు. ఐదేళ్లుగా ఒక్కోసారి కూర్చున్నచోటనే అదే స్థితిలో ఎటూ కదలలేక గంటన్నర పాటు నిద్రలోకి జారి పోతుంటాడు.



స్పేస్ టెక్నాలజీలో ఇజ్రాయెల్‌తో ఒప్పందంపై ఇస్రో దృష్టి

న్యూఢిల్లీ: స్పేస్ టెక్నాలజీలో ఆప్టికల్ కమ్యూనికేషన్ టెక్నిక్ రంగం, విద్యుత్ చోదక వ్యవస్థకు సంబంధించి ఇజ్రాయెల్‌తో సహకార ఒప్పందాన్ని ముందుకు తీసుకెళ్లే దిశగా భారత్ దృష్టిసారిస్తుందని భారతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) చీఫ్ ఎఎస్ కిరణ్ కుమార్ చెప్పారు. గతనెలలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఇజ్రాయెల్ లోని జెవిష్‌లో పర్యటించిన సమయంలో ఇజ్రాయెల్ అంతరిక్ష సంస్థ (ఐఎస్ఎ)తో ఇస్రో సహకార ఒప్పందంపై సంతకం చేశాయి. ఈ నేపథ్యంలో స్పేస్ టెక్నాలజీలో విద్యుత్ చోదక వ్యవస్థ, ఆప్టికల్ కమ్యూనికేషన్ టెక్నిక్ రంగంలో సహకారం కోసం యోచిస్తున్నామని ఇస్రో చైర్మన్ తెలిపారు. బరువైన శాటిలైట్లను కక్ష్యలోకి పంపేందు కు విద్యుత్ చోదక వ్యవస్థ ఎంతో ముఖ్యమని అన్నారు. ఈ సమయంలో శాటిలైట్ నుంచి భూ కేంద్రం వరకు సమాచారాన్ని ఆప్టికల్ కమ్యూనికేషన్ టెక్నిక్ బదిలీ చేస్తుంది. వనరులను వాటా, అంతర్జాతీయ సంస్థలతో కూడా ఇస్రో సహకారాన్ని అందిస్తున్నట్టు స్పేస్ సెక్రటరీ కిరణ్ చెప్పారు. నాసా, ఇస్రోల మధ్య సహకార ఒప్పందంతో బయోమాస్ అంచనా, వ్యవసాయ ఉత్పత్తి అంచనాలపై కీలక సమాచారాన్ని అందించేందుకు నిసార్ (నాసా, ఇస్రో సింథటిక్ అపార్చర్ రాడర్) శాటిలైట్ సహాయపడుతుందని కిరణ్ పేర్కొన్నారు. భూఉపరితల రూపాన్ని అధ్యయనం చేసేందుకు కూడా ఈ నాసర్ ఉపయోగపడుతుందని చెప్పారు.

పది మంది నావికుల గల్లంతు

సింగపూర్ : సముద్ర జలాల్లో రెండు నౌకలు ఢీకొన్న ఘటనలో పది మంది అమెరికా నావికులు గల్లంతు అయ్యారు. ఐదుగురు గాయపడ్డారు. అమెరికా యుద్ధ నౌక యుఎస్ఎస్ జాన్ ఎస్ మెక్‌కెయిన్ సోమవారం సింగపూర్‌కు చెందిన ఓ వాణిజ్య నౌకను ఢీకొంది. ఈ సంఘటన సింగపూర్ తీరానికి తూర్పున మలాక్కా సింధుశాఖ వద్ద జరిగింది. గత రెండు నెలల్లో అమెరికా యుద్ధనౌకలు ఈ విధమైన ప్రమాదానికి గురి కావడం ఇది రెండోసారి. మిస్సైల్ విధ్వంసక యుద్ధనౌక వేరే నౌకతో ఢీకొనడంతో తీవ్రస్థాయిలో నష్టం జరిగి ఉంటుందని అనుమానిస్తున్నారు. ప్రమాదంలో కొంచెం దెబ్బతిన్న యుద్ధనౌక ఆ తరువాత సింగపూర్‌కు తరలివెళ్లిందని అధికారులు తెలిపారు. గల్లంతు అయిన నౌకా సిబ్బంది కోసం గాలింపు చర్యలు చేపట్టారు. సింగపూర్, మలేసియా, అమెరికాకు చెందిన విమానాల ద్వారా నావికులను కాపాడేందుకు యత్నిస్తున్నారు. జూన్‌లోనే జపాన్‌కు సమీపంలో అమెరికా యుద్ధనౌక ఒకటి ప్రమాదానికి గురయింది. ఇప్పుడు అమెరికా యుద్ధనౌకతో ఢీకొన్న సింగపూర్ ట్యాంకర్‌లో 30వేల టన్నులకు పైగా చమురు, రసాయనాలు ఉన్నట్లు వెల్లడైంది. ఇవి ప్రమాదం ధాటికి సముద్రంలో కలిసిపోయిందీ లేనిదీ వెల్లడికాలేదు.

వచ్చే నెలలో పట్టాలపైకి బుల్లెట్ రైలు

బీజింగ్ : గంటకు 350 కిలోమీటర్ల వేగం..1250 కిలోమీటర్ల దూరం కేవలం నాలుగున్నర గంటల్లో చేరుకునే సామర్థ్యం. ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన బుల్లెట్ ట్రైన్‌ను చైనా అతి త్వరలో ప్రవేశపెట్టనుంది. బీజింగ్ నుంచి షాంఘైకి ఈ బుల్లెట్ రైలు ప్రయాణం ఉంటుంది. ప్రస్తుతం ఈ రెండు నగరాల మధ్య ప్రయాణానికి ఆరు గంటలు పడుతోందని, బుల్లెట్ రైలుతో ఈ కాలం తగ్గుతుందని అధికారులు తెలిపారు. ఫక్సింగ్ పేరిట పిలవబడే ఈ రైలు వచ్చే నెల 21న పట్టాలపైకి రానుంది. బుల్లెట్ రైళ్ల నిర్వహణ చైనాకు కొత్తేమీ కాదు. ఇప్పటికే తొమ్మిదేళ్ల క్రితమే బీజింగ్ –టియాంజిన్ మధ్య ఈ రకమైన వేగంతో రైలు ఉంది. వచ్చే కొద్ది సంవత్సరాలలో మరిన్ని బుల్లెట్ రైళ్లు దూసుకువస్తాయని అధికారులు తెలిపారు.

సంకీర దాడుల్లో 21 మంది మృతి

బీరూట్ : సిరియాలో అమెరికా నాయకత్వపు సంకీర్ణదళాల దాడులలో 21 మంది పౌరులు దుర్మరణం చెందారు. ఐఎస్ఐఎస్ అధీనంలో ఉన్న రఖా నగరంపై సంకీర్ణ దళాలు దాడులకు దిగాయని, పౌరులు మృతి చెందారని హక్కుల సంఘం పర్యవేక్షకులు రమీ అబ్దెల్ రహ్మాన్ తెలిపారు. దాడులలో ఏడుగురు పిల్లలు కూడా మృతి చెందారు. జనసమ్మర్థం ఉండే అల్‌బదూ ప్రాంతంలోనే సైన్యం దాడులకు దిగిందని రెహ్మాన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఐసిఎస్ ఆధీనం నుంచి చాలా వరకూ ఇప్పటికే రఖా నగరం విముక్తం అయింది. సిరియా ప్రజాస్వామిక దళాలు పలు ప్రాంతాల్లో తమ ఆధిపత్యాన్ని చాటుకున్నాయి. ఈ దళాలకు అమెరికా సంకీర్ణ బలగాలు తోడుగా నిలుస్తున్నాయి. జిహాదీలను లక్ష్యంగా చేసుకుని తీవ్ర స్థాయిలో సాగుతున్న పోరులో ఎక్కువగా పౌరులే బలి అవుతూ వస్తున్నారు. వారం రోజుల వ్యవధిలో కనీసం 125 మంది పై రులు అమెరికా నాయకత్వపు సేనల దాడులలో బలి అయినట్లు వెల్లడైంది.

నంద్యాలలో సర్వేల నిషేధంపై జోక్యం చేసుకోలేం : హైకోర్టు

మన తెలంగాణ/ హైదరాబాద్: ఎన్నికల పోలింగ్‌కు 48 గంటలే వ్యవధి ఉన్నందున ఎన్నికల సర్వేల ప్రచురణ, ప్రసారాల నిషేధంపై జోక్యం చేసుకోజాలమని హైకోర్టు సోమవారం ప్రకటించింది. 48 గంటల కంటే ముందుగానే ఎన్నికల ఫలితాలపై జనాభిప్రాయాలు, సర్వేలపై రిటర్నింగ్ అధికారి నిషేధంపై స్టే మంజూరుకు హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి ఉమాదేవిలతో కూడిన డివిజన్ బెంచ్ అంగీకరించలేదు. సర్వేలపై నిషేధాన్ని విధిస్తూ నంద్యాల ఎన్నికల రిటర్నింగ్ అధికారి 15వ తేదీ నాటి ఉత్తర్వులపై స్పార్క్ అనే స్వచ్ఛంద సంస్థ రాష్ట్ర కార్యదర్శి ఎస్. రాంబాబు హైకోర్టులో సవాలు చేసిన వ్యాజ్యం సోమవారం హైకోర్టు విచారణకు వచ్చింది. పోలింగ్‌కు 48 గంట ల ముందుగా మాత్రమే సర్వేలపై నిషేధం విధించవచ్చునని, ముందుగా నిషేధం అమలు చేయడం చట్ట వ్యతిరేకమని పిటిషనర్ సీనియర్ న్యాయవాది కె. రవీంద్ర కుమార్ వాదించారు. కేంద్ర ఎన్నికల సంఘం కార్యదర్శి, ఎన్నికల సంఘం రాష్ట్ర ప్రధాన అధికారి, నంద్యాల రిటర్నింగ్ అధికారిలకు నోటీసులు జారీ చేసిన హైకోర్టు విచారణ 3 వారాలు వాయిదా వేసింది.

నంద్యాల ఎన్నికపై కోర్టులో రిట్లు

మన తెలంగాణ/ హైదరాబాద్ : నంద్యాలలో అధికార పార్టీ తమను బెదిరిస్తోందంటూ వైసిపి పోలింగ్ ఏజెంట్లు హైకోర్టులో రిట్లు దాఖలు చేశారు. పోలింగ్ ఏజెంట్లుగా తమ పేర్లు ఇచ్చిన వెంటనే పోలీసులు తమ ఇళ్లకు వచ్చి తప్పుడు కేసులు పెడతామని భయభ్రాంతులకు గురిచేస్తున్నారంటూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పోలింగ్ ఏజెంట్లు విజయశేఖర్ రెడ్డి మరో 40 మందికిపైగా వ్యాజ్యాలు వేశారు. వీటిపై హైకోర్టు మంగళవారం విచారణ జరపనుంది. అక్రమ అరెస్టులు చేసే అవకాశాలున్నాయని, వైసిపి అభ్యర్థి శిల్పాపైన కూడా కేసులు పెట్టి పోలింగ్ రోజు అరెస్టు చేసే కుట్ర జరుగుతోందని రిట్‌లో పేర్కొన్నారు. ఇందులో హోంశాఖ ముఖ్యకార్యదర్శి, నంద్యాల అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా ఎస్‌పి, డిఎస్‌పి, ఇతర పోలీసులను ప్రతి వాదులుగా చేశారు. ఇదిలా ఉంటే నంద్యాలలో పోలింగ్ ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా జరిగేలా హైకోర్టు ఉత్తర్వులు జారీ చేయాలంటూ నంద్యాలకు చెందిన కిరణ్‌బాబు ఇంకో కేసు వేశారు. తమకు ఓట్లు వేయకపోతే సంక్షేమ కార్యక్రమాల అమలును నిలిపివేస్తామని అధికారులు బెదిరింపులకు పాల్పడుతున్నారని, సిఎంతో పాటు మంత్రులు కూడా జనాన్ని భయపెట్టేలా వ్యవహరించారన్న ప్రతివాదులుగా కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్, రాష్ట్ర ఎన్నికల అధికారి, డిజిపి, జిల్లా కలెక్టర్, ఎస్‌పిలను చేశారు.

ట్రెస్‌పాస్ కేసులో 2 వారాల్లో నివేదిక


మన తెలంగాణ/ హైదరాబాద్: జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ హౌజ్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌ఒ) తమ ఇంట్లోకి అక్రమంగా చొరబడ్డారన్న కేసులో విచారణ జరిపి రెండు వారాల్లో నివేదిక ఇవ్వాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్‌ను హైకోర్టు ఆదేశించింది. యాప్రాల్‌లో ఉండే భార్యాభర్తలు దాఖలు చేసిన వ్యాజ్యాన్ని సోమవారం న్యాయమూర్తి చల్లా కోదండరామ్ విచారించారు. యాప్రాల్‌లోని తమ ఇంట్లోకి వచ్చి బెదిరించారని యాప్రాల్‌కు చెందిన భార్యాభర్తలు ఎం. అరుణ, ఎం. నాగరాజు హైకోర్టును ఆశ్రయించారు. పోలీసులు చట్ట వ్యతిరేకంగా వ్యవహరించారని, ఇళ్లు ఖాళీ చేయాలని భయపెట్టారని, సిసి కెమెరాలను, వాటి ఫుటేజీని డిలీట్ చేశారని పిటిషనర్ల న్యాయవాది వి.రామచంద్రగౌడ్ వాదించారు. ఇంటి పత్రాల పరిశీలనకు మాత్రమే వారి ఇంటికి వెళ్లానని ఎస్‌హెచ్‌ఒ అంగీకరించారు.

బి.టెక్‌లో ప్రవేశాలకు షెడ్యూల్ విడుదల

మన తెలంగాణ/హైదరాబాద్ : పివి నరసింహారావు తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీలో బిటెక్ (డెయిరీ టెక్నాలజీ) ప్రవేశాలకు రెండోదశ కౌన్సిలింగ్ షెడ్యూల్ విడుదలైంది. కామారెడ్డి డెయిరీ టెక్నాలజీ ఈ నెల 24వ తేదీన విద్యార్థుల ఎంపికకు సంబంధించిన కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె. కొండల్ రెడ్డి సోమవారం తెలిపారు.

రాళ్లు వేసి కవ్వించారు

భారత సైన్యంపై చైనా విమర్శ



బీజింగ్ : లడఖ్‌లోని ప్యాంగ్యాంగ్ సరస్సు వద్ద ఘర్షణకు భారతీయ సైన్యమే కారణం అని చైనా నిందించింది. ఆగస్టు 15న ఇరు సైనిక పక్షాల మధ్య తీవ్రస్థాయిలో నెలకొన్న ప్రతిష్టంభన కేవలం భారత సైన్యపు కవ్వింపు చర్యల వల్లనే తలెత్తిందని, ఈ సరస్సు వద్ద ఘర్షణలు, రాళ్లు రువ్వడం వంటి ఘటనలకు భారతీయ సైన్యమే బాధ్యత వహించాల్సి ఉంటుందని చైనా విదేశాంగ ప్రతినిధి హ్యూ ఛూయింగ్ నిరసన ప్రకటన వెలువరించారు. ఈ ఘటనపై తాము ఇండియాకు ఫిర్యాదు చేసినట్లు వివరించారు. ఆగస్టు 15న సరస్సు ప్రాంతంలో ఇరు దేశాల సైనికుల మధ్య స్వల్పస్థాయిలో జరిగిన ఘర్షణ తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. లడఖ్‌లో భారతీయ భూభాగంలోకి చైనా సైన్యం చొచ్చుకు రావడానికి యత్నించగా తమ సైనిక బలగాలు అడ్డుకున్నాయని భారత అధికార వర్గాలు ప్రకటించాయి. ఈ వాదనను చైనా ఖండించింది. తమ బలగాలు సాధారణ సైనిక విన్యాసాలను తమ అధీన ప్రాంతంలోనే నిర్వహిస్తూ ఉండగా భారత సైనికులు రాళ్లు రువ్వారని చైనా ప్రతినిధి తెలిపారు. భారతీయ సైన్యం దాడిలో తమ బలగాలలో కొందరికి గాయాలు అయినట్లు ఆమె వివరించారు. ఈ ఘటనపై భారత్‌కు తీవ్రస్థాయిలో అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు వెల్లడించారు. డోక్లామ్ వద్ద ఇరు పక్షాల మధ్య ఉద్రిక్తత నెలకొని ఉన్నదశలోనే ఇప్పుడు లడఖ్ సరస్సు ఈ ఉద్రిక్తతను పెంచే వివాదాస్పద కేంద్ర బిందువుగా మారిందిమారింది.

అమెరికాకు చైనా హెచ్చరిక

చైనా మేథో సంపత్తి హక్కుల నిబంధనల (ఐపిఆర్) ఉల్లంఘన అంశంపై అమెరికా దర్యాప్తు ఆదేశం వివాదాస్పదం అయింది. ట్రంప్ వెలువరించిన దర్యాప్తు ఉత్తర్వులపై చైనా తీవ్రస్థాయిలో స్పందించింది. ఐపిఆర్ ఉల్లంఘనల పేరిట అమెరికా జరిపే ఎలాంటి వాణిజ్య దర్యాప్తు అయినా తమకు సమ్మతం కాదని, దీనిని తీవ్రంగా పరిగణిస్తామని, తాము తగు ప్రతిచర్య తీసుకోవల్సి ఉంటుందని చైనా హెచ్చరించింది. అత్యంత అరుదైన వాణిజ్య చట్టం పరిధిలో అమెరికా వాణిజ్య శాశ్వత ప్రతినిధి రాబర్ట్ లైట్జెర్ తమ దేశాధ్యక్షులు ట్రంప్ ఆదేశాల మేరకు దర్యాప్తు చేపట్టారు. మేథో సంపత్తి హక్కులను చైనా ఉల్లంఘిస్తోందని అమెరికా ఓ నిర్థారణకు వచ్చింది. అమెరికా అత్యంత అరుదుగా ప్రయోగించే వాణిజ్య దర్యాప్తులోని 301 నిబంధన ప్రకారం ఏ దేశం అయినా ఐపిఆర్‌ను ఉల్లంఘించినట్లు అయితే ఆ దేశంపై ఏకపక్షంగా వాణిజ్య ఆంక్షలు సుంకాల మోత విధింపునకు వీలేర్పడుతుంది. ప్రపంచంలో రెండు అత్యంత ఉన్నతస్థాయి ఆర్థిక శక్తివంత దేశాల మధ్య ఇప్పుడు ఈ అంశంపై నెలకొన్న వివాదం చివరికి వాణిజ్య సంబంధాలను దెబ్బతీసేందుకు దారితీస్తుందని భావిస్తున్నారు. అయితే ప్రపంచ వాణిజ్య సంస్థ ఉనికిలోకి వచ్చిన తరువాత అమెరికా అతి తక్కువగా వాణిజ్య ఆంక్షల జోలికి పోతోంది. అమెరికా సాగిస్తోన్న దర్యాప్తు క్రమాన్ని పరిశీలిస్తున్నామని, దీనికి అనుగుణంగా తమ స్పందన ఉంటుందని అధికార వార్తాసంస్థ జిన్హువా తెలిపింది. అమెరికాలో చైనా ఉత్పత్తులకు విస్తృత స్థాయి మార్కెట్ ఉన్న దశలో ట్రంప్ వెలువరించిన తాజా దర్యాప్తు ఆదేశాలు ఇరు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలకు ప్రతిఘాతంగా మారాయి.

అమెరికాలో భారత స్వాతంత్ర్య వేడుకలు



న్యూయార్క్ : అమెరికాలో భారత జాతీయత మువన్నెల జెండా సాక్షిగా ముచ్చటగా ఎగిసింది. భారత 71వ స్వాతంత్ర్య దినోత్సవం నేపథ్యంలో న్యూయార్క్ నడిబొడ్డున జరిగిన కార్యక్రమంలో వేలాది మంది భారతీయ సంతతి వారు ఉత్సాహంగా పాల్గొన్నారు. వేరే దేశంలో అత్యంత ఘనంగా జరిగిన ఈ స్వాతంత్ర్య వేడుకకు అతిధిగా బాహుబలి ఫేం రానా దగ్గుబాటి హాజరు కావడంతో తెలుగువారు మరింతగా మురిసిపోయ్యారు. ఈ కార్యక్రమంలో తమన్నా భాటియా కూడా పాల్గొన్నారు. న్యూయార్క్, న్యూజెర్సీ , కనెక్టికట్ ఇండియన్ అసోసియేషన్ల సమాఖ్య వారు సంయుక్తంగా ఈ ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా కనులపండువగా కవాతు జరిగింది. భారతీయ సంస్కృతిని , ఘనతను ప్రతిబింబించే శకటాలు రాజసంగా సాగాయి. పలు అమెరికా సంస్థలు ఈ శకటాలను రూపొందించాయి. వాద్య బృందాలు, పోలీసు దళాలు, ఇక్కడి భారతీయ సంతతి యువతరం ఆటపాటలతో సందడి నెలకొంది. ఈ విశేష కార్యక్రమానికి నగర మేయర్ బిల్ డె బ్లాసియో హాజరు అయ్యారు. భారతీయ సంతతి వారికి శుభాకాంక్షలు తెలిపారు. నగరానికి భారతీయ సంతతి వారు విశేష అసాధారణ సేవలు అందిస్తూ వస్తున్నారని, వారి సొంత దేశం స్వాతంత్ర్య దినోత్సవ వేడుక ఇక్కడ ఘనంగా జరగడం సంతోషకరం అని తెలిపారు.

గుట్టలుగా గుట్కా ప్యాకెట్లు

తరలిస్తున్న రూ.54 లక్షల విలువైన గుట్కా ప్యాకెట్లు స్వాధీనం • 8 మంది అరెస్టు, రెండు వ్యాన్‌లు సీజ్



మన తెలంగాణ/హైదరాబాద్ సిటీబ్యూరో: నగరంలో గుట్టలు గుట్టలుగా గుట్కా ప్యాకెట్లు బయటపడుతున్నాయి. తాజాగా నారాయణగూడ పోలీసు స్టేషన్ పరిధిలో రెండు వ్యాన్‌లలో అక్రమంగా తరలిస్తున్న రూ.54 లక్షల విలువైన గుట్కా ప్యాకెట్ల గుట్టును కమిషనర్స్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు రట్టు చేశారు. ఈ సందర్భంగా ఎనిమిది మందిని అరెస్టు చేసి, రెండు వ్యాన్లను సీజ్ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను టాస్క్‌ఫోర్స్ డిసిపి లింబారెడ్డి సోమవారం మీడియాకు వెల్లడించారు. కూకట్‌పల్లికి చెందిన కావేరి రోడ్ క్యారియెర్ మేనేజర్లు చుంచు రా ములు (56), గాడె నరేంద్ర (41), మూసారాంబాగ్‌కు చెందిన ఆఫీస్‌భాయ్ కలల బాల్‌రాజ్ (23), ఇసా మియాబజార్‌కు చెందిన గుట్కా డిస్టిబ్యూటర్లు ముత్యం సూర్యనారాయణ (53), ముత్యం రమేష్ (41), గుం టూరు జిల్లాకు చెందిన వ్యాపారి అబుల్‌సెట్టి హరి బాబు (46), బోరబండకు చెందిన డ్రైవర్ మహ్మద్ కమ్రాన్ (25), గుంటూర్ జిల్లాకు చెందిన మొద్దుల లక్ష్మ ణ హన్మంత్ ప్రసాద్ (49)లు కొద్ది రోజుల నుంచి నిషేధిత గుట్కా వ్యాపారం నిర్వహిస్తున్నారు. తెలంగాణ జిల్లా కేంద్రాలతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని ముఖ్య పట్టణాలకు భారీ ఎత్తున అక్రమంగా గుట్కా ప్యాకెట్లు, ఇతర పొగాకు ఉత్పత్తులు సరఫరా చేస్తున్నారు. ఈ మేరకు వీరు కా వేరి రోడ్ క్యారియెర్‌కు చెందిన రెండు వ్యాన్‌లలో రూ.54 లక్షల విలువైన గుట్కా ప్యాకెట్లు, ఇతర పొగాకు పదార్థాలను అక్రమంగా తరలిస్తున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ సెంట్రల్ జోన్ ఇన్ స్పెక్టర్ సాయిని శ్రీనివాస్‌రావు, ఎస్ఐలు జి.తిమ్మప్ప, బి.కాంతారెడ్డి, కె.వినోద్‌కుమారానంద్‌లు నారా యణగూడ వద్ద గుట్కా ప్యాకెట్లను సరఫరా చేస్తున్న రెండు వ్యాన్‌లపై దాడి చేశారు. ఈ సందర్భంగా ఎనిమిది మందిని అరెస్టు చేశారు. తదుపరి విచారణ నిమిత్తం నిందితులను నారాయణగూడ పోలీసులకు అప్పగించారు.

నిరంతరంగా కూరగాయల సాగు

మన తెలంగాణ/హైదరాబాద్ : వచ్చే వేసవి కాలంలో కూరగాయల నిరంతర సరఫరాకు 400 ఎకరాలలో షెడ్‌నెట్ హౌస్‌ల నిర్మాణానికి ఉద్యాన శాఖ ప్రణిళికలు సిద్ధం చేసింది. ఒకేసారి కాకుండా పంట, పంటకు మధ్య కొన్ని రోజుల గ్యాప్ పెంచుతూ కూరగాయల సాగు పెంచాలని నిర్ణయించింది. తద్వారా ప్రతి ఏటా వేసవిలో ఏర్పడుతున్న కూరగాయల తీవ్ర కొరతను అధిగమించవచ్చని భావిస్తోంది. ఇందుకు ఇప్పటికే అమలు చేస్తున్న మన మన కూAలగరాయలు పథకం కింద రంగారెడ్డి, మెదక్, సిద్ధిపేట, నల్లగొండ జిల్లాల పరిధిలో 128 గ్రామాలలో అమలు చేయాలని వ్యవసాయ కార్యదర్శి సి. పార్థసారథి అధికారులను ఆదేశించారు. ఉద్యాన, మార్కెటింగ్ శాఖ అధికారులతో ఆయన సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కూరగాయల సాగుకు తక్షణం తీసుకోవాల్సిన చర్యలు, భవిష్యత్ ప్రణాళికలపై పలు సూచనలు చేశారు. ప్రస్తుతం ఈ గ్రామాలలో సాగు చేస్తున్న కూరగాయల విస్తీర్ణం, ఉత్పత్తి, ఉత్పాదకత పెంచడంతో పాటు మార్చి నుంచి ఆగస్టు వరకు కొరత ఉన్న కూరగాయలను గుర్తించి వాటి నిరంతర సాగు,సరఫరా జరిగే విధంగా చూడాలన్నారు. ఇందుకు ఉద్యాన శాఖ అమలు చేస్తోన్న వివిధ పథకాలు (శాశ్వాత పందిరిల ఏర్పాటు, షెడ్‌నెట్ హౌస్‌లు) అనుసంధానం చేయాలని ఉద్యాన కమిషనర్ ఎల్. వెంకట్రామ్ రెడ్డిని ఆదేశించారు. కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్రంలో 1.70 లక్షల హెక్టార్లలో కూరగాయలు సాగు చేస్తున్నారన్నారు.

పౌరసన్మానానికి ఆహ్వానించకపోవడంపై అసంతృప్తి

మన తెలంగాణ/హైదరాబాద్ : ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు పౌరసన్మానానికి తమను రాష్ట్ర ప్రభుత్వం ఆహ్వానించకపోవడంపై టిడిపి నేతలు ఎల్. రమణ, రేవంత్ రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంకయ్య నాయుడు ఉప రాష్ట్రపతి కావడం అందరికి గర్వ కారణమని టిడిపి తరుపున వెంకయ్యను అభినందిస్తున్నట్లు సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో రమణ పేర్కొన్నారు.

27న కవి సమ్మేళనం

మన తెలంగాణ/హైదరాబాద్: కర్నాటక తెలుగు రచయితల సమాఖ్య, తెలుగు తేజం ఫౌండేషన్, ఇండో ఏషియన్ అకాడమీ విద్యా సంస్థలు సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 27న బెంగుళూరులోని కల్యాన్‌నగర్‌లో ''తెలుగు భాషా దినోత్సవం, కవి సమ్మేళనం'' కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి కర్నాటక తెలుగు రచయితల సమాఖ్య అధ్యక్షులు సిరిపంగి మహేశ్వర్ సభాధ్యక్షత వహించగా, ఇండో ఏషియన్ అకాడమీ ఛైర్మన్ ప్రొఫెసర్ టి.ఏకాంబరం నాయుడు ముఖ్యతిథిగా హాజరుకానున్నట్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రశాంతంగా గణేష్ ఉత్సవాలు

వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లాలు, కమిషనరేట్‌లకు డిజిపి ఆదేశాలు

మన తెలంగాణ/హైదరాబాద్ : ఈ నెల 25 వ తేదీ నుంచి ప్రారంభం కానున్న గణేష్ నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో డిజిపి అనురాగ్‌శర్మ సోమవారం తన కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాల ఎస్‌పిలు, పోలీసు కమిషనర్‌లతో ఆయన ఉత్సవాల నిర్వహణ సందర్భంగా చేపడుతున్న బందోబస్తు ఏర్పాట్లను సమీక్షించారు. గణేష్ విగ్రహాల ప్రతిష్ట, మండపాల ఏర్పాటు, దఫల వారిగా జరిగే నిమజ్జనోత్సవాలపై వివరాలను తెలుసుకున్నారు. నిర్వాహకులతో ఎప్పటికప్పుడు సంప్రదిస్తూ బందోబస్తు పటిష్టం చేయాలని, ఎక్కడా ఏ చిన్న సంఘటన చోటు చేసుకునేందుకు వీలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నిమజ్జనం సందర్భంగా చెరువులు, కుంటలు, కాలువల పరిసర ప్రాంతాలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, క్రేన్‌ల వినియోగంలో అనుసరించాల్సిన పద్ధతులను అడిగి తెలుసుకున్నారు. ఉత్సవాలలో యువకుల పాత్ర కీలకంగా ఉంటుందని, ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షించి వారితో చర్చించి బందోబస్తును ఏర్పాటు చేస్తే ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా ఉంటాయని సూచించారు. సెప్టెంబర్ 2 వ తేదీ బక్రీద్ సందర్భంగా కొన్ని సున్నితమైన ప్రదేశాలలో బందోబస్తును పటిష్టం చేసుకోవాలన్నారు.వీడియో కాన్ఫరెన్స్‌లో శాంతి భద్రతల విభాగం అదనపు డిజి అంజనీకుమార్, హైదరాబాద్ నగర పోలీ సు కమిషనర్ ఎం. మహేందర్‌రెడ్డి, ఇంటెలిజెన్స్ చీఫ్ నవీన్‌చంద్‌లు ఉన్నారు.



2021 వరకు మూగబోనున్న బిగ్‌బెన్ గడియారం

– నాలుగేళ్ల పాటు కొనసాగనున్న అత్యవసర మరమ్మతులు

లండన్: నగరంలోని పార్లమెంట్ వెస్ట్‌మినిస్టర్ భవనం వద్ద ఉన్న చారిత్రాత్మక బిగ్‌బెన్ గడియారం 2021 వరకు మూగబోనుంది. ఇందుకోసం అత్యవసర మరమ్మతుల చేసేందుకు గంటలు మోగించే విభాగాన్ని తొలగించే నిర్ణయం తీసుకున్నారు. ఈ గడియారంలో మరమ్మతులు పూర్తిచేసేంత వరకూ నాలుగేళ్ల పాటు గంటలు మోగించే విభాగాన్ని తొలగించే దిశగా చర్యలు చేపట్టాలంటూ పలువురు రాజకీయవేత్తలు డిమాండ్ చేశారు. బ్రిటీష్ ప్రధానమంత్రి థెరిసా మే, ఎంపిలు, సీనియర్ నేతలందరూ తీవ్రచర్చలు జరిపిన అనంతరం ఈ దిశగా నిర్ణయాన్ని తీసుకున్నారు. ఈ నేపథ్యంలో చివరిసారిగా బిగ్‌బెన్ గడియారం మోగించే గంటలను వినడానికి చాలామంది అక్కడికి చేరుకుంటున్నట్టు తెలుస్తోంది. అలాగే ప్రత్యేక సందర్భాల్లో న్యూ ఇయర్, రిమెంబరెన్స్ సండే రోజుల్లో మాత్రం ఈ గడియారం గంటలు మోగించనున్నారు. బిగ్‌బెన్ గడియారం క్రమంగా ఒరిగిపోతూ ఉండటంతో కొన్నాళ్లకూ కుప్పకూలిపోయే ప్రమాదం ఉందని పరిశోధకులు భావిస్తున్నారు.

నేరెళ్లపై లేఖ పిల్‌గా స్వీకరణ

మన తెలంగాణ/ హైదరాబాద్ : సిరిసిల్ల జిల్లా నేరెళ్ల, రామచంద్రపురం, జిల్లెల గ్రామాల్లోని దళితుల్ని పోలీసులు దారుణ చిత్రహింసలకు గురిచేయడంపై హైకోర్టు రిటైర్డు న్యాయమూర్తి, తెలంగాణ రైతు సంక్షేమ సమితి అధ్యక్షుడు బెజ్జారం చంద్రకుమార్ రాసిన లేఖను హైకోర్టు ప్రజాహిత వ్యాజ్యంగా స్వీకరించింది. పోలీసులు కావాలనే ఎనిమిది మంది దళితులను చిత్రహింసలకు గురిచేసి వారి హక్కులను కాలరాశారని, వారి వాంగ్మూలాల ఆధారంగా కేసులు పెట్టాలని ఆ లేఖలో పేర్కొన్నారు. కరీంనగర్ జైలులో ఉన్న బాధితుల సాక్ష్యాల్ని నమోదు చేయాలని, వారికి ప్రమాణాలతో వైద్యసాయం అందించాలని, ఒక్కో బాధితుడికి రూ. 10 లక్షలు తెలంగాణ ప్రభుత్వం పరిహారం ఇవ్వాలని రిటైర్డు న్యాయమూర్తి తన లేఖలో హైకోర్టును కోరారు. ఈ పిల్‌పై తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి ఉమాదేవిలతో కూడిన డివిజన్ బెంచ్ మంగళవారం విచారణ చేయనుంది.

జిఎస్‌టి అధికారుల హోదాల్లో మార్పు

మన తెలంగాణ/హైదరాబాద్: తెలంగాణ గూడ్స్ అండ్ సర్వీస్ ట్యాక్స్ చట్టం 2017(జిఎస్‌టి)లో భాగంగా అధికారుల హోదాలను సవరిస్తూ ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ మేరకు రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి సోమేష్‌కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. టివిఎటి చట్టం 2005లో ఉన్న ట్యాక్స్ అడిషనల్ కమిషనర్ హోదాను ప్రత్యేక కమిషనర్ ఆఫ్ స్టేట్ ట్యాక్స్‌గా హోదాను మార్చారు. అలాగే అడిషనల్ కమిషనర్‌గా ఉన్న హోదాను అడిషనల్ కమిషనర్ (గ్రేడ్ 1)గాను, జాయింట్ కమిషనర్ ఆఫ్ కమర్షియల్ ట్యాక్స్‌ను అడిషనల్ కమిషనర్‌గాను, డిప్యూటీ కమిషనర్ హోదాను, జాయింట్ కమిషనర్‌గాను, అసిస్టెంట్ కమిషనర్‌ను, డిప్యూటీ కమిషనర్‌గాను, కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్స్ హోదాను, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ట్యాక్స్‌గాను, డిప్యూటీ కమిషనర్ ట్యాక్స్ ఆఫీసర్ హోదాను స్టేట్ ట్యాక్స్ ఆఫీసర్‌గాను, అసిస్టెంట్ కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్ హోదాను డిప్యూటీ స్టేట్ ట్యాక్స్ ఆఫీసర్‌గా హోదాలను మార్చారు. ఈ హోదాలను జూన్ 22 నుంచే పరిగణలోకి తీసుకుంటున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అయితే వారి పే స్కేల్‌లో మాత్రం ఎలాంటి వ్యత్యాసమూ ఉండదని స్పష్టం చేశారు.

మూడేళ్ళలో ఎన్‌డిఎ సాధించింది శూన్యం



మన తెలంగాణ/హైదరాబాద్ : మూడేళ్ళ క్రితం కేంద్రంలో అధికారంలోకి వచ్చిన ఎన్‌డిఎ ప్రభుత్వం సాధించింది శూన్యమని, ప్రజలకిచ్చిన ఒక్క వాగ్దానాన్ని కూడా నెరవేర్చలేదని ఎఐసిసి మైనారిటీ సెల్ ఛైర్మన్ ఖుర్షీద్ అహ్మద్ ఆరోపించారు. నంద్యాల ఎన్నికల ప్రచారంలో నాలుగు రోజులు పాల్గొన్న అనంతరం ఢిల్లీకి వెళ్తూ సోమవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గోరక్ష పేరుతో దేశవ్యాప్తంగా దాదాపు 27 మందిని పొట్టన పెట్టుకున్నారని, ఇలాంటి సంఘ విద్రోహకర శక్తుల ఆటలను కట్టించడంలో విఫలమయ్యారని ఆరోపించారు. మైనారిటీలపై దాడులు పెరిగాయన్నారు. గోరఖ్‌పూర్‌లో ఆక్సిజన్ లేక చిన్నారులు ప్రాణాలను కోల్పోవడం దారుణమన్నారు. సుపరిపాలన అని ఊదరగొట్టిన నరేంద్ర మోడీ మూడేళ్లలో ఏ రంగంలోనూ తన వాగ్దానాన్ని నిలుపుకోలేదన్నారు. ముస్లింల మహిళల కోసం తలాక్ గురించి మాట్లాడుతున్న మోడీ తన భార్య గురించి ఎందుకు మాట్లాడరని నిలదీశారు. వారణాసిలోని వేర్వేరు ప్రాంతాలలో ఉన్న మఠాలలో దాదాపు 27 వేల మంది విడో మహిళలున్నారని, వారందరి గురించి ఆలోచిస్తే బాగుంటుందన్నారు. ప్రజలను పాలిస్తానని గద్దె నెక్కిన మోడీ ప్రజలను విభజిస్తూ తన అధికార పీఠాన్ని కాపాడుకుంటున్నారని విమర్శించారు. అస్తవ్యస్త పాలన కారణంగా దేశంలోకి విదేశీ పెట్టుబడులు రావడం లేదని, ఉన్న పెట్టుబడులు కూడా పోయే పరిస్థితి నెలకొందన్నారు. విపక్ష పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలలో ప్రభుత్వాలను కూల్చడం, ఎన్నికల్లో గెలవడ మే ధ్యేయంగా మోడీ పని చేస్తున్నారని దుయ్యబట్టారు. పాలనలో అనుభవం లేకపోవడం వల్లే మోడీ మూడేళ్లలో ప్రజాకాంక్షలను నెరవేర్చడంలో వైఫల్యం చెందారన్నారు. దేశంలో అవినీతి గురించి మాట్లాడే మోడీ తన హయాంలో గుజరాత్‌లో జరిగిన అవినీతి గురించి మాట్లాడటం లేదని, మధ్య ప్రదేశ్ సిఎం శివరాజ్‌సింగ్ చౌహాన్, రాజస్థాన్ సిఎం వసుంధర రాజే సింధియా అవినీతిపై ఎందుకు మాట్లాడటం లేదని ఆయన నిలదీశారు.

మోడీ, కెసిఆర్ దొందూ దొందే

మాయ మాటలను చెప్పడం, భూటకపు వాగ్దానాలను ఇవ్వడం, మైనారిటీ లను మోసం చేయడంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావులు దొందూ దొందేనని ఆయన విమర్శించారు. మైనారిటీలకు 12 శాతం రిజర్వేషన్లను ఇస్తామని చట్టం చేసిన కెసిఆర్ ఎందుకు వాటిని అమలు చేయడం లేదని ప్రశ్నించారు. ముస్లింలను మభ్యపెట్టేందుకే కెసిఆర్ 12 శాతం రిజర్వేషన్లను తెరపైకి తీసుకు వచ్చారన్నారు. రిజర్వేషన్ల అమలు కోసం త్వరలోనే కాంగ్రెస్ మైనారిటీ సెల్ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలకు శ్రీకారం చుట్టనుందని ఆయన ప్రకటించారు.



కలుపు తొలగింపు

కారణాలు ఏవైనా కలుపు మందుల వాడకం పెరుగుతూ ఉంది. వీటి ఎంపిక దగ్గర నుంచి వాడకం వరకూ నిపుణుల సలహాలు, సూచనలు పాటించాలి. మార్కెట్‌లో అందుబాటులో ఉండే కలుపు రసాయనాలు రోజు రోజుకు అధికమవుతున్నాయి. కలుపు అదుపునకు చివరి అస్త్రంగానే కలుపు మందులు ఎంచుకోవాలి. రైతులు ఈ అంశాలను గుర్తించి ముందుకు సాగాలి. ఖరీఫ్ పంటల్లో చివరి దశలోనే వాడాల్సిన కలుపు మందులు వాడాలి.



నేరుగా పొడిదుక్కిలో విత్తినప్పుడు

వరి విత్తిన వెంటనే లేదా 1, 2 రోజులలో తేమ ఉన్నప్పుడు 30 శాతం పెండిమిథాలీన్ ద్రావణం ఎకరాకు 1.0 నుంచి 1.3లీ చొప్పున 200లీ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ఏదైనా కారణం చేత విత్తిన వెంటనే కలుపు మందులు చేయక పోతే విత్తిన 20 లేదా 25 రోజుల్లో ఎకరాకు 80 నుంచి 100 మి.లీ. బిస్‌పైరీబాక్ సోడియం 10శాతం ద్రావణాన్ని 200 లీటర్ల నీటిలో కలిపి స్ప్రే చేయాలి. వరి విత్తిన 30 లేదా 35 రోజుల అనంతరం కలుపు మొక్కలు ఉంటే 2, 4డి సోడియం సాల్ట్ 80 శాతం పొడిమందు ఎకరాకు 400గ్రా చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

పొలం దమ్ము చేసి నేరుగా విత్తినప్పుడు

వరి విత్తిన 3 నుంచి 5 రోజులలో పొలంలో నీరు పలుచగా ఉన్నప్పుడు ఎకరాకు 35, 50 గ్రా అక్సాడయార్జిల్ మందును 500 మి.లీ. నీటిలో కలిపి ఆ ద్రవాన్ని ఎకరాకు 20 కిలోల పొడి ఇసుకలో కలిపి సమానంగా వెదజల్లాలి. విత్తిన వెంటనే కలుపు మందు వాడకపోతే విత్తిన 20, 25 రోజుల్లో ఎకరాకు 80, 100 మి.లీ. బిస్‌పైరీబాక్ సోడియం 10శాతం ద్రావణం 200 లీటర్ల నీటిలో కలిపి స్ప్రే చేయాలి. వరి విత్తిన 30, 35 రోజుల తర్వాత వెడల్పాకు కలుపు మొక్కలు ఉంటే 2, 4డి సోడియం సాల్ట్ 80 శాతం పొడి మందు ఎకరాకు 400గ్రా చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

మాగాణి వరి

నారుమడిలో కలపు నిర్మూలనకు ఎకరా నారుమడికి ప్రిటిలా క్లోరో 50 శాతం ద్రావణం 400 మి.లీ. 200 లీటర్ల నీటిలో కలిపి నారుమడి విత్తిన 2 లేదా 3 రోజులలో పిచికారీ చేయాలి. వరి విత్తిన 14, 15 రోజులకు ఊద నిర్మూలనకు ఎకరా నారుమడికి సైహాలోపాస్ బుటైల్ 10 శాతం ద్రావణం 400 మి.లీ. 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. మాగాణి వరిలో ఏక వార్షిక గడ్డి జాతి మొక్కలు ఎక్కువగా ఉన్న పూమ బ్యాటక్లోర 50 శాతం ద్రావణం 1 నుంచి 1.3 లీ. ఎకరాకు 20 కిలోల పొడి ఇసుకలో కలిపి నాటిన ఐదు రోజుల్లో పలుచటి నీరు ఉన్నప్పుడు సమానంగా వెదజల్లాలి. గడ్డి తుంగ వెడల్పాకు ఆకుజాతి మొక్కలు సమపాళ్ళలో ఉన్నప్పుడు ఎకరాకు 4 కిలోల బ్యుటక్లోర్ 5 శాతం గుళికలు, 4కిలోల 2, 4 డైఇథైల్ ఇస్టర్ 4 శాతం గుళికలు 20 కిలోల పొడి ఇసుకలో పలుచటి నీరు ఉన్నప్పుడు సమానంగా వెదజల్లాలి.

మొక్కజొన్న

ఎకరానికి 1 నుంచి 1.5 కిలోల అట్రాజిన్ 50 శాతం పొడి మందును 200 లీటర్ల నీటిలో కలిపి విత్తిన వెంటనే లేదా 2, 3 రోజుల్లో భూమిపై పిచికారీ చేయాలి. విత్తిన 30 లేదా 35 రోజులకు గొర్రు లేదా గుంటుకతో అంతరకృషి చేసి తరువాత బోదె నాగలితో సాళ్ళు వేసుకోవాలి. గడ్డి జాతి, వేడల్పాకు మొక్కలు ఎక్కువగా ఉన్నప్పుడు విత్తిన 20 లేదా 25 రోజులకు ఎకరాకు 24 మి.లీ. టాప్రమిజోన్ 33 శాతం ద్రావకం 200 లీటర్ల నీటిలో కలిపి స్ప్రే చేయాలి.

రాగి

విత్తిన వెంటనే, నారు నాటడానికి ముందు పెండిమిథాలీన్ 30 శాతం ద్రావకం ఎకరాకు ఒక లీటరు చొప్పున 200 లీ. నీటిలో కలిపి పిచికారీ చేయాలి. నాటిన 25, 30 రోజులకు వెడల్పాకు కలుపు మొక్కల నిర్మూలనకు ఎకరాకు 400 గ్రా, 24డి సోడియం సాల్ట్ 80 శాతం పొడి మందును 200 లీ. నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

జొన్న మరియు సజ్జ

మిత్తిన వెంటనే లేదా 3 రోజుల్లో ఎకరానికి 600 నుంచి 800 గ్రా అట్రాజిన్ 50 శాతం పొడిమందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. విత్తిన 20 రోజుల తర్వాత 2, 4 డై సోడియం సాల్ట్ 80 శాతం పొడిమందు ఎకరాకు 400 గ్రా చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి

కొర్రలు

విత్తిన వెంటనే లేదా 2 రోజుల్లో ఎకరానికి 750 మి.లీ. బుటాక్లో 50శాతం ద్రావకాన్ని 200 లీటర్ల నీటిలో కలిపి స్ప్రే చేయాలి. విత్తిన 20, 25 రోజుల తర్వాత వెడల్పాకు కలుపు మొక్కల నిర్మూలనకు 2, 4 డై సోడియం స్టాల్ 80 శాతం పొడిమందు 200 లీ. నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

కంది, సోయాచిక్కుడు

విత్తిన వెంటనే లేదా 1, 2 రోజుల్లో పెండిమిథాలీన్ 30 శాతం ద్రావకాన్ని ఎకరాకు 1.0 నుంచి 1.3 లీ. చొప్పున 200 లీ. నీటిలో కలిపి పిచికారీ చేయాలి. విత్తిన 30, 35 రోజులకు గుంటుక లేదా గొర్రుతో అంతర కృషి చేయాలి. ఎకరాకు 200 మి.లీ. ఇమిజితాపిర్ 10 శాతం ద్రావకాన్ని 200 లీ. నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

మెట్ట మినుము, పెసర

విత్తిన వెంటనే లేదా 2 రోజుల్లో పెండిమిథాలీన్ 30 శాతం ద్రావకాన్ని ఎకరాకు 1.0 నుంచి 1.3 లీ. చొప్పున 200 లీ. నీటిలో కలిపి పిచికారీ చేయాలి. విత్తిన 20, 25 రోజులకు గొర్రుతో అంతరకృషి చేయాలి. గడ్డిజాతి మొక్కల నిర్మూలనకు పెనాక్సాప్రాస్ ఇథైల్ 9 శాతం ద్రావకం ఎకరాకు 250 మి.లీ. చొప్పున ద్రావకం ఎకరాకు 400 మి.లీ. చొప్పున ఏదో ఒక మందును పైరు విత్తిన 20 రోజులప్పుడు 200 లీ. నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

వేరుశనగ

విత్తిన వెంటనే లేదా రెండు రోజుల్లో పెండిమిథాలీన్ 30 శాతం ద్రావకం ఎకరాకు 1.3 నుంచి 1.6 లేదా బుటాక్లోర్ చొప్పు ఏదో ఒక దానిని 200 లీ. నీటిలో కలిపి పిచికారీ చేయాలి. విత్తిన 25 రోజులప్పుడు గొర్రుతో అంతరకృషి చేయాలి. మొక్కల మొదళ్లకు మట్టిని ఎగదోయాలి. గడ్డిజాతి మొక్కల నిర్మూలనకు ఎకరాకు 250 మి.లీ. పెనాక్సాప్రాస్ ఇథైల్ 9శాతం ద్రావకం 200 లీటర్ల నీటిలో కలిపి స్ప్రే చేయాలి.

మిరప

నాటుటకు 2 రోజుల ముందు పెండిమిథాలీన్ 30శాతం ద్రావకం ఎకరాకు 1.3 నుంచి 1.6 లీ. లేదా ఆక్సిఫ్లోరోపెన్ 23 శాతం ద్రావకం 200 మి.లీ. చొప్పున ఏదో ఒకదానిని 200లీ నీటిలో కలిపి పిచికారి చేయాలి. నాటిని 25, 30 రోజులప్పుడు గొర్రుతో అంతరకృషి చేయాలి. గడ్డిజాతి మొక్కల నిర్మూలనకు ఎకరాకు 400 మి.లీ. క్రైజలాపాస్ ఇథైల్ 5 శాతం ద్రావకం 200 లీ.నీటిలో కలిపి స్ప్రే చేయాలి.

అధిక దిగుబడులకు సేంద్రీయ కర్బనం

నేలలో ఉండే చౌడు, రోగకారక సూక్ష్మ జీవులను నిరోధించడం, క్షార గుణాన్ని తగ్గించడం, నేలను సారవంతం చేయడంలో మేలు చేసే సూక్ష్మ జీవుల లబ్ధిని చేకూర్చటం, భూమిలో ఉండే సేంద్రీయ కర్బనం నిలవలను తరచూ పరీక్షించటం ద్వారా కర్బనం నిలవలను లెక్కగట్టాలి. నేలలో 1.5, 2.0 శాతం వరకూ సేంద్రియ కర్బనం ఉంటే భూమిలో సూక్ష్మ జీవులు వృద్ధి, నత్రజని, భాస్వరం, పొటాషియం ప్రధాన పోషకాల లభ్యత కూడా పెరుగుతుంది.

శ్రీనివాస్‌రెడ్డి పులసాని, రిపోర్టర్
ఫోన్ : 9010385659



కర్బనం నిలవలను తెలుసుకునే పద్ధతి

చెంచాతో 1 గ్రాము మట్టిని, 2 ఎం.ఎల్. పొటాషియం డైక్రోమేట్, 2ఎంఎల్ సల్ఫ్యూరిక్ ఆసిడ్‌ను ఒక సీసాలో పోసి బాగా కలపాలి. 20 నిమిషాల తర్వాత ఆ సీసాలో నీటిని పోయాలి. ఆ ద్రావణం రంగు మారుతుంది. ఇలా మారిన రంగును బట్టి మన భూమిలో కర్బనం శాతం ఎంత ఉందో తెలుస్తుంది.

రంగు	కర్బన స్థాయి
నారింజ రంగు లేదా పసుపు రంగు	తక్కువ
ముదురు గోధుమ లేదా నలుపు రంగు	మధ్యస్థం
ఆకుపచ్చరంగు లేదా నీలి రంగు	ఎక్కువ



అతి తక్కువ స్థాయి : 0.5శాతం కన్నా తక్కువగా ఉంటే కర్బన నిలవలు అతి తక్కువగా ఉన్నట్లుగా భావించాలి. హెక్టారుకు 7 లేదా 8 టన్నుల పశువుల ఎరువులు భూమిలో వేసి కలియదున్నాలి. 15 రోజుల ఆగి మరోసారి పరీక్షించాలి. అప్పటికి 1 శాతం కన్నా తక్కువ ఉంటే అదనంగా 4 లేదా 5 టన్నుల పశువుల ఎరువు వేసుకోవాలి.

మధ్య స్థాయి : 0.5, 1.0 మధ్యలో ఉంటే కర్బనం నిలువల మధ్యస్థంగా ఉన్నట్లు లెక్క. హెక్టారుకు 4 లేదా 5 టన్నుల పశువుల ఎరువు దుక్కి దున్నిన తర్వాత వేసుకోవాలి. అప్పటికీ 1 శాతం కన్నా తక్కువగా ఉంటే మరోసారి 2 టన్నులు పశువుల ఎరువులు వేయాలి.

తగినంత : 1 శాతం కన్నా ఎక్కువ కర్బనం నిలువలు ఉంటే మంచి దిగుబడులు సాధనకు సరిపడ కర్బనం నిలువలు ఉన్నట్లు లెక్క. పశువుల ఎరువు లభించక పోతే దానికి సమానమైన మోతాదులో జీవన ఎరువుల రూపంలో అందించవచ్చు.

రఫెల్ నాదల్ నంబర్‌వన్

- ముర్రే రెండు.. ఫెదరర్ మూడో స్థానం
- ఎటిపి ర్యాంకింగ్స్‌లో వెల్లడి



పారిస్ : స్పెయిన్ బుల్ రఫెల్ నాదల్ సుదీర్ఘ విరామం తరువాత మళ్లీ నంబర్‌వన్ స్థానాన్ని దక్కించుకున్నాడు. సోమవారం తాజాగా విడుదల చేసిన ఎటిపి ర్యాంకింగ్స్‌లో నాదల్ ఈ ఘనత సొంతం చేసుకున్నాడు. 2014 జులైలో పురుషుల సింగిల్స్‌లో టాప్ ర్యాంకులో నిలిచిన 31 ఏళ్ల టెన్నిస్ స్టార్ మూడేళ్ల విరామం తరువాత తొలిసారిగా నంబర్‌వన్ స్థానంలో నిలిచాడు. గతవారం ఓహియోలో జరిగిన సిన్సినాటి టోర్నీ క్వార్టర్ ఫైనల్లో టాప్ సీడ్‌గా బరిలోకి దిగిన రఫెల్ 2-65-7 తేడాతో ఆస్ట్రేలియా టెన్నిస్ స్టార్ నిక్ కిర్గియోస్ చేతిలో పరాజయం పాలైన సంగతి తెలిసిందే. అయితే ఈ టోర్నీ నుంచి ప్రస్తుత ప్రపంచ నంబర్‌వన్ ర్యాంకర్ ఆండీ ముర్రేతో పాటు స్విట్జర్లాండ్ స్టార్ రోజర్ ఫెదరర్ గాయం కారణంగా తప్పుకోవడంతో నాదల్ నంబర్‌వన్ స్థానానికి మార్గం సుగమమైంది. ఈ ఏడాది రోలాండ్ గారోస్ టోర్నీలో 15వ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను కైవసం చేసుకున్న నాదల్ ముర్రేను వెనక్కి నెట్టి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. దీంతో తరువాతి స్థానాల్లో ముర్రే 7,150 పాయింట్లతో రెండో ర్యాంకుకు పడిపోగా, రోజర్ ఫెదరర్ 7,145 పాయింట్లతో మూడో ర్యాంకులో నిలిచాడు. టాప్ పది ర్యాంకులలో మిగతా టెన్నిస్ ఆటగాళ్లు స్విట్జర్లాండ్ స్టాన్ వావ్రింకా 5, 690 పాయింట్లతో నాల్గో ర్యాంకులో నిలవగా, సెర్బియా ఆటగాడు నోవాక్ జొకోవిక్ 5,325 పాయింట్లతో ఐదో ర్యాంకులో నిలిచాడు. జర్మనీ టెన్నిస్ క్రీడాకారుడు అలెగ్జాండర్ జ్వెరావ్ 4,470 పాయింట్లతో ఆరో ర్యాంకులో ఉండగా, మారిన్ కిలిక్ (క్రోయేషియా) 4,155 పాయింట్లతో ఏడో ర్యాంకు, డొమినిక్ థీమ్ (ఆస్ట్రియా) 4, 030 పాయింట్లతో ఎనిమిదవ ర్యాంకులో నిలవగా, బల్గేరియా టెన్నిస్ ఆటగాడు గ్రిగోర్ డిమిట్రోవ్ సిన్సినాటి ఫైనల్ పోరులో నిక్ కిర్గియోస్‌పై విజయం సాధించడంతో ఏకంగా 18 స్థానాలను ఎగబాకి ఎటిపి ర్యాంకింగ్స్‌లో 9వ ర్యాంకులో నిలిచాడు. జపాన్ క్రీడాకారుడు కీ నిషికోరి 10వ ర్యాంకులో నిలిచాడు.

లంక క్రికెటర్ల బస్సును అడ్డుకున్న అభిమానులు



దంబుల్లా: ఐదు వన్డేల సిరీస్‌లో భాగంగా దంబుల్లాలో భారత్‌తో ఆదివారం జరిగిన తొలి వన్డేలో శ్రీలంక జట్టు 9 వికెట్ల తేడాతో పరాజయం పాలైన సంగతి తెలిసిందే. దీంతో టీమిండియా 1– 0తో అధిక్యంలో నిలిచింది. అంతకముందు మూడు టెస్టల సిరీస్‌లోనూ కోహ్లిసేన చేతిలో అతిథ్య జట్టు వైట్‌వాష్ అయింది. వరుసగా శ్రీలంక ఘోర పరాజయలపై ఇప్పటికే పలువురు అసంతృప్తిని వ్యక్తం చేసిన నేపథ్యంలో తొలివన్డేలో కూడా లంక ఓటమి పాలవ్వడం జీర్ణించుకోలేని ఆ దేశ క్రికెట్ అభిమానుల్లో దాదాపు 50 మంది లంక క్రికెటర్లు బస్సు ఎక్కే ప్రదేశంలో ఆందోళనకు దిగారు. లంక జట్టుకు వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో మైదానంలో బస్సు 30 నిమిషాల పాటు అక్కడే నిలిచిపోయింది. రంగంలోకి దిగిన భద్రతా సిబ్బంది ఆందోళనకు దిగిన అభిమానులను చెదరగొట్టి అక్కడి నుంచి పంపించేశారు. మరోవైపు లంక క్రికెటర్లను కోచ్ నిక్ పోథాస్ సమర్థించారు. 'లంక జట్టుపై కోపం వచ్చిందా? అంటే కచ్చితంగా రాలేదనే చెబుతాను. ఎవరిని అడిగినా ఆటగాళ్లంతా అద్భుతంగా ఆడారనే చెబుతారు. సహాయ సిబ్బంది సేవలు అద్భుతం. లంక ఆటగాళ్లకు నిరంతరాయంగా పక్క ప్రణాళికలతో సహాయపడటం ప్రసంశనీయం. ఈ విషయంలో వారిని ఎవరూ కూడా తప్పుబట్టలేరు' అని పోథాస్ వెనుకేసుకొచ్చాడు. ఈ నెల 24న పల్లెకెలెలో రెండో వన్డే జరుగనుంది.

పాక్ పర్యటనకు విండీస్, లంక జట్లు

- ధృవీకరించిన పిసిబి

లాహోర్: పాకిస్థాన్‌లో టి20 అంతర్జాతీయ సిరీస్ కోసం సెప్టెంబర్ నుంచి వెస్టిండీస్, శ్రీలంక జట్లు పర్యటించనున్నట్టు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పిసిబి) సోమవారం ధృవీకరించింది. నవంబర్‌లో టి20 అంతర్జాతీయ సిరీస్ ఆడేందుకు వెస్టిండీస్ క్రికెట్ బోర్డులతో ఒప్పందం కుదురిందని పిసిబి ఒక ప్రకటనలో పేర్కొంది. దీంతో 9 ఏళ్లలో తొలిసారి పాక్ క్రికెట్ అభిమానులు తమ దేశంలో అంతర్జాతీయ క్రికెట్ సీజన్‌ను వీక్షించే అవకాశం దక్కుతోంది. 2009 లో పాకిస్థాన్‌లో శ్రీలంక క్రికెట్ జట్టుపై ఉగ్రవాదల దాడి జరిగినప్పటి నుంచి టెస్టు పర్యటనలకు పాక్ నోచుకోలేదు. క్రికెట్ వెస్టిండీస్ బోర్డుకు పాకిస్థాన్ క్రికెట్ బోర్డుకు జరిగిన చర్చల నేపథ్యంలో లాహోర్‌లో నవంబర్ నుంచి పాకిస్థాన్‌తో వెస్టిండీస్ టి20 మ్యాచ్‌లను ఆడనున్నట్టు పిసిబి వెల్లడించింది. మరో రెండు మూడు రోజుల్లో పూర్తి స్థాయి వరల్డ్ ఎలెవన్ జట్ల వైపు నుంచి ప్రకటన వస్తుందని ఆశిస్తున్నట్టు పిసిబి చైర్మన్ నజమ్ సేథి పేర్కొన్నారు. లాహోర్‌లో ఈ ఏడాది మార్చిలో పిఎస్‌ఎల్ ఫైనల్ జరిగినప్పటి నుంచి వరల్డ్ ఎలెవన్ సిరీస్‌కు సంబంధించి చర్చలు కొనసాగుతున్నాయని అన్నారు. ఈ సిరీస్ సమయంలో పర్యాటక జట్లకు అధ్యక్ష స్థాయిలో కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేస్తామని పాక్ ప్రభుత్వం హామీ ఇచ్చిందని సేథి చెప్పారు. ఈ పర్యటనలో వరల్డ్ ఎలెవన్ నుంచి ఇద్దరు ఆస్ట్రేలియా ఆటగాళ్లు పాల్గొంటుండగా, వెస్టిండీస్, ఇంగ్లాండ్, శ్రీలంక, న్యూజిలాండ్ జట్లకు ఆటగాళ్లు కూడా పాల్గొంటున్నారని చెప్పారు. అయితే భారత క్రికెట్ బోర్డు నుంచి పాల్గొనే ఆటగాళ్లపై ఇంకా స్పష్టత లేదని ఆయన అన్నారు. 2015 లో పరిమిత ఓవర్ల సిరీస్ కోసం పాక్‌లో జింబాబ్వే మాత్రమే పర్యటించింది. వచ్చే ఏడాది కరాచీలో పాకిస్థాన్ సూపర్ లీగ్‌లో కొన్ని మ్యాచ్‌లను ఆడించేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నట్టు సేథీ తెలిపారు. లాహోర్ వేదిక కాకుండా మిగతా వేదికల్లో కూడా ఆడించేందుకు ఆయా జట్లను ఒప్పించే ప్రయత్నం చేస్తామని సేథీ ఆశాభావం వ్యక్తం చెప్పారు.



ఓటముల నుంచి ఎంతో నేర్చుకున్నా: ధావన్



దంబుల్లా: ఓటములే మనకు ఎన్నో ముఖ్యమైన పాఠాలు నేర్పుతాయని, తన క్రికెట్ కెరీర్‌లో కూడా ఎదురైన ఓటముల నుంచి ఎన్నో పాఠాలు నేర్చుకున్నానని భారత ఓపెనర్ శిఖర్ ధావన్ చెప్పాడు. శ్రీలంకతో జరిగిన తొలివన్డేలో అజేయంగా (132 పరుగులు) సెంచరీ సాధించి ధావన్ విధ్వంసం సృష్టించిన సంగతి తెలిసిందే. జట్టు విజయంలో శిఖర్ కీలక పాత్ర పోషించగా, భారత్ 9 వికెట్ల తేడాతో లంకపై విజయం సాధించింది. మ్యాచ్ అనంతరం ధావన్ మీడియాతో మాట్లాడుతూ.. గత ఏడాది న్యూజిలాండ్ సిరీస్‌లో మెరుగైన ప్రదర్శన చేయలేక జట్టులో స్థానం కోల్పోయాను. ఆ విరామం సమయంలో ఓటముల నుంచి ఎన్నో ముఖ్యమైన పాఠాలను నేర్చుకున్నాను. ఈ ఏడాది ఛాంపియన్ ట్రోఫీలో జట్టులో తిరిగి స్థానం దక్కించుకోగలిగాను. భవిష్యత్తులోనూ ఇదే తరహా ప్రదర్శన కొనసాగించాలనుకుంటున్నాను. వచ్చే ప్రపంచ కప్‌కు చాలా సమయం ఉంది. అప్పటివరకూ జట్టులో మెరుగైన ప్రదర్శనతో ఆకట్టుకునే ఉంటాను. అదే నా ముందున్న ప్రధాన లక్ష్యం. ఒకవేళ నేను మెరుగైన ప్రదర్శన చేయని పక్షంలో ఆ స్థానాన్ని ఎవరైనా భర్తీ చేయెచ్చు. 2013 ఛాంపియన్ ట్రోఫీలో వన్డే మ్యాచ్‌లో కూడా ఇదే తరహా ప్రదర్శన చేశాను. పిచ్ ఎలా ఉన్నా పట్టించుకోను. కేవలం బంతిని ఎలా ఆడాలనేదానిపైనే ఆలోచిస్తాను. ఈ టోర్నీలో లంక బౌలర్లు బాగా రాణించారు. లంక క్రికెట్ జట్టులో అంతర్జాతీయ క్రికెట్ అన్ని ఫార్మాట్లలో మలింగ అద్భుతంగా రాణించాడు. వరుస పరాజయాలు లంక జట్టుకు గొప్ప అనుభవంగానే చెప్పాలి. తదుపరి వన్డేలో శ్రీలంక అద్భుతంగా రాణిస్తుందని అనుకుంటున్నా' అని ధావన్ అభిప్రాయపడ్డాడు.

Printed and published by K Sreenivas Reddy, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037, R.R.Dist., TELANGANA and Published from H.No.12-1-493/VA, Giriprasad Bhavan,Opp:Rajiv Swagruha Offices Complex, Bandlaguda Main Road, Nagole, R.R. Dist. and owned by M/s. Moveon Media Private Limited, **Editor: K. Sreenivas Reddy,** RNI Regn. No.TELTEL/2012/42234, Phone No/Fax:040-27655666, e-mail : editor@manatelangana.org.